**ముహూర్తం**

శ్రీ వికారినామ సంవత్సరం, దక్షిణాయణం, శరదృతువు, ఆశ్వయుజమాసం, కృష్ణపక్షం; తిథి: ఏకాదశి రా.10.18 వరకు; నక్షత్రం: మఖ మ.1.18 వరకు; అమృతకాలం: ఉ.11.06 నుండి మ.12.34 వరకు; వర్జ్యం: రా.8.32 నుండి 9.59 వరకు; దుర్ముహూర్తం: ఉ.10.05 నుండి 10.51 వరకు, మ.2.41 నుండి 3.27 వరకు; రాహుకాలం: మ.1.26 నుండి 2.52 వరకు; యమగండం: ఉ.6.15 నుండి 7.41 వరకు;

Estd. 1938

# ఆంధ్రప్రభ

www.prabhanews.com

Journalism first!



కపిల్ చిట్స్‌తో బంధం ఆనందాల అనుబంధం

KAPIL GROUP

Visit Us: www.kapilchits.com

39 YEARS Safeguarding Trust

కపిల్ చిట్స్

కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం



సంపుటి:58 • సంచిక: 185 • గురువారం 24 అక్టోబర్ 2019 • హైదరాబాద్ * పేజీలు:10+12 • వెల: 5.00 • Published from:Hyderabad|Karimnagar|Nizamabad|Suryapet|Vijayawada|Guntur|Rajahmundry|Visakhapatnam|Tirupati|Kurnool|Anantapur|Nellore


# 21 డిమాండ్లపై ఈడీల కమిటీ మేధోమథనం

## అంశాల వారీగా సాధ్యాసాధ్యాలపై నిశిత పరిశీలన

భారమైనవి ఏవి?
తీర్చగలిగినవేవి?
వెంటనే చేయదగినవేవి?
సమయం పట్టే సమస్యలేవి?
కేటగిరీలుగా విభజించి లోతుగా చర్చించిన కమిటీ
నేడు మళ్లీ భేటీ.. రవాణా కమిషనర్‌కు నివేదిక



కొన్నింటిపై సానుకూలం... కొన్ని డిమాండ్లు సహేతుకం కాదని భావన.. ఆర్థిక సమస్యపై పరిష్కారం దిశగా కసరత్తు

| డబుల్ డ్యూటీకి డబుల్ వేతనం | డబుల్ డ్యూటీలు ఎప్పుడో ఎత్తేశారు | స్పేర్ పార్టుల జాప్యం | కార్మిక సంఘాలకు సంబంధం లేదు |
|---|---|---|---|

ఉద్యోగ భద్రతపై పరిశీలించిన బృందం ఇప్పటి వరకు సంస్థలో పని చేస్తున్న ఉద్యోగులెవరూ అభద్రతాభావంతో ఉన్న విషయం అధికారుల దృష్టికి రాలేదన్న నిర్ధారణకు వచ్చింది.

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** ఆర్టీసీ కార్మికుల డిమాండ్లను పరిశీలించేందుకు ఏర్పాటైన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఈడీ)ల కమిటీ బస్ భవన్‌లో బుధవారం భేటీ అయ్యింది. మంగళవారం ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్ నిర్వహించిన సమావేశంలో కార్మికుల 21 డిమాండ్లపై అధ్యయనం చేసేందుకు ఈడీల కమిటీకి బాధ్యతలను అప్పగించిన విషయం తెలిసిందే. కార్మికుల డిమాండ్ల సాధ్యాసాధ్యాలపై కమిటీ పరిశీలిస్తోంది. డిమాండ్లలోని ఏయే అంశాలను వెంటనే పరిష్కరించేందుకు వీలుంది, వేటిని దీర్ఘకాలంలో పరిష్కరించవచ్చు అనే అంశాలపై తొలిరోజు సమాలోచనలు జరిపారు. కేటగిరీల వారీగా ఖాళీలు, వాటి భర్తీ, ఫలితంగా సంస్థపై పడే భారం, ఖాళీలుండటం వల్ల ప్రస్తుతం సంస్థకు ఏమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయా అన్న అంశాలను ➪ 7వ పేజీలో...

## నిరసనలు.. వినతులు

19వ రోజు ఆర్టీసీ సమ్మె • దిల్‌షుఖ్‌నగర్ డిపో ఎదుట జేఏసీ ఆధ్వర్యంలో వంటావార్పు • గుండెపోటుతో ఇద్దరు కార్మికుల మృతి • జహీరాబాద్‌లో మహిళా కండక్టర్ ఆత్మహత్యాయత్నం 7

బస్సుల్లేవ్.. చదువుతూ... నిరసన!



జనగామ డిపో ఎదుట విద్యార్థుల బైఠాయింపు

## చర్చలకు పిలిస్తే మేం సిద్ధం

జేఏసీ కన్వీనర్ అశ్వత్థామ రెడ్డి 7



కొల్లూరులో డబుల్ బెడ్‌రూం ఇళ్ల పనుల ప్రగతిని పరిశీలిస్తున్న మంత్రి కేటీఆర్

## మోడల్ టౌన్‌షిప్‌గా కొల్లూరు డబుల్ ఇళ్ల కాలనీ 3

ఒకేచోట 117 బ్లాకులు.. 15,660 ఇళ్లు
ఆధునిక మౌలిక సౌకర్యాలతో అద్భుతంగా నిర్మాణం • పక్కా గృహాల పథకానికి కొత్త వన్నెలు • దేశంలో మరెక్కడా ఒకేచోట ఇలా పేదల ఇళ్లు కట్టలేదు
మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్

## హుజూర్‌నగర్ ఫలితం నేడే

సర్వత్రా ఉత్కంఠ
గెలుపుపై టీఆర్ఎస్, కాంగ్రెస్ ధీమా
బలం పెరిగిందంటున్న కమలం • సరికొత్త రాజకీయ చిత్రాలకు వేదిక కానున్న ఫలితం



**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** హుజూర్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గ విజేతలెవరో గురువారం తేలిపోతుంది. కాంగ్రెస్ కంచుకోటగా, హ్యాట్రిక్ నియోజక వర్గంగా ముద్రపడ్డ హుజూర్‌నగర్‌పై తొలిసారి గులాబీ జెండా ఎగురుతుందా? ఎగ్జిట్ పోల్స్ అంచనాలు నిజమవుతాయా? ఫలితం ఎలా ఉండబోతోంది. కంచుకోటను కాంగ్రెస్ ➪ 2వ పేజీలో...

---

సింగరేణి కార్మికులకు
## దీపావళి బోనస్

ఒక్కో కార్మికుడికి రూ.64,700 2
రేపు పంపిణీకి నిర్ణయం
గత ఏడాదికంటే రూ.4200 పెరుగుదల
50 వేల మందికి లబ్ధి

## మళ్లీ కృష్ణమ్మ ఉగ్రరూపం

శ్రీశైలం గేట్లు ఎత్తడం ఒకే సీజన్‌లో ఇది ఏడోసారి



2



## అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు

సీఎం కేసీఆర్‌కు ప్రతాపరెడ్డి కృతజ్ఞతలు

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** వరుసగా రెండు ఎన్నికల్లో సీఎం కేసీఆర్‌కు ప్రత్యర్థిగా నిలిచిన వంటేరు ప్రతాపరెడ్డికి కార్పొరేషన్ చైర్మన్ పదవి దక్కింది. గజ్వేల్ నియోజకవర్గానికి చెందిన వంటేరు ప్రతాపరెడ్డి ఎన్నికల అనంతరం గులాబీ కండువా కప్పుకున్నారు. దీంతో ➪ 3వ పేజీలో...

ప్రగతికి ఆర్థిక చర్యల ఊతం
## సంస్కరణలతో పేదరికానికి చెక్

హైదరాబాద్‌లో మహేష్ కో-ఆపరేటివ్ బ్యాంకు నూతన భవన ప్రారంభోత్సవంలో లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా 6



## బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్ విలీనం

ప్రైవేటీకరణ ఊహాగానాలకు తెర
బలోపేతానికి భారీ ఉద్దీపనం 6
కేంద్ర కేబినెట్ నిర్ణయం




# చదువుల సరస్వతులు



ఉన్నత విద్యలో దూసుకుపోతున్న భారతీయ మహిళలు
సంస్కరణల వేగవంతతో అభివృద్ధి చెందిన దేశాలతో సమానంగా విద్యావంతులు
ఉన్నత విద్యపై అఖిల భారత సర్వే వెల్లడి

**(న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి)**

ఉన్నత విద్యావకాశాల్ని అందిపుచ్చుకోవడంలో భారతీయ మహిళలు ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ విషయంలో వారు పురుషులతో పోటీపడుతున్నారు. డిగ్రీ, ఇంజనీరింగ్, మెడికల్, తత్సమానమైన విద్యా సంస్థల్లో చేరుతున్న మహిళల సంఖ్య ఏటేటా పెరుగుతోంది. 2018-19లో తొలిసారిగా పురుషుల కంటే మహిళలు ఎక్కువగా ఉన్నత విద్యాసంస్థల్లో చేరారు. భారత దేశస్థాయిలో 2019-20లో ఉన్నత విద్యాకోర్సుల్లో చేరిన పురుషుల సగటు 26.3 శాతం. మహిళల్లో 26.4 శాతం మంది ఈ కోర్సుల్లో సీట్లు సాధించారు. గతేడాది కూడా పురుషుల్లో 26.3 శాతమే ఈ ఉన్నత విద్యాభ్యాసానికి నమోదయ్యారు. అంతకముందు ఏడాది ఇది 26 శాతమే. కానీ మహిళల్లో మాత్రం ఉన్నత విద్యాభ్యాసం చేస్తున్న వారి సంఖ్య అనూహ్యంగా పెరుగుతోంది. 2014-15లో ఇది కేవలం 23.2 శాతమే. ఐదేళ్ళ కాలపరిధిలో మహిళల్లో ఉన్నత విద్యాభ్యాసం చేస్తున్న వారి సంఖ్య 3.2 శాతం పెరిగితే ఇదే ఐదేళ్ళలో పురుషుల్లో ఈసంఖ్య ఒక్క శాతం మాత్రమే పెరిగినట్లు ఆలిండియా సర్వే ఆన్ హయ్యర్ ఎడ్యుకేషన్ నివేదిక స్పష్టం చేసింది.

ఇది జనాభాలో స్థూల నమోదు నిష్పత్తిని దేశవ్యాప్తంగా అంచనా కట్టింది. 18 నుంచి 23ఏళ్ళ మధ్య వయస్కుల విద్యాభ్యాసాన్ని ఇందుకు ప్రాతిపదికగా తీసుకుంది. నిర్దిష్ట వయసు, సమూహాలకు అనుగుణంగా ఈ సర్వే నిర్వహించింది. దేశంలో ఉన్నత విద్యలో చేరుతున్న పురుషులు, మహిళల సంఖ్యను అంచనాలేసింది. ఈ నివేదిక మేరకు దేశం మొత్తం మీద ఉన్నత విద్యపట్ల ఆసక్తి పెరుగుతోంది. అయితే ఉన్నత వర్గాలతో పోలిస్తే అట్టడుగు వర్గాల్లో ఇది మరింతగా ప్రస్ఫుటమౌతోంది.

2014-15 సంవత్సరంలో ఎస్సీ వర్గాలకు చెందిన జనాభాలో ➪ 3వ పేజీలో...

# డెంగ్యూ చంపేస్తోంది





రంగంలోకి దిగండి

మా ఆదేశాలు అమలు చేయాల్సిందే
ఓ న్యాయాధికారి చనిపోయారు తెలుసా?
సీఎస్, వైద్యాధికారులను హాజరు పరచండి
డెంగ్యూ నివారణ చర్యలపై హైకోర్టు అసంతృప్తి - అధికారుల తీరుపై అసహనం

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** ''తెలంగాణ ప్రజలను డెంగ్యూ మహమ్మారి చంపేస్తోంది. అయినా ప్రభుత్వం మాత్రం స్పందించడం లేదు. చర్యలు తీసుకున్నాం అని చెబుతున్నారు. ఏం తీసుకున్నారు..? ప్రజల్లో డెంగ్యూపై అవగాహన కల్పించేందుకు పోస్టర్లు, హోర్డింగ్‌లు ఎక్కడైనా ఏర్పాటు చేశారా..? లేదు. దోమలకు అధికారి అయినా.. పేదోడైన ఒకటే. వాటికి వ్యత్యాసాలు తెలీవు. డెంగ్యూ దోమ అందరినీ కుట్టేస్తోంది. డెంగ్యూ జ్వరంతో ఖమ్మం రెండవ అదనపు ఫస్ట్ క్లాస్ జుడీషియల్ మేజిస్ట్రేట్ ఎం.జయమ్మ ➪ 5వ పేజీలో...


## రాజకీయాలు.. ఆర్థిక నేరాలు!

8

# డిగ్రీలో తెలుగు వెలుగేదీ..?

- తగ్గుతున్న తెలుగు మీడియం విద్యార్థులు
- 4 ఏళ్లలో 47 శాతం తగ్గుదల
- 2016-17లో చేరింది 59,210 మంది
- 2019-20లో 30,763 మంది చేరిక
- మొత్తం డిగ్రీలో చేరిన వారు 2,22,708 మంది
- తెలుగు మీడియం విద్యార్థులు 14 శాతమే
- కోర్సుల తొలగింపే ఇందుకు కారణం

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** రాష్ట్రంలో డిగ్రీలో చేరే తెలుగు మీడియం విద్యార్థులు ఏటికేటా తగ్గుతూ వస్తున్నారు. గత నాలుగేళ్లల్లో 47 శాతం మంది తగ్గారు. అటు ప్రభుత్వ, ఇటు ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో ఈ తగ్గుదల కనిపిస్తోంది. ఏటా జరిగే డిగ్రీ ప్రవేశాల్లో 15 నుంచి 20 శాతానికి మించి తెలుగు మీడియం వారు ఉండటం లేదు. ఈ ఏడాది కేవలం 14 శాతం మంది మాత్రమే తెలుగు మీడియం విద్యార్థులున్నారు. తెలుగు మీడియంలో చేరుతున్న వారిలో అబ్బాయిలు ఎక్కువగా ఉంటుండగా.. ఇంగ్లీష్ మీడియంలో చేరుతున్న వారిలో అమ్మాయిలు ఎక్కువగా ఉంటున్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో తెలుగు మీడియం కోర్సులను తొలగించడం, ఎయిడెడ్ డిగ్రీ కాలేజీలను తగ్గించడం ఈ పరిస్థితికి కారణం.




### నాలుగేళ్లలో సగానికి సగం తగ్గుదల

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం 2016-17 నుంచి ప్రత్యేకంగా డిగ్రీ ఆన్‌లైన్ సర్వీస్ తెలంగాణ (దోస్త్) పేరుతో అడ్మిషన్లు చేపడుతున్నారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే వారికి ఇంటర్‌లో వచ్చిన మార్కులు, రిజర్వేషన్ ఆధారంగా సీట్లను కేటాయిస్తున్నారు. 2016-17 నుంచి దోస్త్ ద్వారా అడ్మిషన్లు చేపట్టిన సంవత్సరంలో తెలుగు మీడియంలో 59,210 మంది విద్యార్థులు చేరారు. ఆ తరువాత తెలుగు మీడియంలో చేరే వారి సంఖ్య ఏటా 10వేలకు పైగా తగ్గుతోంది. ఈ ఏడాది డిగ్రీలో చేరిన తెలుగు మీడియం విద్యార్థులు 30,763 మంది. నాలుగేళ్ల కాలంలో 28,447 మంది తగ్గారు.

### తెలుగు మీడియం కోర్సుల తొలగింపు

ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో తెలుగు మీడియం కోర్సుల్లో విద్యార్థులు చేరడం లేదనే సాకుతో కళాశాల విద్య కమిషనర్ కొన్ని తెలుగు మీడియం కోర్సులను తొలగించారు. దీనిపై విద్యార్థులతోపాటు, విద్యార్థి సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేశాయి. కళాశాల విద్య కమిషనర్ ఏకపక్షంగా ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో కొనసాగుతున్న తెలుగు మీడియం కోర్సులను తొలగించారని వాటిని తిరిగి కొనసాగించాలని డిమాండ్ చేస్తూ కొన్ని విద్యార్థి సంఘాలు ఆందోళన చేపట్టి.. ఇదే విషయాన్ని విద్య శాఖ కార్యదర్శి జనార్దన్‌రెడ్డి దృష్టికి కూడా తీసుకెళ్లాయి. దీంతోపాటు రాష్ట్రంలోని కొన్ని ఎయిడెడ్ కాలేజీలను ప్రైవేటు కాలేజీలుగామార్చడం కూడా కారణంగా విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి.

**నాలుగేళ్లలో తెలుగు మీడియంలో చేరిన వారు**

| విద్యా సంవత్సరం | విద్యార్థులు |
|---|---|
| 2016-17 | 59,210 |
| 2017-18 | 45,608 |
| 2018-19 | 37,885 |
| 2019-20 | 30,763 |

**నాలుగేళ్లల్లో తెలుగు మీడియం విద్యార్థుల శాతం**

| విద్యా సంవత్సరం | విద్యార్థులు | మొత్తం చేరినవారు | శాతం |
|---|---|---|---|
| 2016-17 | 59,210 | 2,15,263 | 27 |
| 2017-18 | 45,608 | 2,00,805 | 23 |
| 2018-19 | 37,885 | 2,01,867 | 18 |
| 2019-20 | 30,763 | 2,22,707 | 14 |

## సింగరేణి కార్మికులకు దీపావళి బోనస్

- ఒక్కో కార్మికుడికి రూ.64,700
- 25న పంపిణీకి నిర్ణయం

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** సింగరేణి కార్మికులకు యాజమాన్యం తీపి కబురు అందించింది. రికార్డుస్థాయి లాభాల్లో దూసుకువెళ్తున్న సింగరేణి సంస్థ ఇటీవల సిఎం కేసీఆర్ ఆదేశాల మేరకు లాభాల వాటా పంచగా, ఇపుడు దీపావళి బోనస్ పంచేందుకు ఏర్పాట్లుచేస్తోంది. ఈనెల 25న కార్మికులకు ఈ బోనస్ పంచనుంది. ఒక్కో కార్మికుడికి రూ.64,700 దీపావళి బోనస్ దక్కనుంది. గత ఏడాది కార్మికులకు రూ.60,500 మాత్రమే బోనస్ ఇవ్వగా, ఇపుడు రూ.4,200 అదనంగా పెంచారు. సింగరేణి వ్యాప్తంగా ఉన్న 50వేల మంది కార్మికులకు ఈ బోనస్ దక్కనుంది. బోనస్ పంపిణీపై అనుమానాలు నెలకొన్న నేపథ్యంలో సింగరేణి యాజమాన్యం, గుర్తింపుసంఘాల నేతలు బుధవారం దీనిపై స్పష్టతనిచ్చారు. సింగరేణి సంస్థ గత ఐదేళ్ళలో భారీగా విస్తరించగా, కార్మికులకు అందే వేతనాలు, సౌకర్యాలు అన్నీ పెరిగాయి. ఇటీవల ఒక్కో కార్మికునికి చరిత్రలో మునుపెన్నడూలేనివిధంగా రూ.లక్ష లాభాల బోనస్ దక్కింది.

## హుజూర్‌నగర్ ఫలితం నేడే

(మొదటిపేజీ తరువాయి)

నిలుపు కుంటుందా? కారు బద్దలుకొడుతూ దూసుకువెళ్తుందా అన్నది మరికొద్ది గంటల్లో తేలుతుంది. 2,36,842మంది ఓటర్లున్న హుజూర్‌నగర్ నియోజక వర్గంలో 2,00,726మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. హుజూర్‌నగర్ నియోజక వర్గంలో నేరేడుచర్ల, పాలక వీడు, గరిడేపల్లి, మేళ్ళ చెర్వు, చింతల పాలెం, మఠంపల్లి, హుజూర్‌నగర్ మండలాలుండగా, వోటింగ్ ముగియగానే బూత్‌ల వారీ లెక్కలు, పోలింగ్ సరళిపై ఎవరిఅంచనాల్లో వారు మునిగిపోయారు. టీఆర్‌ఎస్ అభ్యర్థిగా శానంపూడి సైదిరెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థిగా పీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సతీమణి, మాజీ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి పోటీచేశారు. ఇద్దరూ గత ఎన్నికల్లో ఓడిపోగా.. సానుభూతి వర్కవుట్ అవుతుందని చెప్పారు. క్షేత్రస్థాయిలో హోరాహోరీగా ప్రచారం చేశారు. వ్యూహాలు అమలుచేశారు. భారతీయ జనతా పార్టీ అభ్యర్థిగా డాక్టర్ రామారావు బరిలోకి దిగగా, గతం కన్నా బలం పెరుగుతుందని, క్యాడర్ విస్తరణకు ఎన్నిక దోహదపడిందని అంచనా వేస్తోంది. ఈ ఎన్నికకోసం సీఎం కేసీఆర్ ముందునుండే వ్యూహాత్మకంగా సామాజికసమీకరణల పావులు కదపగా, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఒకరోజు రోడ్‌షో నిర్వహించారు. పార్టీ ఉప ఎన్నికల ఇన్‌ఛార్జిగా సీఎం వ్యూహాలను ఖచ్చితంగా అమలుచేయగలిగిన రాష్ట్ర ప్రధానకార్యదర్శి పల్లా రాజేశ్వరరెడ్డిని నియమించారు. పార్టీకి సంబంధించిన మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు విస్తృతంగా పర్యటించారు. గెలుపుకోసం శ్రమించారు. జిల్లామంత్రి జగదీష్‌రెడ్డి ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకుని యంత్రాంగాన్ని నడిపించారు. మంత్రి సత్యవతిరాథోడ్, విప్ కర్నె ప్రభాకర్, ఎమ్మెల్సీలు శేరిసుభాష్‌రెడ్డి, పోచంపల్లి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ ఛైర్మన్‌లు, ఎంపీలు తీవ్రంగా కష్టపడ్డారు. ఈ నేపథ్యంలో గెలుపు ఖాయమన్న ధీమాలో ఉంది. ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ఉన్న విశ్వాసం, ఈ ప్రభుత్వం మరో నాలుగేళ్ళు ఉండనుండడం, సామాజిక సమీకరణలు, చేసిన శ్రమ అన్నీ కలిసొస్తాయన్న అంచనాలో ఉంది. ఈ అంచనాలన్నీ ఏమేరకు నిజం అవుతాయో మరికొద్దిగంటల్లో రానున్న ఫలితం చెప్పనుంది. టీఆర్‌ఎస్ 20వేల మెజారిటీపై ఆశలు పెట్టుకుంది. ఈ ఎన్నిక ద్వారా ఉప ఎన్నికల విజయాల్లో తమకు తిరుగులేదని నిరూపించుకుంటామన్న విశ్వాసంతో ఉన్నారు. మరోవైపు కాంగ్రెస్ కూడా గెలుపుపై ఆశలు పెట్టుకుంది. కంచుకోట నిలుపుకుంటామని ధీమాగా చెబుతోంది. నేతలంతా కలిసిరావడం, పీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్థానికంగానే మకాం వేసి పనిచేయడం వల్ల విజయతీరాలకు చేరామన్న భావనను కాంగ్రెస్ నేతలు వ్యక్తం చేస్తున్నారు. పోటీ నువ్వానేనా అన్నట్లు సాగినా విజయం తమదేనని ధీమా వ్యక్తం చేస్తున్నారు. స్వతంత్ర అభ్యర్థుల్లో తీన్మార్ మల్లన్న ప్రభావం చూపినట్లు ఓటింగ్ సరళి ఆధారంగా అంచనా వేస్తుండగా, ట్రాక్టర్, రోడ్డురోలర్ ఎఫెక్ట్ ఏమేరకు ఉంటుందో ఈవిఎంలు తెరిస్తే గానీ తేలదు. చర్చలు, ఊహాగానాలు ఎలా ఉన్నా.. అసలు బాక్సుల్లో ఓటరు ఏ గీతగీశాడో.. ఏ మీట నొక్కాడో అన్న ఉత్కంఠ అందరిలోనూ ఉంది.



## తీర్పునుబట్టి మార్పు

- కాంగ్రెస్ పార్టీ భవిష్యత్‌పై నేతల లెక్కలు
- ప్రభావం చూపనున్న హుజూర్‌నగర్ ఫలితం

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** హుజూర్‌నగర్ శాసన సభా స్థానానికి జరిగిన ఉప ఎన్నిక ఫలితం గురువారం వెలువడనుంటంతో, కాంగ్రెస్ పార్టీలో ఉత్కంఠ నెలకొంది. సిట్టింగ్ సీటు నిలబెట్టుకోగలిగితే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఉంటుందని, ఒక వేళ చేజారితే మాత్రం పార్టీపైన తీవ్ర ప్రభావం పడుతుందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. టీ పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నల్లగొండ పార్లమెంట్ నియోజవర్గం నుంచి పోటీ చేసి విజయం సాధించడంతో హుజూర్‌నగర్ శాసనసభా స్థానానికి రాజీనామా చేశారు. దాంతో ఉపఎన్నిక నిర్వ హించారు. ఈ నియోజక వర్గం నుంచి ఉత్తమ్‌కుమార్ రెడ్డి సతీమణి పద్మావతిరెడ్డి పోటీచేయగా, అధికార టీఆర్‌ఎస్ నుంచి సైదిరెడ్డితో పాటు టీడీపీ, బీజేపీతో పాటు స్వంతంత్రులు కూడా బరిలో నిలిచారు. ఉప ఎన్నికల ప్రచారం హోరాహోరీగా జరిగినప్పటికి కాంగ్రెస్, టీఆర్‌ఎస్ మధ్యే ప్రధాన పోటీ నెలకొన్నది. ఈ హోరాహోరి పోరులో అధికార టీఆర్‌ఎస్‌కే మొగ్గు ఉందని పలు ఎగ్జిట్‌పోల్స్ స్పష్టం చేశాయి. అయితే కాంగ్రెస్ పార్టీ మాత్రం ప్రజలు తమ వైపే ఉన్నారని, కచ్చితంగా విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేస్తోంది. ప్రధానంగా టీ పీసీసీ సారథి మార్పు అంశం తెరపైకి వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు. గురువారం ఫలితం కూడా వెలువడుతుండటంతో ఇక పార్టీలో మార్పులు ఎలా ఉంటాయనే చర్చ మొదలైంది. అయితే త్వరలో మున్సిపల్ ఎన్నికల జరగనున్నందున, అప్పటివరకు మార్పు ఉండకపోవచ్చనే వాదన కూడ వినిపిస్తోంది. ఇదిలా ఉంటే హుజూర్‌నగర్‌లో కాంగ్రెస్ విజయం సాధిస్తే రాష్ట్ర పార్టీలో ఉత్తమ్ వర్గీయులదే పై చేయి అయ్యే అవకాశం ఉంటుందని, ఒక వేళ హుజూర్‌నగర్ 'చే' జారితే మాత్రం పరిస్థితి వేరుగా ఉంటుందనే చర్చ అప్పుడే మొదలైంది.హుజూర్‌నగర్‌లో తమదే విజయమని టీ పీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి అన్నారు.

## తెలంగాణకు అవార్డుల పంట

- ఏడు జాతీయ పంచాయతీ పురస్కారాలు
- 'పైడిమడుగు'కు బాల్యమిత్ర అవార్డు



**న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ :** తెలుగు రాష్ట్రాలకు అవార్డుల పంట పండింది. 2019 సంవత్సరానికిగాను తెలంగాణా రాష్ట్రాన్ని ఏడు జాతీయ పంచాయతీ పురస్కారాలు వరించాయి. బుధవారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమం లో కేంద్ర పంచాయతీ రాజ్ శాఖా మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ ముఖ్య అతిథిగా హాజరై అవార్డులను ప్రదానం చేశారు. వివిధ విభాగాల్లో ఆంధ్రప్రదేశ్‌కు 13, తెలంగాణ రాష్ట్రానికి 7 పురస్కారాలు దక్కాయి. తెలంగాణ నుంచి జగిత్యాల జిల్లాలోని పైడిమడుగు గ్రామానికి 'బాల్యమిత్ర' పంచాయతీ పురస్కారం లభించింది. తెలంగాణలోని పెద్దపల్లి జిల్లా రాఘవపూర్ గ్రామానికి 'నానాజీ దేశ్‌ముఖ్' జాతీయ గౌరవ గ్రామ పురస్కారం దక్కింది. దీన్ దయాళ్ ఉపాధ్యాయ్ పంచాయతీ సశక్తికరణ్ పురస్కారాలు జిల్లాల విభాగంలో ఆదిలాబాద్ జిల్లా, మండల పంచాయతీ పురస్కారాలు మంథని, వెల్గటూరు మండలాలకు, గ్రామ పంచాయతీ అవార్డుల విభాగంలో మెదక్ జిల్లాలోని మల్కాపూర్, సిద్ధిపేట జిల్లాలోని, పెద్దపల్లి మల్లారం, నిజామాబాద్ జిల్లాలోని నాగపూర్ గ్రామాలకు లభించాయి. కేంద్ర మంత్రి చేతుల మీదుగా వివిధ విభాగాల్లో అందజేసిన జాతీయ పంచాయతీ పురస్కారాలను సంబంధిత విభాగాల అధికారులు, సిబ్బంది, గ్రామపెద్దలు అందుకున్నారు.

## మరోసారి కృష్ణమ్మ ఉగ్రరూపం

- నాగార్జునసాగర్ 18 గేట్లు ఎత్తిన అధికారులు
- శ్రీశైలం గేట్లు ఒకే సీజన్‌లో ఏడోసారి ఎత్తడం చరిత్రలో తొలిసారి



**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** కృష్ణమ్మ మరోసారి ఉగ్రరూపం దాల్చింది. ఇటు శ్రీశైలం డ్యామ్‌తో పాటు అటు నాగార్జునసాగర్‌కు కూడా వరద ఉధృతి కొనసాగుతోంది. దీంతో శ్రీశైలం డ్యామ్ పది గేట్లను ఎత్తివేసి నీటిని దిగువకు విడుదల చేస్తుండగా, నాగార్జునసాగర్ 18గేట్లను ఎత్తేశారు అధికారులు. శ్రీశైలం డ్యామ్‌లో పూర్తిస్థాయి నీటి మట్టం ఉండగా, ఇన్‌ఫ్లో 5.18లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. దీంతో 10గేట్లను పది అడుగులు ఎత్తి 4.46 లక్షల క్యూసెక్కులుగా ఉంది. మరోవైపు శ్రీశైలం కుడి, ఎడమగట్టు జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది. కృష్ణ, తుంగభద్ర నదుల నుండి వరద ఉధృతి కొనసాగుతుండగా, ఈసీజన్‌లో ఏడోసారి జలాశయం గేట్లను ఎత్తేశారు. ఇక శ్రీశైలం నుండి వరద పోటెత్తుతుండడంతో నాగార్జు నసాగర్ గేట్లను అధికారులు ఎత్తారు. ప్రాజెక్టులోకి 3.13లక్షల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా, అంతేమొత్తాన్ని దిగువకు విడిచి పెడుతున్నారు. సాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా, ప్రస్తుతం 589అడుగుల దగ్గర నీటిప్రవాహం కొనసాగుతోంది. మరోవైపు ప్రకాశం బ్యారేజీకి ఎగువ నుండి వరద పోటెత్తింది. దీంతో ప్రాజెక్టు 62గేట్లు ఎత్తి లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడిచిపెడుతున్నారు. జూరాల ప్రాజెక్టుకు భారీగా ఇన్‌ఫ్లోలు వస్తుండగా, 36గేట్లను ఎత్తారు.

### నవంబర్ 5న లెక్క తేలుద్దాం

**కేఆర్ఎంబీ భేటీలో తేలనున్న వాటా**


కృష్ణానదీయాజమాన్యబోర్డు సమావేశం నవంబర్ 5న నిర్వహిస్తున్నామని బోర్డు మెంబర్ సెక్రటరీ పరమేశం ఈఎన్‌సిలకు లేఖ రాశారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరీ, కర్నూలు-కడప కెనాల్, కృష్ణాడెల్టా సిస్టం తదితర ప్రాజెక్టుల్లో నీటి లెక్కలపై తెలంగాణ అనుమానాలు వ్యక్తం చేయగా, ఇటీవల జరిగిన సమావేశాల్లో దాటవేత ధోరణి కనబరి చారు. ఈ నేపథ్యంలో నవంబర్ 5న లెక్క తేల్చాలని కెఆర్ ఎంబి నిర్ణయించింది.

### తీరిన కరెంట్ కష్టాలు..!

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో కృష్ణాబేసిన్ పరిధిలో ఉన్న జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు కళకళలాడుతున్నాయి. కృష్ణా నదిలో నీటి ప్రవాహాలు గరిష్ట స్థాయిలో కొనసాగుతున్నాయి. ఫలితంగా జల విద్యుత్ ఉత్పత్తిలో రాష్ట్రం కొత్త రికార్డులు నెలకొల్పుతోంది. ఒకపక్క విద్యుత్ వినియోగం తగ్గటం, మరో పక్క జలవిద్యుత్ ఉత్పత్తి పెరగటంతో సంస్థలు ఆర్థికంగా ఊపిరి పీల్చుకుంటున్నాయి. జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ద్వారా ఈఏడాది ఇప్పటి వరకు 2,716 మిలియన్ యూనిట్ కరెంట్ ఉత్పత్తి జరిగింది. గతేడాది ఇదే సమయానికి 1,364 మిలియన్ యూనిట్లు కరెంట్ మాత్రమే ఉత్పత్తి చేయగలిగారు. రాష్ట్రంలో 8,532 మెగావాట్ల విద్యుత్ వినియోగం ఉంటుంది. రోజుకు 166.35 మిలియన్ యూనిట్లు అవసరం ఉంటాయి. గతేడాది ఇదే సమయానికి డిమాండ్ 10,600 మెగావాట్లు ఉండగా, రోజుకు 216.9 మిలియన్ యూనిట్ల వినియోగం నమోదైంది. గతేడాదితో పోలిస్తే.. ఈఏడాది రాష్ట్రానికి వాతావరణం బాగా అనుకూలిస్తోంది. రాష్ట్రంలో విద్యుత్ సంస్థలు సరఫరా చేసే మొత్తంలో వ్యవసాయ రంగానికే 45శాతం వినియోగించేవారు. అయితే ఈసారి విస్తారంగా వర్షాలు కురవడంతో మోటార్లకు పని లేకుండా పోయింది. కాళేశ్వరం తదితర ఎత్తిపోతల సాగునీటి పథకాలు అందుబాటులోకి రావటంతో వినియోగం అనూహ్యంగా పెరిగింది.

### శ్రీరామసాగర్ గేట్ల మూసివేత

**మెండోర, ప్రభన్యూస్ :** ఉత్తర తెలంగాణ జిల్లాల వరప్రదాయిని శ్రీరామసాగర్ ప్రాజెక్టు నిండుకుండను తలపిస్తోంది. అర్ధరాత్రి ప్రాజెక్టులోకి 20 వేల క్యూసెక్కుల నీటి చేరికతో 4 గేట్ల నుండి 12 వేల 500 క్యూసెక్కుల మిగులు జలాల నీటిని గోదావరిలోకి విడుదల చేశారు. ఉదయం ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో తగ్గడంతో ప్రాజెక్టు గేట్లను మూసివేశారు. ప్రాజెక్టు నుండి ఎస్కేప్ 5 గేట్ల ద్వారా 3వేల క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతుండగా, ఆవిరి రూపంలో 525 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 142 క్యూసెక్కులు ఔట్‌ఫ్లో పోతుందని ఏఈఈ మహేందర్ తెలిపారు. శ్రీరామ సాగర్ నుండి కాకతీయ కాలువకు 5500 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతుండడంతో విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది.




## జైళ్లశాఖ డీజీగా రాజీవ్

- హోంశాఖ ముఖ్యకార్యదర్శిగా రవిగుప్తా

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** హోం శాఖ ముఖ్య కార్యదర్శిగా రవిగుప్తా నియమితులయ్యారు. అడిషినల్ డీజీపీ (టెక్నికల్ సర్వీసెస్)గా ఉన్న రవిగుప్తాను బదలీ చేస్తూ హోంశాఖ ముఖ్య కార్యదర్శిగా పోస్టింగ్‌నిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. తక్షణమే ఈ నియామకం అమల్లోకి వస్తుందని పేర్కొన్నారు. హోంశాఖ ముఖ్య కార్యదర్శిగా ఉన్న రాజీవ్ త్రివేది తెలంగాణ జైళ్లశాఖ డీజీగా నియామకం అయ్యారు. జైళ్లశాఖ డీజీగా ఇప్పటి వరకు సందీప్ శాండిల్యా అదనపు బాధ్యతలు నిర్వర్తించారు. హోంశాఖ ముఖ్య కార్యదర్శిగా నియమితులైన రవిగుప్తా, కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.



## మృత్యుశకటం!

ఇదిగో ఇక్కడ కనిపిస్తున్న భారీ ట్రక్‌లో గుర్తు తెలియని 39మంది మృతదేహాలు లభ్యమయ్యాయి. మృతుల్లో ఒక టీనేజర్ కూడా ఉన్నాడు. వీరంతా ఎవరు, ఎక్కడ మరణించారు, వీరి మృతదేహాలు ఎక్కడికి తరలిస్తున్నారన్నది ఇంకా తెలియలేదు. బ్రిటన్‌లోని ఎసెక్స్ కౌంటీ, డార్ట్‌ఫోర్డ్ క్రాసింగ్ వద్ద ఈ భారీ కంటెయినర్ లారీని తనిఖీ చేసినప్పుడు ఈ మృతదేహాల గుట్టు వెలుగు చూసింది. బల్గేరియా నుంచి నాలుగు రోజుల క్రితం యూకేలోని వేల్స్ హోలీహెడ్ వెల్ష్ పోర్టు ద్వారా ఈ కంటెయినర్ అడుగు పెట్టినట్లు గుర్తించారు. ఐర్లాండ్‌కు చెందిన 25 ఏళ్ల ట్రక్ డ్రైవర్‌ను హంతకుడి గా అనుమానిస్తూ అరెస్టు చేశారు. బ్రిటన్‌లో ఇది అతిపెద్ద హత్యోదంతంగా పరిగణిస్తూ దర్యాప్తు ప్రారంభించారు.




## స్వీయరక్షణలో రక్షకుడు!

ఉక్రెయిన్‌లో ఎప్పుడూ గొడవలే. అందుకే అక్కడి భద్రతా బలగాలు అనుక్షణం స్వీయభద్రతను చూస్తూ ప్రజల రక్షణకు సిద్ధంగా ఉంటారు. ఇదిగో ఇక్కడ విచిత్ర వేషధారణతో కనిపిస్తున్న ఈ వ్యక్తి ధరించిన శిరస్త్రాణం హైటెక్ సాంకేతికతతో కూడుకున్నది. ప్రత్యేక, రహస్య కార్యకలాలలో విధులు నిర్వహించే ఈ పోలీసు ఇప్పుడు దేశ రాజధాని కీవ్‌లో జరుగుతున్న సైబర్ టీమ్ టోర్నమెంట్ వద్ద మోహరించాడు.



## కళ్లముందు భూతప్రేతాలు!

చిన్నపిల్లలకు పీడకలల భయం ఎక్కువే. ఆ కలల్లో కనిపించే భూతప్రేతాలను చూసి రోజుల తరబడి బిక్కుబిక్కుమంటూ గడపడం చూస్తూనే ఉంటాం. ఇదే ఇతివృత్తంతో స్టీఫెన్ కింగ్ అనే రచయిత రాసిన 'ఇట్' (ఐటి) నవల ఆధారంగా ఓ కల్పిత కథను అదే పేరుతో రెండు భాగాలుగా సినిమా తీశారు. 2017లో వచ్చిన తొలిభాగం సంచలనం రేపింది. చిన్నపిల్లలను లక్ష్యంగా చేసుకుని మాయలు మంత్రాలతో ఏడిపిస్తూ, అదృశ్యం చేస్తూ, భయపెడుతూ ఆనందించే రెండు భూతప్రేతాల అల్లరి నేపథ్యంలో ఈ సినిమా సాగుతుంది. గత నెలలో అదే సినిమా సీక్వెల్ విడుదలైంది. కొలంబియాలోని బొగొట నగరంలో ప్రఖ్యాత 'సోఫా' అనే ఊహాజనిత కల్పిత ప్రాంతంలో ఆ సినిమాలో భయపెట్టే రెండు పాత్రల వేషధారణతో ఇద్దరు ఇలా పోజిచ్చారు.



## డిజిటల్ కాంతులు

వందలాది లాంతర్లు వెలుగు విరజిమ్ముతూ, రంగులు మారుతూ ఓ కాంతివంతమైన కొత్త ప్రపంచంలో విభ్రాంతి పొందుతూ గడపడం ఎవరికైనా ఇష్టమే. ఇదిగో ఇక్కడ కనిపిస్తున్న వందలాది లాంతర్ల వెలుగు అంతా డిజిటల్ సాంకేతికతతో సృష్టించినదే. జపాన్ రాజధాని టోక్యోలోని ఒడైబైలో నిర్మించిన మోరీ డిజిటల్ ల్యాబ్‌లో ఈ కాంతుల ప్రదర్శన ఓ హైలెట్. పదివేల చ.మీ. స్థలంలో 520 కంప్యూటర్లు, 470 ప్రొజెక్టర్లు, వందలాది ఎల్ఈడీ తెరల సాయంతో రంగురంగుల దీపాలు వెలిగినట్లు భ్రమకల్పిస్తారు. వెలుగులు నిజమే. లాంతర్లు అబద్ధం. ఆ ఊహాలోకంలో విహరిస్తూ ఆనందించడమే ఈ కార్యక్రమం లక్ష్యం. ఒడైబాలో ఈ మోరీ డిజిటల్ ల్యాబ్ 2018లో ప్రారంభమైంది.



## డబుల్ ఇండ్లతో మురిసిన తండా

**సిద్దిపేట ప్రతినిధి, ప్రభ న్యూస్ :** సీఎం కేసీఆర్ ఇండ్లు లేని నిరు పేదలు ఆత్మగౌరవంతో బతకాలని డబుల్ బెడ్ రూం ఇండ్లు నిర్మించి ఇస్తున్నారని, దేశంలో నే ఎక్కడాలేని విధంగా రూపాయి తీసుకోకుండా అన్ని వసతులతో పేదలకు ఇండ్లు నిర్మించి ఇస్తున్న ఘనత తెరాస ప్రభుత్వానికే దక్కుతుందని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీష్‌రావు అన్నారు. బుధవారం నియోజక వర్గంలోని నంగునూరు మండలం బద్దిపడగ తండాలో డబుల్ బెడ్ ఇండ్ల గృహ ప్రవేశాలు కార్యక్రమంలో పాల్గొన్నారు. తండా వాసులకు మంత్రి చేతుల మీదుగా గృహ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పూరి గుడిసెల్లో ఇన్నాళ్లు నివసించిన తండా లంబాడీలు ఇప్పుడు ఆత్మగౌరవంతో జీవిస్తారని మంత్రి హరీశ్‌రావు అన్నారు.



## ఆధ్యాత్మిక నగరిగా తిరుపతి

# మందు బంద్

## సంస్కారవంతమైన, సాహసోపేత నిర్ణయం


హిందువుల ఆధ్యాత్మిక నగరం తిరుపతిలో మద్య నిషేధం అమలు కానుంది. సమాజంలో మంచి మార్పు కోసం పరితపిసున్న ముఖ్యమంత్రి జగన్ రాష్ట్రంలో విడతల వారీగా మద్యపాన నిషేధాన్ని అమలు చేస్తానని ఎన్నికలకు ముందే ప్రకటించారు. దీనిపై ముందుగా స్పందించిన ఆంధ్రప్రభ మద్యపాన నిషేధం తిరుపతి నుంచి ఆరంభం కావాలని సామాజిక విద్యుక్త ధర్మంలో భాగంగా పలుసార్లు కథనాలను ప్రచురించింది. మద్యపాన నిషేధం ఒక బృహత్తర కార్యక్రమం. దీనికి సమాజంలోని అన్ని వర్గాల నుంచి మద్దతు అవసరం. ఇంతటి సంస్కారవంతమైన, సాహసోపేతమైన నిర్ణయాన్ని పార్టీలకు అతీతంగా రాజకీయ నాయకులు, సామాజికవేత్తలు, ముఖ్యంగా మహిళలు తోడ్పా టును అందిస్తే తప్పకుండా విజయవంతం అవుతుంది. నిబద్ధతతో కూడిన ఆచరణాత్మక సలహాలను ఇస్తే ముఖ్యమంత్రి జగన్ తప్పక స్వీకరించి అమలు చేస్తారని ఇది రుజువు చేస్తోంది... మేధావులు చొరవ చూపించాలని సామాజిక నిపుణులు సూచిస్తునారు.

- మద్యనిషేధంపై కృతనిశ్చయంతో ఏపీ సీఎం
- పలు కథనాలతో ప్రభుత్వానికి సూచించిన ఆంధ్రప్రభ
- త్వరలో అమల్లో పెట్టనున్న జగన్
- రాష్ట్రంలో విడతల వారీగా అమలు
- తొలి ఏడాదే 20 శాతం షాపుల తగ్గింపు
- జీవన ప్రమాణాలు పెరుగుతాయి
- సామాజిక బంధాలు బలపడతాయి
- రాజకీయ పార్టీలన్నీ సహకరించాలి
- మహిళలు, మేధావి వర్గాలు మద్దతివ్వాలి
- సామాజిక నిపుణుల సూచనలు

**ప్రభుత్వ యోచన... తితిదే ప్రతిపాదన**

(అమరావతి, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి)

ప్రపంచ వ్యాప్తంగా హిందువులు అత్యంత పుణ్యక్షేత్రంగా పరిగణించే తిరుపతి నగర పరిధిలో సంపూర్ణ మద్య నిషేధాన్ని అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. ముఖ్యమంత్రి జగన్ ఇప్పటికే ఈ దిశగా నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఎన్నికలకు ముందే రాష్ట్రంలో విడతల వారీగా మద్యనిషేధం అమలు చేయాలని జగన్ ప్రతిపాదిం చారు. ఈ మేరకు తన ఎన్నికల మేనిఫె స్టోలో కూడా ప్రకటిం చారు. అప్పట్నుంచి ఆంధ్రప్రభ తన సామాజిక విద్యుక్త ధర్మంలో భాగంగా హిందువుల మనోభావాల్ని పరిరక్షించేం దుకు తిరుపతిని మద్య రహిత ప్రాంతంగా ప్రకటించాలంటూ పలు విజ్ఞప్తులు చేసింది. దీనిపై సోదాహరణంగా పలు కథనాలు వెలువరించింది. ఎన్‌టిఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో తిరుపతి నగరాన్ని వాటికన్ సిటీ నగరం తరహాలో అభివృద్ధి చేయాలని తలపోశారు. ఈ నగరానికి ప్రత్యేక ప్రతిపత్తినివ్వాలని ఆశించారు. తిరుపతి నగరాన్ని హైందవ ధర్మానికి ప్రతీకగా మార్చాలని కలలుగన్నారు. కానీ ఆయన ఆశలు తీరకుండానే పదవి నుంచి దిగిపోవాల్సొచ్చింది. ఆ తర్వాత ఎందరో ముఖ్య మంత్రులొచ్చారు. కానీ తిరుపతిపై ఎవరూ ప్రత్యేక దృష్టి పెట్టలేదు. అలాగే ఎన్‌టిఆర్ మాత్రమే సంపూర్ణ మద్య నిషేధా నికి ప్రయత్నించారు. కానీ అప్పట్లో అది సఫలంకాలేదు. ఆ తర్వాత పాలకులెవరూ ఈ దిశగా సాహసించలేదు. ఇన్నాళ్ళకు జగన్ రాష్ట్రంలో మద్యనిషేధాన్ని అమలు చేయా లని నిర్ణయించారు. అధికారంలోకి రాగానే దీనిపై దృష్టిపెట్టారు. వెనువెంటనే బెల్ట్ దుకాణాలన్నింటిని మూయించేశారు. తొలి ఏడాదే దుకాణాల సంఖ్యను 20శాతం తగ్గించారు. నిర్వహణను ప్రభుత్వమే చేపట్టింది. స్పష్టమైన సమయ పట్టిక అమలు చేస్తోంది. ఇలా ప్రతి ఏటా 20శాతం చొప్పున దుకాణాల తగ్గింపునకు ప్రభుత్వం నిర్ణయించింది. ఇది ఇప్పటికే అతిగొప్ప సంస్కారవంతమైన, సాహసోపేతమైన నిర్ణయంగా ప్రజల మెప్పు పొందుతోంది.



దేశంలో గుజరాత్, బీహార్ మినహా మరెక్కడా మద్య నిషేధం అమలుకావడంలేదు. ఈశాన్య రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతా ల్లో పాక్షిక నిషేధాన్ని అమలు చేస్తున్నారు. పలు రాష్ట్రాల్లో మద్యనిషేధ ప్రయత్నాలు జరిగినప్పటికీ అవేవీ సఫలంకాలేదు. రాజకీయ పక్షాల్తో పాటు అధికార పక్షాల్నుంచి క ూడా ప్రభుత్వా లకు తగిన మద్దతు లభించలేదు. సమాజపరంగా కట్టడి చేయ డం ప్రభుత్వాలకు సాధ్యంకాలేదు. కానీ ఇలాంటి అడ్డంకులన్ని ంటిని జగన్ ప్రభుత్వం అధిగమిస్తోంది. కొన్ని రోజుల్లోనే సమా జానికి స్పష్టమైన మార్పు చూపించింది. మద్య నిషేధం అమలు తో పేదల జీవన ప్రమాణాల పెరుగుదలకు మార్గాలు సుగమ మయ్యాయి. సంసార, సామాజిక బంధాలు పెరిగే అవకాశం ఏర్పడింది. ఈ పథకం విజయవంతమైతే మంచి ఫ లితాలుం టాయి. సమాజంలో మంచి మార్పొస్తుంది. అయితే ఇటువంటి బృహత్తర ఆశయ సాధన ఒక్క ప్రభుత్వం వల్లే విజయవంతం కాదు. విపక్షాలు, రాజకీయ పార్టీలు, సామాజిక సంస్థలు, మేధా వులు, నిపుణులు కూడా ముందుకురావాలి. దీని అమలుకు తగిన సలహాలు, సూచనలివ్వాలి. అమల్లోని లోపాల్ని ప్రభు త్వం దృష్టికి తేవాలి. ముఖ్యమంత్రి జగన్ ఎలాంటి సలహాలు, సూచనలు స్వీకరించరన్నది మరో అభియోగం. అయితే నిబద్ధతతో కూడిన సలహాలిస్తే వాటి ఆచరణకు ఆయన సిద్ధమని తిరుపతి విషయంలో ఆయన తీసుకుంటున్న నిర్ణయా లు రుజువు చేస్తున్నాయి. ఈ నగరాన్ని మద్యరహితంగా రూపు దిద్దితే ప్రపంచంలో దీనికి మరింత ప్రాచుర్యం లభిస్తుంది. మరింతగా ఈ నగరానికి పవిత్రత చేకూరుతుందని నిపుణులు పేర్కొంటున్నారు.

# చదువుల సరస్వతులు!

(మొదటిపేజీ తరువాయి)

19.1 శాతం మాత్రమే ఉన్నత విద్యాకోర్సుల్ని అభ్యసిస్తున్నారు. 2018-19కి ఇది 23 శాతానికి చేరింది. ఎస్‌టీ సామాజిక వర్గానికి చెందిన వారిలో 2014-15లో 13.7 శాతం మంది ఉన్నత విద్యను అభ్యసిస్తుంటే 2018-19నాటికిది 17.2 శాతానికి పెరిగింది.

జాతీయస్థాయిలో ఉన్నత విద్య పట్ల ఆసక్తి రోజు రోజుకు పెరుగుతోంది. రాష్ట్రాల వారీగా చూస్తే ఇందులోనూ పలు వ్యత్యాసాలు ఉంటున్నాయి. జాతీయస్థాయిలో స్త్రీలు, పురుషులు కలిపి లెక్కిస్తే 30.6 శాతం మంది ఉన్నత విద్యాకోర్సుల్ని అభ్యసిస్తున్నారు. బీహార్‌లో ఇది 13.6 శాతం మాత్రమే. చత్తీస్‌గఢ్‌లో 18.6, అసోంలో 18.7మాత్రమే. ఇక ఇందులో తమిళనాడు అగ్రభాగానుంది. ఈ రాష్ట్రంలో 49 శాతం ఉన్నత విద్యాభ్యాసం చేస్తున్నారు. ఢిల్లీలో 46.3 శాతం, హిమాచల్‌ప్రదేశ్‌లో 39.6 శాతం, ఉత్తరాఖండ్‌లో 39.1 శాతం, కేరళలో 37 శాతం, తెలంగాణలో 36.2 శాతం ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు. మహరాష్ట్ర, జమ్మూకాశ్మీర్, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, పంజాబ్, హర్యానాల్లో జాతీయ సగటు కంటే అధిక శాతంలో ఉన్నత విద్యాభ్యాసం చేస్తున్న వారున్నారు. జార్ఖండ్, పశ్చిమబెంగాల్, గుజరాత్, మధ్యప్రదేశ్, ఒడిషా, ఉత్తర్‌ప్రదేశ్, రాజస్థాన్‌లు జాతీయ సగటు కంటే ఈ విషయంలో వెనుకబడ్డాయి. పంజాబ్ వంటి రాష్ట్రంలో ఏటేటా వీరి సంఖ్య తగ్గుతోంది. అంతకుముందు ఏడాది 30.3 శాతం ఉండగా ఇప్పుడిది 29.5 శాతానికి పడిపోయింది. ఇక చండీఘడ్‌లో గతేడాదితో పోలిస్తే ఏకంగా 5.8 శాతం తగ్గింది. చిన్న రాష్ట్రాల్లో సిక్కింలో ఉన్నత విద్యావంతుల సంఖ్య ఏటేటా పెరుగుతోంది.భారత్‌లో ప్రతి ఏటా ఉన్నత విద్యపట్ల ఆసక్తి పెరుగుతున్నప్పటికీ అభివృద్ధి చెందుతున్న దేశాలతో పోలిస్తే ఇక్కడ ఉన్నత విద్యావంతుల సంఖ్య తక్కువ. సగటున దేశంలో 30.6 శాతం మంది ఉన్నత విద్యావంతులుంటే పాకిస్థాన్‌లో ఇది 9 శాతం, బంగ్లాదేశ్‌లో 21 శాతం మాత్రమే ఉన్నాయి. ఈ రెండింటితో పోలిస్తే భారత్ మెరుగ్గా కనిపిస్తోంది. దక్షిణకొరియాలో 94, యుఎస్‌లో 88, జర్మనీలో 70, ఇరాన్‌లో 69, కెనడాలో 69, యునైటెడ్ కింగ్‌డమ్‌లో 60, చైనాలో 51, మలేషియాలో 45 శాతం మంది ఉన్నత విద్యావంతులున్నారు.

ఈ ఏడాది కేంద్రం ప్రవేశపెట్టిన జాతీయ విద్యా విధానంతో రానున్న రోజుల్లో ఉన్నత విద్యావంతుల సంఖ్య పెరిగే అవకాశముంది. అలాగే అక్షరాస్యతకు ప్రస్తుతం పరిగణిస్తున్న ప్రామాణికతను కూడా సవరించా లని కేంద్రం యోచిస్తోంది. భారత్‌లో 1947లో అక్షరాస్యత 12 శాతముండేది. 2011లో ఇది 74 శాతంగా నమోదైంది. స్థానిక భాషలో సంతకం చేయడం వస్తే చాలు అక్షరాస్యులుగా గుర్తిస్తారు. భారత రాజ్యాంగం నిర్బంధ విద్యను అమలు చేయాలని పేర్కొంది. అయితే పాఠశాల విద్యను మాత్రమే ప్రభుత్వం ప్రజల ప్రాథమిక హక్కుగా నిర్ధారించింది. కానీ ఉన్నత విద్య మాత్రమే ఉత్తమ భవిష్యత్‌కు అవకాశం కల్పిస్తుంది. ప్రాథమిక విద్య బలమైన పునాదులు ఏర్పాటు చేస్తే ఉన్నత విద్య ప్రపంచంలో మెరుగైన ఉపాధి అవకాశాలు పొందే దారిచూపిస్తుంది. విద్యా వార్షిక నివేదిక మేరకు ప్రపంచంలోనే యువ జనాభా అధికంగా కలిగిన దేశం భారత్. కానీ అభివృద్ధిలో పలు దేశాలకు వెనకే ఇది నిల్చింది. ఇందుక్కారణం అభివృద్ధి చెందిన దేశాలతో సమానంగా ఇక్కడ ఉన్నత విద్యావకాశాలు అందుబా టులో లేకపోవ డమే.

గతకొన్నేళ్ళుగా ఉన్నత విద్యావం తుల సంఖ్య పెరుగుతున్నప్పటికీ ఇది అభివృద్ధి చెందు తున్న దేశాల్ని సవాల్ చేయగలిగే స్థాయిలో లేదు. నూతన జాతీయ విద్యా విధానం మేరకు కేంద్రం ఈ విషయంలో పలు సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. వాటి ఆచరణకు ఇప్పటికే పలు అవరోధాలు ఏర్పడుతున్నాయి. వీటన్నింటిని అధిగమించి సంస్కరణల్ని సమర్ధవంతంగా అమలు చేస్తే రానున్న దశాబ్దంలోనైనా అభివృద్ధి చెందిన దేశాలతో సమానంగా భారత్‌లోనూ ఉన్నత విద్యావం తులుండే అవకాశాలున్నాయని ఈ నివేదిక పేర్కొంది.



## అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు

(మొదటిపేజీ తరువాయి)

వంటేరుకు సీఎం కేసీఆర్ కీలకమైన అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు బుధవారం నియామక ఉత్తర్వులు వెలువడ్డాయి. తనకు చైర్మన్ పదవి దక్కిందన్న సమాచారంతో ప్రతాపరెడ్డి ప్రగతిభవన్ వెళ్లి కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో మరికొందరికి నామినేటెడ్ పదవులు దక్కనున్నాయి. దీపావళిలోగా మునిసిపల్ ఎన్నికల నోటిఫికేషన్ రాకుంటే మరికొందరికి పదవుల దక్కడం ఖాయమని భావిస్తున్నారు. ఇప్పటివరకు సిద్దిపేట జిల్లాకు చెందిన వారికే నామినేటెడ్ పదవులు దక్కాయి.

పౌరసరఫరాల కార్పొరేషన్ చైర్మన్ పదవి మారెడ్డి శ్రీనివాసరెడ్డికి దక్కింది. ఇదే జిల్లాకు చెందిన టీఎస్ఐఐసీ చైర్మన్ బాలమల్లుకు మరో మూడేళ్లు రెన్యువల్ లభించింది. ఇతర జిల్లాల నేతలకు మునిసిపల్ ఎన్నికల తర్వాతే పదవీయోగం దక్కనుంది.



## శ్రీవారి సేవలో గవర్నర్ తమిళిసై

**తిరుమల, ప్రభన్యూస్:** తిరుమల శ్రీవారిని బుధవారం తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ముందుగా ఆలయం వద్దకు చేరుకున్న గవర్నర్‌కు టీటీడీ అదనపు ఈఓ ఏవీ ధర్మారెడ్డి, అర్చక బృందం కలసి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అదనపు ఈఓ శ్రీవారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలను అందచేశారు.

## గవర్నర్‌తో ఓంబిర్లా భేటీ



**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** ఒక ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొనేందుకు బుధవారం హైదరాబాద్‌కు వచ్చిన లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర శాసనసభాపతి పోచారం శ్రీనివాస్‌రెడ్డి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ వి.నర్సింహాచార్యులు రాజ్‌భవన్‌కు వెళ్ళి ఓం బిర్లాతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. రాష్ట్రం తరపున మెమొంటోను అందజేసి శాలువాతో సత్కరించారు.

రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి ఎస్.నిరంజన్‌రెడ్డి బుధవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసైను మర్యా దపూర్వకంగా కలిశారు. మరోవైపు ఆర్మీ మేజర్ జనరల్ ఆర్‌కే సింగ్ గవర్నర్ తమిళిసైతో సమావేశమయ్యారు.

## కేంద్ర సర్వీసులకు అకున్ సబర్వాల్

### పౌర సరఫరాల కమిషనర్‌గా సత్యనారాయణరెడ్డి

### ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** రాష్ట్ర పౌర సరఫరాల కమిషనర్‌గా పనిచేసిన సీనియర్ ఐపీఎస్ అధికారి అకున్ సబర్వాల్ కేంద్ర సర్వీసులకు వెళ్ళారు. సెంట్రల్ ఇంటలిజెన్స్ విభాగంలో కీలక బాధ్యతలు చేపట్టనున్నారు. ఆయనను రాష్ట్రం నుంచి రిలీవ్ చేస్తూ సోమవారమే ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. అకున్ సబర్వాల్ స్థానలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి సత్యనారాయణరెడ్డిని నియమిస్తూ తాజాగా బుధవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్‌కే జోషి జీవో విడుదల చేశారు. పౌర సరఫరాలశాఖ కమిషనర్‌గా ఆయనను కాంట్రాక్టు పద్ధతిలో పునర్‌నియామకం చేస్తున్నట్లు జీవోలో పేర్కొన్నారు. రెండేళ్ళ కాల పరిమితితో సత్యనారాయణరెడ్డి నియమితులయ్యారు. ఆయన రాష్ట్ర పౌర సరఫరాల సంస్థకు మేనేజింగ్ డైరెక్టర్‌గా కూడా కొనసాగుతారు.

# మోడల్ టౌన్‌షిప్‌గా కొల్లూరు డబుల్ ఇళ్ల కాలనీ

- ఒకే చోట 117 బ్లాకులు.. 15,660 ఇళ్లు
- ఆధునిక మౌలిక సౌకర్యాలతో అద్భుతంగా నిర్మాణం
- పక్కాగృహాల పథకానికి కొత్త వన్నెలు
- దేశంలో మరెక్కడా ఒకేచోట ఇలా పేదలకు ఇళ్లు కట్టలేదు
- నిర్మాణ పనుల తీరుపై మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ క్షేత్రస్థాయి సమీక్ష

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** హైదరాబాద్ శివారు కొల్లూరులో నిర్మిస్తున్న డబుల్‌బెడ్ రూం ఇళ్ల ప్రాంతాన్ని మోడల్ టౌన్‌షిప్‌గా తీర్చిదిద్దు తున్నామని, దేశానికి ఆదర్శంగా, అత్యంత నాణ్యంగా ఈ ఇళ్లను నిర్మిస్తున్నామని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. పేదలకు అందించే పక్కా గృహాల నిర్మాణానికి ఇవి ప్రతీకగా నిలుస్తాయని ధీమా వ్యక్తం చేశారు. దేశంలో ఇంత భారీఎత్తున ఒకే చోట పేదలకు పక్కా ఇళ్ల నిర్మాణం ఎవరూ, ఎక్కడా నిర్మించలేదని అన్నారు. కొల్లూరులో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన బృహత్తర కార్యక్రమాన్ని ఇప్పటికే పది రాష్ట్రాల ప్రతినిధులు సందర్శించి అభినందించారని మంత్రి అన్నారు. కొల్లూరులో నిర్మిస్తున్న డబుల్ బెడ్‌రూం ఇళ్ల పనులను, జీహెచ్ఎంసీ మేయర్ బొంతు రామ్మోహన్, హౌజింగ్, పురపాలకశాఖ అధికారులతో కలిసి బుధవారం పరిశీలించిన మంత్రి కేటీఆర్ ఆ పనుల ప్రగతిని సమీక్షించారు.

### నాణ్యతకు ప్రాధాన్యం

రాశికన్నా వాసి ముఖ్యమన్న లక్ష్యంతో డబుల్‌బెడ్ రూం ఇళ్ల నిర్మాణాన్ని ప్రభుత్వం సకల హంగులతో చేపట్టిందని, అన్ని రకాల మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించినట్లు కేటీఆర్ అన్నారు. దాదాపుగా ఇళ్ల నిర్మాణం పూర్తయిందని దీనికి అదనంగా నిర్మించాల్సిన వసతుల పనులు కొనసాగుతున్నాయని అధికారులు మంత్రికి వివరించారు. ఇక్కడ 15,660 ఇళ్లను 117 బ్లాకులవారీగా నిర్మిస్తున్నామని, వసతులు కల్పిస్తున్నామని వివరించారు.



### మున్సిపాల్టీ స్థాయిలో సౌకర్యాలు

పూర్తయిన ఇళ్లను పరిశీలించారు. పనులపై సంతృపి వ్యక్తం చేశారు. డబుల్‌బెడ్ రూం ఇళ్ల నిర్మాణం పూర్తయ్యాక ఇక్కడనే ఒక మున్సిపాలిటి స్థాయిలో జనాభా ఉంటుందన్నారు. అందుకు మున్సిపాలిటికి ఉండాల్సిన అన్ని సౌకర్యాలను కల్పించాలని అధికారులకు ఆయన సూచించారు. పాఠశాల, హాస్పిటల్, పార్కులు, మంచినీటి సదుపాయం, మురుగునీటి శుద్ధి, నిర్వహణ, పోలీస్ స్టేషన్, ఫైర్ స్టేషన్, విద్యుత్ సబ్‌స్టేషన్, మొదలైన సదుపాయలను వేగవంతం చేయాలని మంత్రి ఆదేశాలు జారీ చేశారు. కొల్లూరు టౌన్‌షిప్‌ను క్లీన్, స్మార్ట్ అండ్ సేఫ్ ప్రాంతంగా తయారు చేసేందుకు అనుగుణంగా సీసీ కెమేరాల ఏర్పాటు, పారిశుద్ధ్య నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాలు, గ్రీనరీ పెంచేందుకు ఇప్పటి నుంచేచర్యలు చేపట్టాలన్నారు. కొల్లూరు నగర విస్తరణ జరుగుతున్న ప్రాంతంలో ఇక్కడ ఇళ్లు పొందే లబ్దిదారులకు అన్ని విధాలుగా అండగా ఉండాలని అధికారులకు మంత్రి సూచించారు. వారందరికీ తగిన వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో హౌజింగ్ శాఖ స్పెషన్ చీఫ్ సెక్రటరీ చిత్రా రామచంద్రన్, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి అరవింద్‌కుమార్, జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేష్‌కుమార్ తదితరులు హాజరయ్యారు.

### ఉన్నతాధికారులకు

## సేవా పతకాలు

### 30 మంది ఐఏఎస్‌లను ఎంపిక చేసిన ప్రభుత్వం

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషిస్తూ నిబద్ధతతో కూడిన విధి నిర్వహణ, ప్రజలతో మమేకమై ఫలితాల సాధనకు కృషి చేసిన ఉన్నతాధికారులకు ప్రతియేటా ప్రతిష్టాత్మకంగా అందజేసే సేవా అవార్డులకు 30 మంది ఐఏఎస్ అధికారులు ఎంపికయ్యారు. ఈనెల 24న (గురువారం) రాజ్‌భవన్‌లో ఈ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం జరగనుంది. రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ తెలంగాణ విభాగం సంయుక్త భాగస్వామ్యంతో ఈ అవార్డులను ప్రదానం చేయనున్నారు. ఈ అవార్డులకు ఎంపికైన ఐఏఎస్ అధికారుల పేర్లను రాష్ట్ర సాధారణ పరిపాలనశాఖ ధృవీకరించింది. ఈ మేరకు బుధవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి జీవో విడుదల చేశారు.

# మున్సిపోల్స్‌కు సిద్ధమవ్వండి

### కలెక్టర్ల ద్వారా మార్గదర్శకాలు విడుదల చేయండి

### అధికార యంత్రాంగానికి సీఎం కేసీఆర్ ఆదేశం

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** ఎన్నికల సంఘం ఎప్పుడు నిర్ణయిస్తే అప్పుడు మునిసిపల్ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. గత కొంతకాలంగా ఈ ఎన్నికల వ్యాజ్యంపై విచారణ జరిపిన హైకోర్టు తాజాగా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసుకోవలసిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఆ దిశగా ఉన్నతాధికారులు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని స్పష్టంచేశారు. ఈ అంశంపై బుధవారం ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్ ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు.

క్షేత్రస్థాయిలో పురపోరుకు అధికార యంత్రాంగం సంసిద్ధమయ్యేలా కలెక్టర్ల ద్వారా మార్గదర్శకాలు జారీ చేయాలన్నారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా అధికార యంత్రాంగమంతా పూర్తిస్థాయి సమన్వయంతో బాధ్యతాయుతంగా పని చేయాలని సూచించారు. ఈ ఎన్నికలకు ప్రభుత్వం సంసిద్ధంగా ఉందన్న విషయాన్ని ఎన్నికల సంఘానికి తెలియజేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషిని ఆదేశించారు. అదే సమయంలో జిల్లా కలెక్టర్లతో సమీక్షించి మునిసిపల్ ఎన్నికలపై మార్గదర్శకాలు ఇవ్వాలన్నారు. నిర్వహణ యంత్రాంగాన్ని సంసిద్ధం చేయాలని, అన్ని పురపాలక సంఘాలకు అధికారిక ఉత్తర్వులు ఇవ్వాలని సీఎం స్పష్టంచేశారు. ఎన్నికల సంఘం ఎప్పుడు నోటిఫికేషన్ విడుదల చేసినా నిర్వహణకు ప్రభుత్వం ఇప్పటికే సిద్ధంగా ఉందని వెల్లడించారు. ఈ సమావేశంలో పురపాలక పట్టణాభివృద్ధిశాఖ మంత్రి కేటీ రామారావు, ముఖ్య కార్యదర్శులు నర్సింగ్‌రావు, అర్వింద్ కుమార్, ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్‌శర్మ తదితరులు ఉన్నారు.


**తెలంగాణ ప్రభుత్వము**
**ప్రజారోగ్య మరియు మున్సిపల్ ఇంజనీరింగ్ శాఖ**
**ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన**

ఎన్ఐటి నెం.:21 నుండి 38/2019-20 తేది : 24-10-2019
పని పేరు: నిజామాబాద్ జిల్లా వద్ద బేసిక్ సివిల్ సదుపాయాలు ఏర్పాటు చేయుట ద్వారా బహుళ ఉపయోగ కమ్యూనిటీ హాల్ అభివృద్ధిపరుచుట, నిర్మాణం మరియు దిగువ సంతకందారుని పరిధిలో ఇతర అన్ని సివిల్ పనులు. పనుల సంఖ్య : 18 పనులు. మొత్తం ఇసివి: 1.36 కోట్లు. బిడ్ సమర్పించుట ముగింపు తేది (స్వీకరించుట): 31-10-2019న ఉ॥11.30గం.లు. ఏదేని తదుపరి విచారణల కొరకు కార్యనిర్వాహక ఇంజనీర్(పిహెచ్) డివిజన్, నిజామాబాద్ వారి కార్యాలయంలో కార్యాలయపనివేళలలో సంప్రదించగలరు. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్‌ప్లేస్ అనగా www.tender.telangana.gov.in వద్ద చూడగలరు.
సం/- కార్యనిర్వాహక ఇంజనీర్, పి.హెచ్. నిజామాబాద్
Ro No.1441/CL/Advt/1/2019-20, Dt. 23.10.2019



**తెలంగాణ ప్రభుత్వం**
**రోడ్లు మరియు భవనముల శాఖ**
**"ఇ" ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన**

ఎన్ఐటి నెం.16/టిఎస్/టిఓ/ఇఇ/ఆర్ & బి/కెజిఎం/2019-20 తేది : 19-10-2019
పనుల యొక్క వివరం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా యొక్క పినపాక మండలంలో బూర్గంపహాడ్ - ఏటూరు నాగారం రోడ్డు యొక్క కి.మీ.50/8-10 వద్ద మేజర్ బ్రిడ్జినకు అత్యవసర మరమ్మతులు. అంచనా వ్యయం రూ.లక్షలలో: 6.98 లక్షలు. బిడ్ డాక్యుమెంట్ల జారీ : 24-10-2019 న ఉ.గం. 11.00 నుండి 08-11-2019 న మ॥2.00గం.ల వరకు. బిడ్ సమర్పించుటకు చివరి తేదీ & సమయం: 08-11-2019 న మ॥2.30గం.ల వరకు. బిడ్ తెరచు తేది: 08-11-2019న సా॥ 4.00గం.లకు. ఫోన్ నెం: 08744-242779. తదుపరి వివరాలను www.eprocurement.gov.in వద్ద చూడవచ్చును.
సం/- జిల్లా (ఆర్&బి) అధికారి, కార్యనిర్వాహక ఇంజనీరు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా.
Ro. No.1447/CL/Advt/1/2019-20, Dt. 23.10.2019

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్

ఆంధ్రప్రభ

గురువారం 24 అక్టోబర్ 2019


# అభిజిత్ మదిలో ఏముంది?

ఆర్థికశాస్త్రంలో ఈ ఏడాది నోబెల్ బహుమతి పొందిన అభిజిత్ బెనర్జీ స్వదేశంలో అడుగు పెట్టాక, ప్రధానమంత్రి నరేంద్ర మోడీని కలుసుకున్న తర్వాత చేసిన వ్యాఖ్యలు సూటిగా లేవు. నర్మగర్భంగా ఉన్నాయి. ప్రధాని మోడీ ఆలోచనలు బాగా ఉన్నాయని ప్రశంసిస్తూనే, దేశంలో పౌష్టికాహార కార్యక్రమం అమలు గురించి విలేఖరులు ప్రశ్నించినప్పుడు మీరు నా నుంచి ఏదో రాబట్టాలని చూస్తున్నారని అంటూనే, సగం గ్లాసు ఖాళీగా ఉంది, సగం నిండుగా ఉందంటూ వ్యాఖ్యానించారు. అంటే దేశంలో పేదరిక నిర్మూలన కార్యక్రమం పట్ల ఆయన పూర్తిగా సంతృప్తిగా లేరన్న విషయం స్పష్టం అవుతోంది. పథకాలు మంచివే అయినా, అవి క్షేత్ర స్థాయిలో అమలు జరిగి లబ్ధిదారులకు చేరినప్పుడే వాటికి సార్థకత అని నిశ్చితాభిప్రాయాన్ని మరోసారి స్పష్టం చేశారు. మోడీ మానసపుత్రిక అయిన ఆయుష్మాన్ భవ ఆరోగ్య పథకాన్ని బెనర్జీ ప్రశంసించారు. ప్రభుత్వం తీసుకునే చర్యలపై ఆధిపత్య వర్గం సమస్యలను ఎలా సృష్టిస్తున్నదీ, అటువంటి అవరోధాలను తొలగించేందుకు తాను ఏయే చర్యలు తీసుకోవాలనుకుంటున్నదీ మోడీ వివరించారనీ, అవన్నీ బాగున్నాయనీ, అమలు జరగాలని కోరుకుంటున్నానని బెనర్జీ చెప్పారు.

అయితే, అదే సందర్భంలో బ్యాంకింగ్ రంగాన్ని సంస్కరించే దిశలో ప్రైవేటు రంగానికి ప్రాధాన్యం ఇవ్వాలని బెనర్జీ సూచించారు. బ్యాంకుల విలీనం ప్రతిపాదనపై దేశ వ్యాప్తంగా బ్యాంకు ఉద్యోగులు సమ్మె చేసిన రోజునే బెనర్జీ ఢిల్లీలో ప్రధానికి ఈ సూచన చేయడం కాకతాళీయమే అయినా గమనార్హం. మోడీ ప్రభుత్వం ఇప్పటికే బ్యాంకుల విలీనం ప్రక్రియ మొదటి దశను అమలు చేసేసింది. స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియాలో స్టేట్ బ్యాంకు ఆఫ్ హైదరాబాద్, ట్రావెన్కూర్, కర్నాటక తదితర బ్యాంకులను విలీనం చేసింది. ఇంతవరకూ అనుబంధంగా ఉన్న బ్యాంకులన్నీ స్టేట్ బ్యాంకులో విలీనం అయ్యాయి. ఇప్పుడు స్వాతంత్ర్యం రాకముందు నుంచి ప్రైవేటుగా నడపబడుతున్న సిండికేట్, కెనరా, ఆంధ్రా బ్యాంకు తదితర బ్యాంకులను విలీనం చేసే ఆలోచన గురించి ఆ మధ్య ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. బ్యాంకుల విలీనం, జాతీయం మొదలైనవన్నీ ప్రభుత్వం తీసుకునే విధానపరమైన నిర్ణయాలకు సంబంధించినవి. ప్రభుత్వాలు తీసుకునే విధానపరమైన నిర్ణయాలను ఉద్యోగ, అధికారవర్గాలు ప్రశ్నించకూడదనే ఆదేశాలు దిగువ స్థాయిలోనే వెలువడుతున్నప్పుడు జాతీయ స్థాయిలో వాటి గురించి విమర్శలు చేయడం వృధా శ్రమే అవుతుంది. ప్రభుత్వాలు మారినప్పుడల్లా విధానాలు మారడం సహజం. అలాగే, పథకాల పేర్లు మారడాన్ని కూడా ఈ మధ్య చూస్తున్నాం. ఏ విధానమైనా, పథకమైనా ప్రజలకు మేలు జరిగినప్పుడే వాటికి సార్థకత. జాతీయం చేస్తే ఉద్యోగులకు ఆనందం, ప్రైవేటీకరణ చేస్తే ప్రైవేటు వ్యక్తులు, సంస్థలకు లాభం. ఆర్థిక సంస్కరణలు అమలులోకి వచ్చిన తర్వాత మన దేశంలోనే కాకుండా, అన్ని దేశాల్లోనూ ప్రైవేటీకరణ అమలులో ఉంది. ఇందుకు కమ్యూనిస్టు చైనా ఉదాహరణ. ప్రభుత్వ రంగంలో ఉన్నప్పుడు దివాలా తీసిన సంస్థలే, ప్రైవేటీకరణ తర్వాత లాభాల బాట పట్టిన ఉదంతాలు కూడా మనకళ్ళముందే ఉన్నాయి. ప్రైవేటు రంగంలో జవాబుదారీ, అంకిత భావం ఎక్కువ ఉంటుందని వాదించేవారు ఉన్నారు. అలనాడు ఇందిరాగాంధీ బ్యాంకులను జాతీయం చేసినప్పుడు స్వతంత్ర పార్టీ నాయకుడు మీనూ మసానీ ఈ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకించడమే కాకుండా, దీనివల్ల జవాబుదారీ తగ్గుతుందని గట్టిగా వాదించారు. అలాగే, సంయుక్త సోషలిస్టు పార్టీ, పాత కాంగ్రెస్ నాయకులు కూడా వ్యతిరేకించారు. అయితే, వారందరూ అభివృద్ధి నిరోధకులన్న ముద్ర వేసి ఇందిరాగాంధీ జాతీయకరణకే మొగ్గు చూపారు. నాలుగున్నర దశాబ్దాల్లో బ్యాంకు శాఖల విస్తరణ జరిగినట్టే, రుణాల బకాయిలు బాగా పెరిగిపోయాయి. నిరర్థక ఆస్తులుగా పిలవబడుతున్న ఈ బకాయిలు మోడీ హయాంలో పెరిగాయని మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ ఆరోపిస్తే, యూపీఏ హయాంలో ఫోన్‌కాల్ చేసి రుణాలు ఇప్పించేవారని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ఎదురు దాడి చేశారు. వీరు పరస్పరం చేసుకున్న ఆరోపణలను తరచి చూస్తే రెండింటిలోనూ నిజం ఉంది. అప్పట్లో అంటే జాతీయకరణ జరిగిన తొలిదశలో బ్యాంకులకు బకాయిలు వందల కోట్లలోనే ఉండేవి. ఇప్పుడు వేల కోట్లు దాటిపోయాయి. యూపీఏ హయాంలో మౌలిక సదుపాయాల కల్పన కోసం బ్యాంకులు వందలు, వేల కోట్ల రూపాయల రుణాలు ఇస్తే, ప్రస్తుత ప్రభుత్వ హయాంలో కార్పొరేట్, పారిశ్రామిక సంస్థలు ఎక్కువగా బకాయి పడ్డాయి. ఆర్థిక సంస్కరణలు కల్పించిన వెసులుబాటును వీరూ, వారూ ఉపయోగించుకుని బ్యాంకులకు భారీ ఎత్తున బకాయిలు పడ్డారని ఉద్యోగ సంఘాల వారు పేర్కొంటున్నారు. బ్యాంకుల ఆర్థిక దుస్థితికి అసలు కారణం అది కాగా, ఉద్యోగుల్లో జవాబుదారీ లేకనే నష్టాలు వస్తున్నాయంటూ అసత్య ప్రచారం చేస్తున్నారంటూ ఉద్యోగ సంఘాల వారు ధ్వజమెత్తుతున్నారు. అయితే, చిన్న ఉద్యోగులు, ఓ స్థాయి అధికారులు కాకుండా, ఉన్నతస్థాయి అధికారులు, బ్యాంకుల ఛైర్మన్ పదవుల్లో ఉన్నవారు రాజకీయ ఒత్తిళ్ళకు లొంగి రుణాలు ఇచ్చినట్టు వీడియోకాన్ సంస్థకు రుణాలు ఇవ్వడంలో పక్ష పాతం చూపారంటూ ఐసిఐసిఐ బ్యాంకు మాజీ సీఈఓ చందనా కొచ్చర్‌పై వచ్చిన ఆరోపణలే నిదర్శనం. నిజానికి ఆ బ్యాంకు వృద్ధికోసం ఆమె చాలా శ్రమపడ్డారు. అయినప్పటికీ ఆమె ఈ ఆరోపణల కారణంగా గడువుకు కొద్దిరోజుల ముందు వైదొలగాల్సి వచ్చింది. ఇలాంటి ఉదాహరణలు ఎన్నో ఉన్నాయి. బ్యాంకింగ్ రంగం ఎన్నడూ లేనిరీతిలో తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోందన్న వాస్తవం అభిజిత్ నోటంటా వచ్చింది. ప్రమాదం ముంచుకు రాకముందే తగిన నివారణ చర్యలు తీసుకోవాలనీ, ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ప్రభుత్వం వాటాని 50 శాతానికి తగ్గించాలనీ, అప్పుడే విజిలెన్స్ పాత్ర తక్కువ అవుతుందనీ, విజిలెన్స్ కమిషన్ దాడులతో బ్యాంకర్లు భయపడుతున్నారన్న ఆయన వాదన కాదనడానికి లేదు. నిజానికి రాజకీయ జోక్యాల వల్లనే బ్యాంకులు అప్పుల ఊబిలోకీ, సంక్షోభంలోకీ నెట్టబడుతున్న ఆరోపణలు గతంలోనే వచ్చాయి. ఈరుగ్మత నుంచి బ్యాంకులు బయట పడాలంటే ప్రభుత్వ వాటాలను తగ్గించడమే మార్గమన్నది ఆయన సూచన. అభిజిత్ మన ఆణిముత్యమంటూ ప్రధాని మోడీ ప్రశంసిస్తే, ఆయన వామపక్ష భావాలు కలవారనీ, సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రతిపాదించిన న్యాయ్ పథకం ఆయన ఆలోచనే అని బీజేపీ నాయకులు విమర్శించారు. ఆయన వామపక్ష భావాలు కలవారైతే బ్యాంకుల్లో ప్రైవేటు రంగం వాటాలు పెరగాలని ఎలా సూచిస్తారు. ఆయన ఒక వార్తా సంస్థకు ఇచ్చిన మొదటి ఇంటర్వ్యూలోనే సిద్ధాంతపరమైన ఘర్షణలతో సమయాన్ని వృధా చేసుకోవడం కన్నా, ప్రజలకు అంతిమంగా ఏది మంచో దానిని అమలు జేయాలని సూచించారు. ప్రధానమంత్రి మోడీ ప్రస్తుతం చేస్తున్నది అదే. విదేశీ ప్రత్యక్షపెట్టుబడుల (ఎఫ్‌డిఐ)ను మోడీ ప్రభుత్వం ఆహ్వానించడాన్ని బీజేపీకి సైద్ధాంతిక స్ఫూర్తినిస్తున్న రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) వ్యతిరేకిస్తున్నా, ఆయన ఈ విషయంలో వెనక్కి తగ్గడం లేదు. అంటే, సైద్ధాంతికపరమైన అంశాలపై పట్టువిడుపులు ఉండాలన్నది ఆయన విధానంగా కనిపిస్తోంది.

# భారత్‌కు ఏమి తక్కువ?

నేడు ఐక్యరాజ్యసమితి దినోత్సవం



అంతర్జాతీయ చట్టం, భద్రత, ఆర్థికాభివృద్ధి, సామాజికాభివృద్ధి, మానవ హక్కులపై సమిష్టి కృషి చేసేందుకు ప్రపంచ దేశాలు ఏర్పాటు చేసుకున్న ఒక అంతర్జాతీయ సంస్థ. మానవ జాతి మునుపెన్నడూ ఎరుగని విధంగా సంభవించిన అత్యంత వినాశకరమైన రెండు ప్రపంచ యుద్ధాలు భూగోళంపై మానవ మనుగడనే ప్రశ్నార్థకం చేశాయి. అలాంటి వినాశనాలు భవిష్యత్తులో జరగకుండా ఉండాలంటే నిత్యం శాంతిని కనిపెట్టుకొని ఉండే ఒక అంతర్జాతీయ సంఘం ఉండాలన్న ఆలోచనలోంచి పుట్టిందే ఐక్యరాజ్యసమితి. ఇది ప్రపంచంలోని ప్రజల లక్ష్యాలను తెలుసుకొనేందుకు, ఐక్యరాజ్యసమితి విజయాలను ప్రపంచానికి తెలియజేసేందుకు, వారి మద్దతును కూడగట్టుకొనుటకు ఏర్పడింది. భావితరాల వారిని యుద్ధభీతి నుంచి కాపాడటమే ఐక్యరాజ్యసమితి ప్రధాన ఉద్దేశం. కత్తులు దూసుకునే శత్రు దేశాలు కరచాలనం చేసుకోవడానికి అద్భుతమైన వేదికగా, పేదవాడి ఈతి బాధలను ప్రపంచానికి చాటిచెప్పే వేదికగా, అన్నార్తులకు కన్నతల్లిగా, ప్రపంచానికి దిక్సూచిగా, మరెన్నో రకాలుగా మానవాళికి సేవచేసే సమితిగా పేరు పొందింది.

మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత ప్రపంచ శాంతి పరిరక్షణ కోసం అమెరికా అధ్యక్షుడు ఉడ్రోవిల్సన్ కృషి ఫలితంగా 1920 జనవరి 10న జెనీవా కేంద్రంగా నానాజాతి సమితి ఏర్పడింది. హిట్లర్ పోలండ్‌ను ఆక్రమించుకోవడంతో నానాజాతి సమితి ఉనికి ప్రశ్నార్థకమైంది. రెండో ప్రపంచ యుద్ధం ప్రారంభమైంది. కోట్ల మంది క్షతగాత్రులయ్యారు, చాలా దేశాలు ఆర్థికంగా పతనమయ్యాయి. కోట్లాది మంది ప్రజలు గాయాల బారినపడి, నిరాశ్రయులయ్యారు. దీంతో యుద్ధం జరుగుతున్న సమయంలో ప్రపంచం మొత్తం ఎంతో భయపడుతున్న కాలంలో అమెరికా అధ్యక్షుడు రూజ్‌వెల్ట్, బ్రిటిష్ ప్రధాని విన్‌స్టన్ చర్చిల్ అట్లాంటిక్ సముద్రంలో కూర్చొని కుదుర్చుకొన్న ఒప్పందాన్ని అట్లాంటిక్ ఛార్టర్ అంటారు. ఆ ఒప్పందంలో ముఖ్యమైన అంశాలను చూసినట్లైతే ప్రపంచ ప్రాదేశిక సమగ్రతను కాపాడటం, యుద్ధ భయాన్ని తొలగించడం, అంతర్జాతీయ తగాదాలను శాంతియుతంగా పరిష్కరించడం, దేశాల మధ్య స్నేహ సంబంధాలను పెంపొందించడం, అంతర్జాతీయ బాధ్యతలను అన్ని దేశాలు గౌరవించేటట్లు చేయడం, సాంఘిక అభివృద్ధి సాధించి, మానవ జీవితాలను సుఖమయం చేయడం దీని ముఖ్య లక్ష్యం. ఐరాస చార్టర్ చట్టాన్ని 1945 జూన్ 26న ఆమోదించింది. ఐరాస 1945 అక్టోబర్ 24న ఏర్పడింది. భారతదేశం ఐక్యరాజ్య సమితిలో 1945 అక్టోబర్ 30న సభ్యత్వం తీసుకుంది.

ఐరాసలో కీలకమైందే భద్రతామండలి. ఈ సమితి ప్రారంభమయ్యేనాటికి ఇందులో సభ్యదేశాల సంఖ్య 11. భద్రతామండలిలో సభ్యత్వం ఉన్న 15 దేశాలలో 10 దేశాలు రెండేళ్ళకోసారి ఎన్నిక ద్వారా సభ్యత్వం పొందగా, వీటిని తాత్కాలిక సభ్య దేశాలంటాం. మరో 5 దేశాలు శాశ్వత సభ్య దేశాలు. అవి: అమెరికా, రష్యా, బ్రిటన్, చైనా, ఫ్రాన్స్. ఈ శాశ్వత సభ్యదేశాలకు వీటో అధికారం ఉంది. ఏదైనా విషయంలో కీలక నిర్ణయం తీసుకోవాలంటే 5 శాశ్వత దేశాలు ఒప్పుకోవాలి. సమితిలోని 193 దేశాలు ఒప్పుకున్నా, శాశ్వత సభ్యత్వం ఉన్న ఒక్క దేశం ఒప్పుకోకపోతే ఆ తీర్మానం చెల్లదు. శాశ్వత సభ్యత్వం అంత శక్తివంతమయ్యింది కాబట్టే భారత దేశం శాశ్వత సభ్యత్వం పొందడానికి తీవ్ర కృషి చేస్తుంది. కారణమేదైనా అది అందని ద్రాక్షలా ఊరిస్తుంది. భారత ప్రభుత్వం ఇందుకు మద్దతు కూడగట్టేందుకు అలుపెరుగని ప్రయత్నం చేస్తున్నది. ఇప్పటికే అమెరికా, చైనా, ఫ్రాన్స్, జర్మనీ, ఇంగ్లాండ్ దేశాల నేతలతో మాట్లాడారు. భారత ప్రధాని వివిధ దేశాలలో పర్యటించి ఆ దేశ అధ్యక్షుల, ప్రధానుల మద్దతును కోరుతున్నారు.

భారత్‌కు శాశ్వత సభ్యత్వం ఇవ్వాలంటే ఆ ఐదు దేశాలు ఒప్పుకోవాల్సిందే. ఫలితంగా మనకు భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం అందని ద్రాక్షలా ఊరిస్తోంది. భద్రతామండలి తన ఆదేశాలను పాటించని రాజ్యాలపై ఆంక్షలు విధిస్తుంది. అవసరమైతే సైనిక చర్య చేపట్టే అధికారముంది. ఈ అధికారాన్ని అడ్డుపెట్టుకొని అమెరికా మిగతా దేశాలను భయ భ్రాంతులకు గురిచేస్తుంది. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశానికి, సమితిలో వీటో- అధికారం లేకపోవడం చైనా, అమెరికా, ఐరోపా దేశాల వ్యూహంలో భాగం. ఉగ్రవాదాన్ని పెంచిపోషిస్తున్న పాకిస్తాన్‌పై చర్యలు తీసుకోవాలని ఒకవైపు భారత్ గగ్గోలు పెడుతున్నా.. భవిష్యత్‌లో పాక్‌తో మన అవసరాలు ఉంటాయనే తీరులో వ్యవహరిస్తోంది అమెరికా. ఉగ్రభూతం పాకిస్థానే కాదు.. పెద్దన్నను వణికిస్తోంది. అరబ్ దేశాలను నిలువ నీడ లేకుండా చేస్తున్న ఉగ్రభూతం ఇప్పుడు ఆసియా, యూరప్, అమెరికా వంటి ప్రాంతాలకు విస్తరిస్తోంది. మరోవైపు జర్మనీ కూడ మండలిలో శాశ్వత సభ్యతం కోసం యత్నిస్తోంది. మనదేశానికి శాశ్వత సభ్యత్వం లభించకపోవడానికి జపాన్, జర్మనీ కూడ పోటీపడుతుండడం ఒక ప్రధాన కారణం. ఐరోపాకు చెందిన రష్యా, బ్రిటన్, ఫ్రాన్సులకు మండలిలో శాశ్వత సభ్యత్వం ఉంది. అతిపెద్ద ఖండమైన ఆసియాకు ఏకైక ప్రతినిధి చైనా. ఆసియా శాశ్వత ప్రాతినిధ్యాన్ని రెండుకు పెంచాలని శాశ్వత ప్రాతినిధ్యంలేని దక్షిణ అమెరికా, ఆఫ్రికా ఖండాలకు శాశ్వత ప్రాతినిధ్యం కల్పించాలని ప్రతిపాదనలు వినబడుతూనే ఉన్నాయి.

కానీ జర్మనీకి మండలిలో శాశ్వత సభ్యత్వం ఇవ్వడం సాధ్యం కాదు. ఆసియా నుండి రెండవ శాశ్వత సభ్యత్వం మన దేశానికి కాక జపాన్‌కు కట్టబెట్టాలన్నది అమెరికా కోరిక. మండలి శాశ్వత సభ్యత్వ విస్తరణ ప్రతిపాదన కూలబడి పోవడానికి ఇదొక కారణం.

భారత దేశం మొదటినుంచి శాంతికి ప్రాముఖ్యత ఇచ్చే దేశం, గడచిన సంవత్సరాలలో మనకు మనంగా యుద్ధాన్ని ప్రారంభించని చరిత్ర మనది. అంతేకాకుండా ఎప్పటికీ ఎవ్వరి మీద ఆధారపడకుండా స్వయం నిర్ణయాలు తీసుకునే చొరవ, అవసరమైతే ఎదిరించే ధైర్యం మనకే సొంతం. భారత్‌కు శాశ్వత సభ్యత్వం కల్పిస్తే.. అమెరికా, బ్రిటన్, రష్యా వంటి దేశాలు మిగతా దేశాలపై చేసే ఆధిపత్యానికి ఖచ్చితంగా అడ్డుకట్ట పడుతోంది. ఇరాక్‌పై దాడిచేసి.. అధ్యక్షుడు సద్దాం హుస్సేన్‌ను హతమార్చేంతవరకు, తనకు పీడకలలు మిగిల్చిన ఒసామా బిన్ లాడెన్‌ను అంతమొందించే వరకు నిద్రపోలేదు అమెరికా. తాము అనుకున్నది సాధించే వరకు పంతం వీడలేదా దేశం. అదే కాదు.. కొరియా, ఇరాన్, కువైట్, అరబ్ దేశాల్లోను అమెరికా తమ పెత్తనం సాగిస్తోంది.

సోవియెట్ యూనియన్ పతనం తర్వాత ప్రపంచ పెద్దన్నగా మారి అందరి మీద లేని అధికారాన్ని చలాయించాలని చూస్తున్న అమెరికా ప్రయత్నాలకు భారత్ అడుగడుగునా అడ్డం పడుతుంది. భారత్ రంగంలోకి వస్తే తమ మాట వింటుందో లేదో అన్న అనుమానమే ఇందుకు కారణం. అదే జపాన్ దేశానికి సభ్యత్వం ఇస్తే.. తమ మాట ఖచ్చితంగా వింటోందని బలంగా నమ్ముతోంది అమెరికా. అంతే కాదు.. సరిహద్దు విషయంలో చైనాతో మనకు వివాదాలున్నాయి. మణిపూర్‌తో పాటు.. భారత్ సరిహద్దులో ఉన్న ప్రాంతాలను తమవిగా చూపుతోంది చైనా. దీన్ని భారత్ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. అలాగే పెద్దన్న అవతారమెత్తిన తర్వాత అమెరికా ప్రపంచం మొత్తాన్ని తమ గుప్పిట్లో పెట్టుకోవాలనే విధంగా అడ్డంగా ప్రవర్తిస్తుంది. ప్రపంచ మార్కెట్‌ను శాసిస్తున్న చైనా ఆ స్థాయిలో అభివృద్ధి చెంది వారి మార్కెటుకు గట్టి పోటీ ఇవ్వడమే కాకుండా, సరిహద్దులో వారి సైన్యాన్ని తీవ్రంగా అడ్డుకుంటున్న భారత్‌ను ఎదగనీయకుండా అడ్డుపుల్లలు వేస్తోంది. ఎంతలేదన్నా ఐక్యరాజ్య సమితి కేవలం అమెరికా చెప్పినట్లు తోక ఊపుతుందని ప్రపంచ మొత్తానికి తెలుసు. మిగతా దేశాలు కట్టుదిట్టం చేయగలిగినా అమెరికా లాంటి పెద్ద దేశాల దుందుడుకు చర్యలను అడ్డుకోలేక కొన్నిసార్లు తెల్ల మొఖం వేస్తుంది. అమెరికా విఘాత చర్యల పేరిట తన శత్రు దేశాలపై దండెత్తుతూ ప్రపంచానికి సుద్దులు చెప్పడం ఒకింత ఆశ్చర్యం. మితిమీరిన ధన దాహంతో, అశేష సైన్యంతో, విచ్చలవిడి మారణాయుధాలతో, తిరుగులేని సైనిక శక్తి పాటవంతో, లెక్కకు మించి అణ్వాయుధాలతో ప్రపంచాన్ని తన గుప్పిట్లో ఉంచుకోవాలని తెగ తాపత్రయ పడుతూ ఐరాసను ప్రపంచం దృష్టిలో పలుచన చేస్తుంది. ఇటువంటి చర్యలకు అడ్డుకట్ట వేసే విధంగా ప్రపంచ దేశాలన్నీ ఐరాసకు మద్దతు ఇచ్చి దాని ఉనికిని నిలుపుకోవాల్సిన అవసరం ఉంది. శాంతి కాముక దేశంగా విరాజిల్లుతున్న మనకు ప్రపంచ దేశాల నుండి సహకారం అంది వస్తుంది అనేది ఆ దేశాల అనుమానం. కేవలం ఇదే కారణంతో మనకు అడ్డుపుల్ల వేస్తున్నారు. అందుకొరకు అయినా మనకు శాశ్వత సభ్యత్వం తెచ్చుకోవాల్సిన అవసరం ఉంది. మన లక్ష్యానికి అడ్డుపడుతున్న వారి ఆటల్ని కట్టబెట్టి శాశ్వత సభ్యత్వం సంపాదించే విధంగా మన అడుగులు పడాలి. దానికి ఎంతో సహనం, చాకచక్యం అవసరం. ఆ దిశగా అడుగులు పడాలని బలంగా కోరుకుందాం.

-కాళంరాజు వేణుగోపాల్
8106204412

# అమెరికా-చైనా మధ్య మోడీ మధ్యవర్తిత్వం!



భారత్ - చైనా దేశాల మధ్య అనధికారిక శిఖరాగ్ర సమావేశం అమెరికాకు వాణిజ్యలోటును తగ్గించేందుకు, చైనా అమెరికా మధ్య వాణిజ్య పోటీని తగ్గించేందుకు భారత్ మధ్యవర్తిత్వం జరిపినట్లు పలువురు నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కాని ఈ మధ్య ఇండియా పాకిస్తాన్‌ల మధ్య సంఘర్షణ జరగడం వల్ల ప్రపంచ దేశాలకు కొంత ప్రయోజనం చేకూరుతుందని వేచిచూశాయి. ఇదే సమయంలో బ్రిటన్, ఐరోపా దేశాల యూనియన్ (ఈయు) నుండి వైదొలగకుండా ఉండేందుకు అమెరికా ఎత్తుగడలను పసిగట్టిన బ్రిటన్ ప్రజా ప్రతి నిధులు బ్రెగ్జిట్‌కు అనుమతి నియ్యకుండా పార్లమెంటు అడ్డుతగలడం, ఈ మధ్యలో బ్రిటన్ పార్లమెంటును సస్పెండ్ చేసి బ్రిటన్, ఐరోపా యూనియన్ నుండి వైదొలగేందుకు బ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్ చేసిన ప్రయ త్నం వమ్ము అయ్యింది. అమెరికా ఆధిపత్య దౌత్య సంబం ధాలు విఫలమయ్యాయి. అదే రీతిలో అమెరికా దేశం దౌత్యం ఉత్తర కొరియాతో కూడా వైఫల్యం అయ్యాయి. అందుకే అమెరికా భారత్‌ల మధ్యవర్తిత్వం కోసం భారత్ - చైనా సమ్మిట్ జరిగింది. ఈ సమ్మిట్ డ్రాగన్ దేశం చైనా యొక్క ఆశయం రెండో అగ్రరాజ్యంగా ఎదిగేందుకు చేయని ప్రయత్నం లేదు. ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో శాశ్వత ఇండియా సభ్యత్వానికి అందరూ అంగీకరించినా చైనా వ్యతిరేకించింది. 1960లలో కూడా అమెరికా, రష్యాలు భారత్‌కు శాశ్వత సభ్యత్వం ఇవ్వచూపితే భారత్ తిరస్కరించి తటస్థంగా ఉండేందుకు నిశ్చయించుకొంది. అప్పుడు భారత్ శాశ్వత సభ్యత్వానికి చైనాను ప్రతిపాదించింది. కాని అమెరికా అంగీకరిం చలేదు. దాంతో తైవాన్‌కు భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం అమెరికా కట్టబెట్టింది. చివరకు రష్యా మద్దత్తుతో చైనా 1970 యుఎన్‌ఓలో శాశ్వత సభ్యత్వం పొం దింది. ఇప్పుడు భారత్‌ను చైనా వ్యతిరేకిస్తోంది. అమెరికా భారత్‌కు భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం లభిస్తే అమెరికాకు మద్దత్తు పెరుగుతుందని యోచిస్తోంది. ప్రపంచ దేశాల్లో నేటికాలంలో ఆ రక్షణకు గురికావడానికి అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ యొక్క వాణిజ్య విదేశాంగ విధానమే కారణం. ఆయా దేశాల మధ్య ఆ రక్షణ స్థితి ఆయుధాలను ఎక్కువగా సమకూర్చుకోడానికి ప్రయత్నిస్తాయి. అటులనే ప్రపంచ వ్యాప్తంగా ఘర్షణ స్థితికి కారణం అందుకు ట్రంప్ యొక్క రాజకీయ అజ్ఞానం కారణం అని అన్ని దేశాలు పేర్కొంటున్నాయి. కాని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మాత్రం అమెరికా ఏకైక అగ్రరాజ్యమనే సోయ లేకుండా కేవలం వాణిజ్య వ్యాపారాల లాభాల మీదనే తన దృష్టినిలిపి, ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారిలాగా వ్యవహరించడం జరుగుతోంది. ఎవరు ఏమి చెప్పినా అదే పంథాలో తనకు తెలిసిన విధంగా పనిచేస్తున్నాడు.

ఈ నేపథ్యంలో భారత్ - చైనాల మామల్లాపురంలో సమ్మిట్ జరగడాన్ని అందర్నీ ఆకర్షించింది. భారత ప్రధాని మాత్రం అంతర్జాతీయ ఉగ్రవాదాన్ని పారద్రోలాలని పిలుపునిచ్చి శాంతి ద్వారా అభివృద్ధిని పొందాలనే ఆకాంక్ష వ్యక్తం చేయడంతో ఇండో - చైనా మంచి మైలేజ్ వచ్చింది. 2019 ఎన్నికల్లో మోడీ ఘనవిజయం అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను ఆకట్టుకొన్నాయి. 2020లో అమెరికా అధ్యక్ష ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ట్రంప్ అభ్యర్థిత్వాన్ని సమర్థించమనడంతో హౌడీ - మోడీకి అమెరికాలో అత్యంత ప్రచారం దొరికింది. దీన్ని ట్రంప్‌కు రెండోసారి ఎన్నికల తొలిమెట్టుగా పెట్టుకొని వ్యూహాత్మక ప్రాయోజిత సంబంధాలకు రెండు దేశాల డెలిగేట్స్ మధ్య - వాణిజ్యలోటును భారత్ - అమెరికాల మధ్య ఏర్పడ్డం, చైనా - భారత్‌ల వాణిజ్య లోటు పెరగడంతో రెండు దేశాలు నూతన పంథాను ఎంచుకొని తమ స్వతంత్రతను కాపాడుకోడానికి ప్రయత్నం చేస్తోంది. అంతేగాక చైనా - భారత్‌ల మధ్య గుప్తులకాలం నుండి సముద్ర యానం ద్వారా వ్యాపార సంబంధాలు, సాంస్కృతిక సంబంధాలున్నాయి. ఆనాడు చైనా యాత్రికులు పాహియాన్, హుయన్‌త్సాంగ్‌లు భారత్‌ను సందర్శించారు. వారి రాతలలో భారత్ యొక్క సంస్కృతి, సంప్రదాయాలను ఆహారపు అలవాట్లను గూర్చి పాహియాన్ ఇండికా గ్రంథంలో పొందుపరచడం జరిగింది. భారత్ చైనా సంబంధాలు పురాతన కాలం నుండి కొనసాగుతున్నాయి. ఆధునికకాలంలో స్వతంత్ర భారత్‌లో ఆఫ్రో - ఆసియన్ సమావేశాలకు 1955 - 56 కాలంలో జరిగాయి. ఆనాటి చైనా ప్రధానమంత్రి చౌఎన్‌లై ఇండియాను సందర్శించారు. ఆ సందర్భంగా చౌఎన్‌లై "చీనీ ఇండియా బాయి బాయి" అంటూ ఆనాటి ఇండియా ప్రధాని నెహ్రూ - చైనా ప్రధాని చౌఎన్‌లైల మధ్య సుహృద్భావ వాతావరణ సంబంధాలు నెలకొన్నాయి. ఆ ఆఫ్రో - ఏసియన్ సమావేశంకు 52 దేశాలు హాజర య్యాయి. తద్వారా భారత్ యొక్క స్నేహహస్తంకు ఆసియా ఆఫ్రికా దేశాలలో ప్రతిష్ట పెరిగింది. ఆ తరువాత 1962లో చైనా భారత్‌పై దండయాత్ర చేసింది. ఆనాడు భారత సైన్యం అప్రమత్తంగా లేని కారణంగా హిమాలయ ప్రాంతం మంచుకొండల్లో 1,600 కిలోమీటర్ల నిర్మానుష్య ప్రదేశాన్ని ఆక్రమించుకొంది. కనుక ఆనాడు భారత్ ఆ అంశాన్ని అంతగా పట్టించుకోలేదు. కాని చైనా తన విస్తరణ విధానాన్ని భారత్‌లో చైనా ఆక్రమిత ప్రాంతం, సిల్క్ కారిడార్ - కోరాకానన్ పాస్ మంచు ప్రాంతం గుండా సౌదీ అరేబియా వరకు రోడ్డు నిర్మించేందుకు పూనుకొంది. ఈ రహదారి నిర్మాణం ద్వారా మధ్య ఆసి యా అరబ్బు దేశాలకు తన వస్తుసామాగ్రిని యధేచ్ఛగా పంపించుకోడానికి వెసులుబాటు కలుగుతుంది. ఈ రోడ్డు నిర్మాణం వలన ఇండియా ఉత్తర సరిహద్దులు చొరబాట్లు పెరగడమే కాక ఉగ్రవాదం, స్మగ్లింగ్‌లు, అక్రమ మానవ రవాణా పెరుగుటకు ఆస్కారం కలదు. అంటే చైనా భారత్ సరిహద్దులు 3 వేల కిలోమీటర్లుంది. (ఇదంతా మంచు ప్రాంతం హిమాలయ పరీవాహక ప్రాంతం) కనుక డ్రాగన్ చైనా దేశం సుదీర్ఘ కాలంలో ఈ ప్రాంత దేశాల మీద ఆధిపత్యం చెలాయించేందుకు అవకాశం ఉంది. చైనా -భారత్ చెన్నై సమ్మిట్ చారిత్రాత్మకమైన భారత ప్రధాని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌ల మధ్య జరిగిన సంభాషణలలో ఇటీవల చైనా సిల్క్ కారిడార్ నిర్మాణం వలన భారత రక్షణ మీద ప్రభావం చూపుతుంది. కనుక ఆ నిర్మాణాన్ని నిలిపివేయాలని సూచించింది. ఆ అనధికార సమ్మిట్‌లో విదేశాంగ శాఖ మంత్రి శివశంకర్ యొక్క సంభాషణలు చాలా ముఖ్యమైనవి ఎందుకంటే కాశ్మీర్ 370 ఆర్టికల్ 35ఎని రద్దు చేయడం వలన ఉత్పన్నమైన ఇండో - పాక్ ఉద్రిక్తతలలో చైనా జోక్యం హర్షణీయం కాదని శివశంకర్ చెప్పారు. ప్రధాని మోడీ చైనా అధ్యక్షుల మధ్య వాణిజ్య లోటు 80 బిలియన్ డాలర్లను తగ్గించేందుకు సుహృద్భావం తెలుపుకున్నారు. భారత్ తటస్థ విధానాన్ని వదిలి అమెరికా వైపుకు పూర్తిగా మారడం వలన చైనా తన స్థితిని తెలిపింది. ఆర్థికమంత్రి సీతారామన్ కూడా చైనా వైస్ ప్రైమర్‌తో సంభాషణలు జరిపారు. సుదీర్ఘ కాలం నుండి సాగుతున్న సాంస్కృతిక సంబం ధాలే కాకుండా భారత్‌లో రైల్వే పథకాలలో చైనా కూడా పాల్గొనేందుకు ఉత్సుకత చూపిస్తోంది. కాని రైలు మార్గా ల నిర్మాణాన్ని ఇప్పటి జపాన్‌తో ఒప్పందా లున్నాయి. 100 శాతం ఎఫ్‌డిఐకి అనుమతి నీయడం వలన చైనా పలు రంగాలలో పాల్గొనే అవకాశం ఉంది. చైనా బ్రహ్మపుత్ర నదిమీద వంతెన నిర్మాణాల వలన చైనాతో భూమార్గ వాణిజ్య సంబంధాలు అధికమౌతాయి. చైనాకు హాంకాంగ్ తలనొప్పి దక్షిణ పసిఫిక్ దేశాల కారిడార్ చైనా ఆధిపత్యాన్ని వ్యతిరేకిస్తున్న అమెరికా ఎన్నో వాణిజ్య ఆంక్షలను విధించింది. ఇట్లా ఎన్నో అంశా లు దాదాపు 16 అంశాల మీద రెండురోజుల చైనా - భారత్ అనధికారిక సమ్మిట్‌లో చర్చించారు. ఈ సమ్మిట్ యొక్క ఒప్పంద విషయంలో రెండు దేశాలు ఆసక్తి చూపు తున్నాయి. కనుక మన సరిహద్దు డ్రాగన్ దేశం ఇండి యాను ఇబ్బందుల్లోకి నెట్టకుండా అమెరికా, చైనాల వాణి జ్య ఆంక్షలు వలన చైనా నష్టపోకుండా చూసుకోవలసిన అవసరం ఉంది. అమెరికా, చైనాలు కూడా భారత్‌లో యురేనియం వెలికి తీసేందుకు ఉత్పత్తులను యురేని యం దేశాలలో తిష్టవేసేందుకు పోటీ పడుతున్నాయి. ప్రధాని మోడీ యొక్క మద్దత్తుతో విదేశాలలో కూడా బాగా చొచ్చుకు పోయారు. ఏదేమైనా చైనా - భారత్ సమ్మిట్ వలన రెండు దేశాలు తమ తమ రంగాలలో ఆరితేరాయి. కనుక పెద్ద దేశాలలో భారత్, గ్రేటర్ దేశంగా చైనా అంత ర్జాతీయంగా ఆకర్షణను అందుకొన్నాయి. ఈ సమ్మిట్‌తో భారత్ విధానం బలప డింది. సమన్వయం, సహకారం మరింత పెంపొం దేందుకు బాగా తోడ్పడుతుందని ఆశిద్దాం.

-కె. కావ్య
8008359912

# తెలుగుపై ఆంగ్ల క్రీనీడలు

కాళోజీ వంటి కవుల ఆవేదన, భాషాభిమానుల రోదన దశాబ్దాలుగా కొన సాగుతూనే ఉన్నా తెలుగు భాష స్థితిగతులలో మాత్రం ఆశావహమైన మార్పేమీ కనబడడంలేదు. జీవన శైలిలో వచ్చిన మార్పుల కారణంగా ఇప్పటివారికి పేడ నీళ్లను కళ్ళాపిగా చల్లడం, అలుకు మట్టి, పేడ కలిపి ఇళ్ళు అలకడం, పాదుట్టు (బూజు) దులపడం వంటి కొన్ని వందల పదాల గురించిన కనీస అవగాహన కూడా లేకుండా పోయింది. దున్నడానికి ట్రాక్టర్లు వచ్చాక దుక్కి, ఏరువాక, నాగలి, కర్రు, దండి, గొర్రు వంటి పదాలు క్రమంగా అంతర్ధానం అవుతున్నట్లే, పంట నూర్పిడి యంత్రాలు (హార్వెస్టర్లు) వాడకంలోకి వచ్చాక కళ్ళం, పొలికట్టలతో కళ్ళాన్ని ఊడ్చడం, ధాన్యాన్ని తూర్పార పట్టడం, చేలలో పరిగ ఏరడం, పనలు సేకరించి మోపులుగా చేసి కుప్ప వేయడం, నూర్పిడి, మాసూళ్లు వంటి పదాలు ఏవీ మచ్చుకైనా వాడకంలో లేకుండా పోయాయి. ఇది ఒక తప్పనిసరి పరిణామం. వ్యవసాయం యాంత్రికీకరణం చేయబడుతున్న కొద్దీ పాత పదాల స్థానంలో కొత్తపదాలు వచ్చి చేరక తప్పదు. జీవన శైలికి అనుగుణంగా భాషా పరిణామం ఒక సహజమైన, నిరంతర ప్రక్రియ. దానిని గురించి పెద్దగా ఆందోళన చెందాల్సిన పనేంలేదు. అయితే నానాటికీ మితిమీరుతున్న ఆం గ్ల భాషాభిమానం మాత్రం మరీ కలవరం కలిగిస్తున్నది. సగటు తెలుగువారు ఇప్పుడు చదువుతున్న, మాట్లాడుతున్న, రాస్తున్న భాషలో తెలుగు పదాల కోసం ఒక్కోసారి వెతుక్కోవాల్సి వస్తోంది. ట్రిబ్యునల్, ఎమర్జెన్సీ, బ్లాక్ డే, మీడియా, దాదా వర్సెస్ దీదీ, సుమోటో' (వాస్తవానికిది 'సు మోటు' అయినా అందరూ సుమోటో అనే అనేస్తున్నారు), 'ఫీజు, రిజిస్ట్రేషన్, పిటిషన్, నోటిఫికేషన్, ప్లాట్లు, జర్నలిస్టులు, టాయిలెట్, పీవోకే, స్పోర్ట్స్, క్రైమ్ కార్నర్, క్యూ ఆర్ కోడ్‌ని స్కాన్ చేయడం, కాబినెట్ భేటీ, చోరీ కేసుల్లో రికవరీ, క్రికెట్ బెట్టింగ్స్, బయో ఎరువులు, మోడల్ పేపర్, బార్లకు కిక్కు, రిటైల్ షాప్ లైసెన్సులు, బెల్టు షాపులు,' వంటి పదాలు వేలాదిగా కనిపిస్తాయి. నేతిబీరకాయలో నెయ్యి ఎంత ఉంటుందో, వీటిలోనూ తెలుగు అంతే ఉంటుంది. ఇక తిరుమల సమాచారం చూద్దామంటే 'ఈ - దర్శనం కౌంటర్, కాటేజీలు, విఐపి దర్శనం, స్పెషల్ బ్రేక్ దర్శనం, టిక్కెట్లు, క్యూలైన్లు, రిజర్వేషన్స్ వంటి ఎన్నో ఆంగ్ల పదాలే కనిపిస్తాయి. సినిమా ప్రకటనలు చుద్దామా వాటిలో అంతకన్నా ఎక్కువగా ఆంగ్లపదాలు ఉంటున్నాయి.- టీవీ పెడితే, ప్రసార మాధ్యమాల సంగతి సరేసరి. రోజూ వాటిని వీక్షించేవారికి వేరే చెప్పనవసరం లేదు. స్వాతంత్ర్యం రాకముందు విద్యాధికులు ఎక్కువగా ఉన్న బెంగాల్ వంటి రాష్ట్రా లలో ప్రజలలో ఆంగ్ల భాషా సంస్కృతులపై మక్కువ ఎక్కువగా ఉండేది. ముఖ్యంగా బెంగాలీలలోని విద్యాధికులంతా పాశ్చాత్య సంస్కృతీ ప్రభావానికి లోనై అప్పట్లో దొరల సంస్కృతిని అలవరచుకున్నారు. అయితే దానిలో కొంతైనా అర్థం ఉంది. భారతదేశంలో తెల్లవారు ప్రవేశపెట్టిన మెకాలే విద్యావిధానం లో చదువుకుని, ఆ తరువాత ఇంగ్లాండ్, ఐర్లాండ్ వెళ్లి మరింత పెద్ద చదువులు చదువుకుని వచ్చినవారు కనుక వారిపై ఆ సంస్కృతీ ప్రభావం ఉండడంలో మనం ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు. కాని స్వతంత్ర భారతంలో పుట్టి, పెరిగి, చదువుకున్న తెలుగువారికి మాతృభాషాభిమానం కాస్తయినా లేకుండా పోవడం ఆశ్చర్యకరం. తెలుగు వారిలో మొదటినుంచి అనుకరణ పట్ల మోజు ఎక్కువ. అమెరికాలో స్థిరపడిన తమిళులు, కన్నడిగులు, మలయాళీలు వారి వారి వేషభాషలతో తమ సాంస్కృతిక పునాదిని పదిలంగా కాపాడుకుం టుంటే అక్కడి తెలుగు ప్రవాసులు మాత్రం ఆంగ్ల భాషా సంస్కృతులను మక్కికి మక్కీగా అనుకరించడంలో ప్రసిద్ధి పొందారు. ఆంగ్లేతరులు ఇద్దరు తమలో తాము తమ మాతృభాషలో కాక ఆంగ్లంలో మాట్లాడుకుంటుండే వారు తప్పనిసరిగా తెలుగువారై ఉంటారనే ఒకనాటి నానుడిని మన తెలుగు ప్రవాసులు అక్షరాలా నిజం చేస్తున్నారు. అమెరికాలోని తెలుగువారిలో తమ భాషా సంస్కృతులను పరిరక్షించుకోవాలని, తమ పిల్లలు అక్కడున్న తప్పని పరిస్థితులలో ఆంగ్ల మాధ్యమంలో చదువుకుంటున్నా తమ మాతృభాషతో వారి బంధాన్ని, పరిచయాన్ని మాత్రం ఎలాంటి పరిస్థితులలోనూ కోల్పోరాదని భావించిన కొందరు తెలుగును కూడా వారికి నేర్పే ఉద్దేశంతో 'మనబడి' వంటి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం అక్కడి పరిస్థితి కొంతమేరకు ఆశాజనకంగానే ఉంది. కానీ మన తెలుగు రాష్ట్రాలలో మాత్రం మాతృభాషస్థితి అందుకు భిన్నంగా ఉంది.

> "తెలుగు వాడవురోరి తెలుగు మాట్లాడుటకు
> సంకోచపడెదవు సంగతేమిటిరా?
> అన్యభాషలు నేర్చి ఆంధ్రంబు రాదనుచు
> సకిలించు ఆంధ్రుడా దావవేటికిరా??
>
> - మహాకవి కాళోజీ!!

-ముత్తేవి రవీంద్రనాథ్
9849131029

# సిగ్నలింగ్ ప్రాసెసింగ్‌లో విప్లవాత్మక మార్పులు

**• డీఆర్డీవో, ఐసీఐ డైరెక్టర్ డీహెచ్‌వీఎస్ నారాయణమూర్తి**




**కాజీపేట, ప్రభన్యూస్:** గత ఐదు దశాబ్దాలతో పోలిస్తే ఇటీవలి కాలంలో సిగ్నలింగ్ ప్రాసెసింగ్‌లో వేగవంతంగా మార్పులు వస్తున్నాయని డిఫెన్స్ రీసెర్చ్ డెవలప్ మెంట్ ఆర్గనైజేషన్, రీసెర్చ్ సెంటర్ ఇమ్రాత్, హైదరాబాద్ డైరెక్టర్ బి. హెచ్ వి ఎస్ నారాయణ మూర్తి అన్నారు. బుధవారం నిట్‌లో ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యం లో నిర్వహించిన అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పారిశ్రామిక రంగానికి చెందిన అనుభవజ్ఞులు, శాస్త్రవేత్తలు, సాంకేతిక సంస్థల్లో చదివే పరిశోధకులు సిగ్నల్ ప్రాసెసింగ్, కమ్యూనికేషన్ వ్యవస్థలో వస్తున్న మార్పులపై చర్చించుకోవడం వల్ల మంచి ఫలితాలు వస్తాయని అన్నారు. పరిశ్రమలు, సాంకేతిక సంస్థల మధ్య ఉండే సంబంధాలను మెరుగు పరుచుకోవాలన్నారు. కమ్యూనికేషన్స్, ఇన్ఫర్మేషన్, ప్రాసెసింగ్, కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్, కంట్రోల్ సిస్టమ్స్, రాడార్, మెడికల్ డయాగ్నసిస్, ఏయిరోస్పేస్ రంగాల్లో సిగ్నల్ ప్రాసెసింగ్ ఉపయోగ పడుతుందన్నారు. నిట్ ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ ఇంజ నీరింగ్ విభాగాధిపతి భీమారావు మాట్లాడుతూ స్పార్క్‌కు సంబంధించిన 4.5 కోట్ల రూపాయల నిధులతో నిట్ పరి శోధనలు జరుగుతున్నాయని, ఈ కాన్ఫరెన్స్‌లో 100 మంది పరిశోధకులు పరిశోధన పత్రాలు సమర్పిం చారని తెలిపారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు, పరిశోధ కులు, నిట్ ప్రొఫెసర్లు రూపొందించిన సావనీర్‌ను విడుదల చేశారు. ఈ సమావేశంలో నిట్ రిజిస్ట్రార్ ఎస్. గోవర్ధన్ రావు, కాన్ఫరెన్స్ కో ఆర్డినేటర్ ఎల్. కృష్ణానంద్, నిట్ ప్రొఫెసర్లు రాజేష్ కుమార్, పి. శ్రీహరి రావు తదితరులు పాల్గొన్నారు.

# డెంగ్యూ చంపేస్తోంది

(మొదటిపేజీ తరువాయి)

చనిపోయారు. ఇంత కంటే దారుణం ఏమైనా ఉంటుందా..? దోమకు మనుషుల్లో వ్యత్యాసం తెలీదు. దోమలను లెక్కించి ఏం చేస్తారు..? మనకు అవి అక్కర్లేదు. వాటిని చంపే యంత్రాలు కావాలి. పటిష్టమైన చర్యలు తీసుకున్నామని చెబుతున్నారు. అసలు ఏం తీసుకున్నారో చెప్పగలరా..? అధికారుల కుటుంబ సభ్యులకు జయమ్మ లాంటి పరిస్థితి వస్తే ఏం చేస్తారు..? మేము పడుతున్న బాధలు మీకు వస్తే అప్పుడు తెలుస్తుంది. తెలంగాణ వ్యాప్తంగా డెంగ్యూ దోమ స్వైర విహారం చేస్తుంటే అరికట్టలేరా..? నివారణ చర్యలు తీసుకుంటున్నామని చెబుతున్నారు.. ఓకే.. కానీ ఆచరణలో కనిపించడం లేదు కదా..! నిజంగా తీసుకుంటే మరణాలు ఎందుకు ఆగడం లేవు మరి..? యూరప్‌లో ఒకప్పుడు ప్లేగు వ్యాధితో లక్షలాది మంది చనిపోయారు. వారిలో ఇద్దరు క్రైస్తవ మతగురువులు కూడా ఉన్నారు. మీకు తెలుసా..? దోమలకు మన హోదాతో పని ఉండదు. డెంగీ మరణాలు నియంత్రించడంలో వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది. మేం కఠినంగా వ్యవహరించలేదని ప్రజలు భావించే పరిస్థితికి తీసుకురాకండి. దాగుడు మూతలు వద్దు.. రంగంలోకి దిగండి. ఈ కేసులో ప్రతివాదులుగా ఉన్న వైద్య, ఆరోగ్య శాఖ అధికారులతో పాటు సీఎస్ ఎస్‌కే జోషి వ్యక్తిగతంగా గురువారం (నేడు) ఉదయం 10.30 గంటలకు హాజరుకావాలి. ఇప్పటి వరకు తీసుకున్న చర్యలేంటి..? డెంగీ నియంత్రించేందుకు మీకు ఉన్న ఇబ్బంది ఏంటి..? పూర్తి వివరాలతో ముందుకు రావాలి" అని హైకోర్టు ధర్మాసనం బుధవారం మొట్టి కాయలు వేసింది. రాష్ట్రంలో డెంగీ జ్వరాల నివారణ చర్యలపై తెలంగాణ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రజల్లో అవగాహన కల్పిం చేందుకు సరైన చర్యలు చేపట్టం లేదంటూ మండిపడింది. డెంగీ మరణాల నేపథ్యంలో ప్రభుత్వం తీసుకున్న చర్యలేంటో తెలియ జేయాలని మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కొంపల్లికి చెందిన డాక్టర్ ఎం.కరుణ హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలు చేసిన విషయం తెలిసిందే. అలాగే తెలంగాణ వ్యాప్తం గా ఉన్న ప్రభుత్వ ఆస్పత్రుల్లో స్వైన్ ఫ్లూ, డెంగ్యూ, టైఫాయిడ్, మలేరి యా వంటి ప్రాణాంతక వ్యాధులకు చికిత్స చేసేందుకు అవసరమైన వైద్య పరికరాలు లేవని పేర్కొంటూ న్యాయవాది రాపోలు భాస్కర్ హైకోర్టుకు లేఖ రాశారు. ఆ లేఖను ప్రజాహిత వ్యాజ్యంగా పరిగణించిన హైకోర్టు మరో ప్రజాహిత వ్యాజ్యంతో కలిపి హైకోర్టు సీజే జస్టిస్ రాఘవేంద్ర సింగ్ చౌహాన్, జస్టిస్ ఏ.అభిషేక్ రెడ్డితో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం విచారణ చేపట్టింది. తీసుకున్న చర్యలను వివరించాలని ఆదేశిస్తూ సీఎస్ ఎస్‌కే జోషి, ప్రజారోగ్య శాఖ డైరెక్టర్, జాయింట్ డైరెక్టర్, జీహెచ్ఎంసీ కమిషనర్ వ్యక్తిగతంగా హాజరుకావాలని ఆదేశిస్తూ తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేసింది.

## కేసులు తగ్గాయి : అడ్వకేట్ జనరల్

రాష్ట్రంలో డెంగీ పరిస్థితి, ప్రభుత్వం చేపట్టిన చర్యలపై అడ్వకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్ నివేదికను బుధవారం హైకోర్టులో సమర్పించారు. రాష్ట్రంలో ఎంత మందికి డెంగ్యూ జ్వరాలు వచ్చాయి..? ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంది..? అనే విషయాన్ని ఆయన నివేదించారు. గతంతో పోలిస్తే రాష్ట్ర వ్యాప్తంగా డెంగ్యూ కేసులు తగ్గాయని అడ్వకేట్ జనరల్ ధర్మాసనానికి వివరించారు. డెంగ్యూ వ్యాధి నివారణకు ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుందని విన్నవించారు. 1,808 నుంచి 1,502కు తగ్గినట్టు తెలిపారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి సమర్పించిన అదనపు అఫిడవిట్‌ను అడ్వకేట్ జనరల్ చదివి వినిపించారు. దోమల సంఖ్యను గుర్తించే అత్యంత ఆధునిక సాంకేతికతను సమకూర్చుకున్నట్లు తెలిపారు. దోమల ఆవాసాలను గుర్తించేందుకు డ్రోన్లను కూడా వినియోగిస్తున్నట్లు విన్నవించారు. 427 దోమల బ్రీడింగ్ కేంద్రాలను గుర్తించినట్లు ఏజీ తెలిపారు. దీనిపై సీజే స్పందిస్తూ... ''దోమలను లెక్కించే యంత్రాలు అవసరంలేదు. దోమలను చంపే యంత్రాలు కావాలి. వాతావరణ శాఖ నివేదిక ప్రకారం రాబోయే కొద్ది రోజుల్లో వర్షాలు అధికంగా కురిసే అవకాశాలు ఉన్నాయి. ఈ సందర్భంలో డెంగ్యూ కేసులను తగ్గించేందుకు తీసుకున్న చర్యలు ఏంటి..?'' అని ప్రశ్నించారు. అలాగే డెంగ్యూ జ్వరంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం కనీస చర్యలను కూడా తీసుకోలేదని సీజే మండిపడ్డారు.

# భారత 'ధ్రువ'తారలుగా వెలగండి

**• కేంద్ర ప్రభుత్వ ధ్రువ్ వేడుకల్లో ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు**



**న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ :** భారత గడ్డపై పుట్టిన ప్రతి ఒక్క చిన్నారిలో ఏదో ఒక ప్రతిభ సహజంగానే ఉంటుందని దానికి సానబెట్టి, సృజనాత్మకతను జోడిస్తే దేశ భవిష్యత్ మరింత వైభవంగా ఉంటుందని ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. నడి సముద్రంలో ఉన్నా అధైర్యపడొద్దని మార్గ దర్శనం చేసే ధృవుడి జీవిత స్ఫూర్తితో విద్యార్థులంతా ధ్రువ తారలుగా మారేందుకు కష్టపడి చదవాలని సూచించారు. బుధ వారం ఢిల్లీలోని సిరి ఫోర్ట్ స్టేడియంలో కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థుల్లో సృజనాత్మక అభ్యాసనను పెంచే కార్యక్రమం 'ధృవ్' ముగింపు వేడుకల్లో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దేశంలో నైపుణ్యా నికి కొదవేలేదని... అయితే దీనికి సృజ నాత్మకతను జోడిస్తూ వినూత్నంగా ముందుకెళ్లాలని విద్యార్థులకు ఆయన సూచిం చారు. విద్యార్థుల్లో ఉండే సృజనాత్మకతను వెలికితీసేందుకు ప్రతి పాఠశాల, ప్రతి కాలేజీ, ప్రతి యూనివర్సిటీలో 'ధృవ్' వంటి కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని, ఈ దిశగా కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న పలు పథకాలకు తోడు.. మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ ప్రత్యేక చొరవ తీసుకోవాలని వెంకయ్య నాయుడు సూచించారు. అక్టోబర్ 10 నుంచి అక్టోబర్ 23 వరకు 14 రోజుల్లోనే విద్యార్థులు తమకు నచ్చిన అంశాన్ని నేర్చుకోవడంతో పాటు అద్భుతంగా ప్రదర్శించారని ఉప రాష్ట్రపతి కితాబిచ్చారు. దేశంలోని 28 రాష్ట్రాలకు చెందిన 60 మంది విద్యార్థులు (9 నుంచి 12వ తరగతి వరకు) ధృవ్ కార్యక్రమంలో భాగస్వాములయ్యేట్లు చేసిన ప్రధాని నరేంద్ర మోదీ దార్శనికతను ఆయన ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రి రమేష్ పోఖ్రియాల్ నిశంక్, హెచ్‌ఆర్డీ శాఖ సహాయ మంత్రి సంజయ్ శ్యామ్‌రావ్, ముఖ్య సాంకేతిక సలహాదారు ప్రొఫెసర్ కె.విజయ్ రాఘవన్, పాఠశాల విద్య కార్యదర్శి అమిత్ ఖరే, ఉపరాష్ట్రపతి కార్యదర్శి సుబ్బారావు పాల్గొన్నారు.

## చేనేత కార్మికులకు రూ.178 కోట్లు

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** రాష్ట్రంలోని చేనేత కార్మికులకు ఆర్థికసాయం చేయడం కోసం రాష్ట్ర ప్రభుత్వం నిధులను విడుదల చేసింది. 2019-20 ఆర్థిక సంవత్స రంలో బడ్జెట్ కేటాయింపుల నుంచి రూ. 178.50 కోట్లకు పరిపాలన అనుమతులు ఇస్తూ బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి సి పార్థసారథి బుధవారం ఉత్తర్వులు విడుదల చేశారు.

## మల్టీపర్పస్ వర్కర్స్ విధానం రద్దు చేయాలి

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** గ్రామ పంచాయతీల్లో మల్టీపర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు పాలడుగు భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.బుధవారం మీడియా సమావేశంలో భాస్కర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జీవో 51ని సవరించాలన్నారు. జీవోను సవరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 31న పంచాయతీరాజ్ కమీషనర్ కార్యాలయం వద్ద ధర్నా చేయనున్నట్టు తెలిపారు.

## ఆయుష్ కళాశాలల్లో సీట్ల భర్తీకి రేపు వెబ్ కౌన్సెలింగ్

**వరంగల్, ప్రభన్యూస్:** ఆయుష్ ప్రైవేటు కళాశాలల్లో యజమాన్య కోటాలో సీట్ల భర్తీకి ఈనెల 25న వెబ్ కౌన్సెలింగ్ జరుగుతుందని కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ మేరకు మాపప్ రౌండ్ కౌన్సెలింగ్‌కు బుధవారం నోటిఫికేషన్ జారీ చేసింది. యూజీ ఆయూష్ కోర్సుల్లో మిగిలిపోయిన సీట్లను ఈ నోటిఫికేషన్ ద్వారా భర్తీచేయనున్నారు. తుది మెరిట్ జాబితాలోని అర్హులైన అభ్యర్థులు ఈనెల 25న ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లో ప్రొ. రాంరెడ్డి దూరవిద్యాకేంద్రంలో ఏర్పాటు చేసిన సెంటర్‌కు హాజరుకావాలని పేర్కొన్నారు.

# మైనింగ్‌తోనే ప్రగతి పరుగులు

**• స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి**



**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** ఇసుక మొదలుకుని సిమెంట్, స్టీల్ దాకా మైనింగ్‌తోనే దేశ ప్రగతి సాధ్యపడుతున్నట్టు తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస రెడ్డి అన్నారు. భవనాలు నిర్మించాలన్నా, రోడ్లు వేయాలన్నా, వంతెనలు నిర్మించాలన్నా, చివరకు ప్రాజెక్టులు నిర్మించాలన్నా ఏ రంగంలోనైనా మైనింగ్ ద్వారా వచ్చే ఖనిజాల వల్లనే సాధ్యమని వెల్లడించారు. బుధవారం ఇంజ నీర్స్ ఇనిస్టిట్యూట్‌లో 'మైనింగ్.. ప్రస్తుత పరిస్థితి-భవిష్యత్తులో పెట్టు బడులు సవాళ్లు' అన్న అంశంపై మూడు రోజుల అంతర్జాతీయ సదస్సును స్పీకర్ ప్రారం భించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో స్పీకర్ మాట్లా డుతూ తాము లా మేకర్స్ మాత్రమేనని, ఇంజనీర్లు ప్రాజెక్టు మేకర్స్ అని అన్నారు. తానుకూడ 1966లో ఇక్కడే ఇంజనీరింగ్ విద్యార్థిగా ఉంటూ మధ్యలో చదువు మానేసి రాజకీయాల్లోకి చేరాల్సివచ్చిందన్నారు.ఆరుసార్లు ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించిన తాను ఏడాదిపాటు మైనింగ్ శాఖ మంత్రిగా పనిచేసినట్టు గుర్తు చేశారు. తాను మంత్రిగా చార్జి తీసుకునే నాటికి కేవలం రూ160 కోట్లు మాత్రమే ఉన్న మైనింగ్ శాఖ ఆదాయాన్ని ఏడాదిలోనే రూ.450 కోట్లకు పెంచినట్టు తెలిపారు.హోంశాఖ మంత్రి మహ్మద్ అలీ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మైనింగ్ రంగానికి అపారమైన అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ రాష్ట్రంలో పెట్టుబడులు పారిశ్రామిక వేత్తలకు ఎంతో లాభదాయకంగా ఉంటాయన్నారు. ఇంజనీర్స్ ఇన్‌స్టిట్యూట్ ఛైర్మన్ రామేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మైనింగ్ శాఖ డైరెక్టర్ సుశీల్ కుమార్ ,ఐఇఐ మైనింగ్ ఇంజనీరింగ్ డివిజన్ ఛైర్మన్ చంద్రమోహన్ , ఇఐఐ అధ్యక్షులు డా.టిఎం గుణరాజ్ , కార్యదర్శి టి.అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# డిజిటలైజేషన్‌లో ఎస్‌సీఆర్ దూకుడు

**• లోకో పైలట్లకు వెసులుబాటు**

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** రైల్వే సంస్కరణలలో దేశంలోని అన్ని రైల్వే జోన్‌ల కంటే ఎంతో ముందున్న దక్షిణ మధ్యరైల్వే డిజిటలైజేషన్ ప్రక్రియనూ వేగంగా అమలు చేస్తోంది. రైలు ప్రయాణంలో కీలకమైన లోకో పైలట్లకు ట్యాబ్‌లు, ఇతర సాంకేతిక పరికరాలు అందించడం ద్వారా వారిపై పని భారాన్ని తగ్గించడంతో పాటు సామర్థ్యాన్ని పెంచేందుకు కసరత్తు చేస్తోంది.

రైళ్ళ నిర్వహణలో లోకో పైలట్ల పాత్ర ఎంతో కీలకమైనది. సాధారణంగా నియమించే ముందు వారికి డ్రైవింగ్‌తో పాటు సిగ్నల్ అమరికలోని విభాగాలకు సంబంధించిన సాంకేతిక, భద్రతా నియమాలు, ఎలక్ట్రిక్, డీజిల్ ఇంజిన్లు పనిచేసే పద్ధతి, వాటిలో లోపాలు తలెత్తినపుడు పరిష్కరించే విధానం, రైలుమార్గంపైన అవగాహన, పట్టాల స్థితి, కాషన్ ఆర్డర్‌లు, వేగ నిబంధనలపై కఠోర శిక్షణ ఇస్తారు. రైలు నడుపుతున్నపుడు ప్రతీ లోకోపైలట్ రూల్ బుక్స్‌తో పాటు సమస్యలు తలెత్తినపుడు పరిష్కరించే సూచనల మాన్యువల్, ఆక్సిడెంట్ మాన్యువల్, వర్కింగ్ టైం ట్యాబ్, వివరాలు రాసుకునేందుకు రఫ్ జర్నల్ వంటివి తమతో పాటు తప్పనిసరిగా ఉంచుకుంటారు. అత్యవసర పరిస్థితుల్లో వీటిని అధ్యయనం చేసి తగిన చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. ఈ మాన్యువళ్ళు అన్నీ కలిపి దాదాపు పది కేజీల బరువుంటుంది. దీంతో నిత్యం వాటిని తమతో పాటు తీసుకు వెళ్ళడం, అత్యవసర సమయాల్లో ఉపయోగించడం కష్టసాధ్యంగా మారడంతో పాటు సమయం కూడా వృథా అవుతోంది.

## విజయవాడలో ట్యాబ్‌ను వినియోగిస్తున్న లోకో పైలట్లు

లోకో పైలట్ల ఇబ్బందులను తొలగించేందుకు దక్షిణ మధ్య రైల్వే ఈ సమాచారమంతా ఆండ్రాయిడ్ ట్యాబ్లెట్ పీసీలో భద్రపరిచి లోకో పైలట్లకు ఇవ్వాలని నిర్ణయించింది. అవసరమైన సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకోవడంతో పాటు కమాండ్ కంట్రోల్‌కు అందించడానికి కూడా వీలు కలుగుతుంది. నామినేటెడ్ కంట్రోల్ నుంచి ఎప్పటికప్పుడు ఈ ట్యాబ్‌లలో సమాచారాన్ని అప్‌డేట్ కూడా చేస్తున్నారు. లోకో పైలట్ క్రూ లాబీ వైఫై జోన్‌లోకి రాగానే ఈ ట్యాబ్ ఆటోమేటిక్‌గా కంట్రోల్‌కు కనెక్ట్ కావడమే కాకుండా సమాచారం కూడా అప్‌డేట్ అవుతుంది. దీంతో లోకో పైలట్లకు తాజా సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందించేందుకు వీలు కలుగుతుంది. లోకోపైలట్లు సమాచారాన్ని ట్యాబ్‌లలో ఎంటర్ చేసేందుకు వీలుగా 'ఈ-రఫ్ జర్నల్'ను కూడా ట్యాబ్‌లో అందుబాటులో ఉంచారు. ప్రస్తుతం విజయవాడ డివిజన్‌లో మెయిల్, ఎక్స్‌ప్రెస్, పాసింజర్ రైళ్ళలో పని చేస్తున్న లోకోపైలట్లకు ఈ ట్యాబ్‌లు అందజేశారు. వీటి పనితీరును పరిశీలించిన అధికారులు జోన్ అంతటా ఈ విధానాన్ని అమలు చేసేందుకు రైల్వే అధికారులు సిద్ధమవుతున్నారు.

## కామన్ మినీ లైన్ బాక్సులు

లోకో పైలట్లు అత్యవసర సమయాల్లో వినియోగించుకునేందుకు వీలుగా కామన్ మినీ లైన్ బాక్సులను కూడా విజయవాడ జోన్‌లో పంపిణీ చేశారు. టూల్ కిట్‌లను వివిధ రకాల పెట్టెల్లో తీసుకువెళ్ళడం లోకో పైలట్లకు ఇబ్బందిగా మారినందున ఒకే పెట్టెలో వాటిని కలిపి కామన్ మినీ లైన్ బాక్స్ (సీఎంఎల్)గా మార్చారు. దీంతో పైలట్లపై మరో భారం తగ్గినట్లయింది. దక్షిణ మధ్యరైల్వే పరిధిలోని ఆరు డివిజన్లలోనూ లోకో పైలట్లకు అందుబాటులోకి తెచ్చారు. తక్కువ స్థలం ఆక్రమించేలా రూపొందించిన ఈ బాక్సుల రూపకల్పన వల్ల గతంలోలా వీటి నిర్వహణకు అదనపు సిబ్బంది అవసరం ఉండదు. దీంతో ఏటా రైల్వే జోన్‌కు కోటి రూపాయల మేర డబ్బు కూడా ఆదా అవుతోంది. రైల్వే బోర్డు స్థాయిలో ఉత్తమ ఆవిష్కరణల్లో ఈ కామన్ మినీ లైన్ బాక్స్ కూడా ఒకటిగా అధికారులు చెబుతున్నారు.

## లోకో పైలట్లే ప్రధానం



రైల్వేల ప్రధాన బలం లోకో పైలట్లేనని, మానసికంగా, శారీరకంగా వారు బాగుంటేనే రైల్వే సేవలలో ఎలాంటి ఆటంకాలు ఏర్పడవని రైల్వే జీఎం గజానన్ మాల్యా అన్నారు. వీరి పని తీరు మెరుగుపరిచేందుకు విజయవాడ జోన్ తీసుకున్న చర్యలను అభినందించారు. రైలింజన్లల్లో క్రమంగా ఎయిర్ కండిషనింగ్ సదుపాయం ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు.

# హైదరాబాద్ చుట్టూ కొత్త మార్కెట్లు

**• దశలవారీగా జిల్లాల్లోనూ ఏర్పాటు • బస్తా బరువు 80 కిలోలకు పెంపు: మంత్రి నిరంజన్‌రెడ్డి**

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** రాష్ట్రంలో కూరగాయల సాగును ప్రోత్సహిస్తూనే వాటి మార్కెటింగ్‌కు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి తీసుకువస్తున్నామని వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్ రెడ్డి తెలిపారు. త్వరలోనే నగరం చుట్టూ మరిన్ని మార్కెట్లను నెల కొల్పుతామని, అనంతరం జిల్లా కేంద్రాలు, నియోజకవర్గ కేంద్రాల్లోనూ కొత్త మార్కెట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. బుధవారం బోయిన్‌పల్లి వ్యవసాయ మార్కెట్ యార్డును సందర్శించిన మంత్రి స్థానిక రైతులతో ప్రత్యేకంగా మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాజధాని నగరం చుట్టూ ఉన్న ఆరు జిల్లాల నుంచి నిత్యం టన్నుల కొద్దీ కూర గాయలు వస్తుంటాయని, వాటిని అమ్ముకునేందుకు రైతులకు ప్రత్యేక వేది కలు అవసరమన్నారు. విస్తరిస్తున్న నగరానికి అనుగుణంగా కొత్త మార్కెట్లను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయిస్తున్నా మన్నా రు.

## బోయిన్‌పల్లి మార్కెట్‌ను విస్తరిస్తాం

13 రాష్ట్రాల నుంచి వచ్చే కూరగాయల అమ్మకానికి ప్రధానమైనది బోయిన్‌పల్లి వ్యవసాయ మార్కెట్ అని మంత్రి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. మార్కె ట్ పక్కనున్న ఎల్ఐసీ స్థలాన్ని లీజుకు తీసుకుని, ప్రత్యామ్నాయంగా మరోచోట స్థలాన్ని ఇచ్చి రైతులకు మెరుగైన సౌకర్యాలు ఉండేవిధంగా ఈ మార్కెట్‌ను విస్తరిస్తామన్నారు.

## రైతును మోసంచేస్తే ఊరుకోం...

మార్కెట్లు కొనసాగుతున్నాయంటే అందుకు రైతులే ప్రధానమని మంత్రి నిరంజన్ రెడ్డి అన్నారు. కష్టపడి పండించి ఆ ఉత్పత్తులను మార్కెట్‌కు తీసుకువస్తే వారిని మోసం చేయడం అత్యంత దుర్మార్గమని, అలాంటి చర్యలను తీవ్ర పరిగణిస్తామని హెచ్చరించారు. రైతుల డిమాండ్ మేరకు బస్తా బరువు 80 కిలోలకు పెంచాలని అధికారులను ఆదేశించారు.



## పత్తి కొనుగోళ్లకు ఆటంకాలొద్దు

ఈ ఏడాది అంచనాకు మించి పత్తి ఉత్పత్తి అవుతున్నందున కొనుగోళ్ళను సవాల్‌గా స్వీకరించాల్సిన అవసరం ఉందని , ఆటంకాలు వద్దని వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కాటన్ మిల్లర్స్ అసోసియేషన్ తమ డిమాండ్లను ప్రభుత్వం ముందుపెట్టి రైతులకు ఇబ్బందులు కలిగించ వద్దని విజ్ఞప్తి చేశారు. బుధవారం జిన్నింగ్ మిల్లర్ల సంఘం నేతలతో సమావేశమై డిమాండ్ల పరిష్కారానికి హామీ ఇచ్చారు.

## తూకంలో మోసం చేస్తే లైసెన్స్ రద్దు

ఖరీఫ్ ఉత్పత్తుల కొను గోళ్ళపై ప్రభుత్వం పటిష్ఠమైన నిఘాను ఏర్పాటు చేసిందని మంత్రి నిరంజన్‌రెడ్డి తెలిపారు. తూకంలో మోసాలు జరిగినట్లు తెలిస్తే సంబంధిత వ్యవసాయ మార్కెట్ కమిటీ అధికారులతో పాటు వ్యాపారుల లైసెన్స్‌లు కూడా రద్దు చేస్తామని హెచ్చరించారు.

# బాధితులకు భరోసా అవశ్యం

**• నిస్సహాయులకు సహాయం అందించడాన్ని సులభతరం చేయాలి**

**• దక్షిణాసియా హక్కుల డాక్యుమెంటేషన్ సెంటర్ తీర్మానం**


**న్యూఢిల్లీ:** నేరాలకు గురైన బాధితులకు భరోసా కల్పించడం అత్యావశ్యమని దక్షిణాసియా మానవ హక్కుల డాక్యుమెంటేషన్ సెంటర్ (ఎస్ఏహెచ్ఆర్‌డీసీ) తాజా అధ్యయనంలో సూచించింది. భారతదేశంలో బాధితుల మానసిక ప్రభావాలపై ఈ సంస్థ అధ్యయనం చేసింది. బాధితులకు సహాయాన్ని సులభతరం చేయడానికి, పరిహారం అందించడానికి, అధికారిక భరోసా ఇవ్వడానికి అవసరమైన చర్యలను తప్పనిసరిగా అమలు చేయాలని ఎస్ఏహెచ్ఆర్‌డీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రవి నాయర్ చెప్పారు. బాధితులకు ఉపశమనం కలిగించేందుకు మెరుగైన పద్ధతులను అభివృద్ధి చేయాలని పిలుపునిచ్చారు. హర్యానాలోని సోనిపట్‌లోని జిందాల్ గ్లోబల్ విశ్వవిద్యా లయంలో జరిగిన బాధితుల సహాయంపై 8 వ అంతర్జాతీయ సదస్సులో నాయర్ మాట్లాడారు. బాధితులకు సహాయం అందించే విధానంలో అనేక సమస్యలపై రెండు రోజుల సమావేశం విస్తృతంగా చర్చించింది: బాధితుల హక్కులు, క్రిమినల్ జస్టిస్ సిస్టమ్, కుటుంబంలో హింస, సెక్స్, లైంగికత, ఎన్జీఓల పాత్ర, మహిళలు- పిల్లలపై హింస, మీడియా - సైబర్ బాధితులు, మానవ వలసదారుల అక్రమ రవాణా బాధితులు వంటి అంశాలపై లోతుగా చర్చించారు. బాధితుల సహాయంపై సంయుక్త వర్క్‌షాప్‌లు నిర్వహిం చాలని, ఇందులో క్రిమినల్ జస్టిస్ సిస్టమ్‌కు సంబంధించి ఇతర ప్రతినిధులతో విద్యార్థులు సంప్రదింపులు ఉండాలని సూచించారు. బాధితుల సహాయంపై చర్చించి ఒక తీర్మానాన్ని రూపొందించడమే వర్క్‌షాప్ ప్రధాన ఉద్దేశమని చెప్పారు. ప్రముఖ ప్రవర్తనా శాస్త్రవేత్తలు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న 'విక్టిమాలజీ అండ్ సైకలాజికల్ స్టడీస్' పండితులు బాధితుల సహాయంపై నలభై పత్రాలను సమర్పించారు. ఈ సమావేశంలో వివిధ దేశాలకు చెందిన వేర్వేరు వర్సిటీల నుంచి 100 మందికి పైగా ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఈఎస్ఐ స్కాంలో కొత్త కోణం

**• దేవికారాణి డొల్ల కంపెనీల్లో ఏసీబీ సోదాలు**

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** తెలంగాణలో సంచలనం సృష్టించిన ఈఎస్ఐ స్కాంలో ఏసీబీ దూకుడు కొనసాగుతూనే ఉంది. ఈ క్రమంలో మరో కొత్త కోణం వెలుగుచూసింది. ఈఎస్ఐ డైరెక్టర్ దేవికారాణి డొల్ల కంపెనీలు బయటపడుతున్నాయి. రమాదేవి పేరిట సాయి శ్రీనివాస్ డిస్ట్రిబ్యూషన్ అనే డొల్ల కంపెనీని ఏసీబీ అధికారులు గుర్తించారు. ఇందుకు సంబంధించి కుత్బుల్లాపూర్‌లో ఏసీబీ సోదాలు నిర్వహిస్తోంది. తొలుత దేవికారాణితో పాటు మరో ఆరుగురిని ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. ఇప్పటివరకు ఈ కేసులో అరెస్టయిన వారి సంఖ్య 16కు చేరింది. తొలుత ఈ స్కాంలో రూ.300 కోట్ల మేర అక్రమాలు జరిగి వుండొచ్చని భావించిన ఏసీబీ అధికారులు అక్రమాల విలువ రూ.700 కోట్ల పైమాటేనని చెబుతున్నట్లు సమాచారం. ఈఎస్ఐ డైరెక్టర్ దేవికారాణి వెన్నంటి ప్రోత్సహించిన పెద్దలెవరు? అన్నదానిపైనా ఏసీబీ అధికారులు దృష్టి పెట్టారు. ఓ ఐఏఎస్ పాత్రతో పాటు కొందరు పెద్దలు ఈ స్కాం వెనుక ఉన్నారన్న వార్తలు వినిపిస్తున్నాయి.

# నిర్మాత బండ్ల గణేష్ అరెస్ట్



**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** నిర్మాత పొట్లూరి వరప్రసాద్ (పీవీపీ) ఫిర్యాదుతో బండ్ల గణేష్‌ను బుధవారం జూబ్లీ హిల్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. టెంపర్ సినిమా నిర్మాణం కోసం రూ.30 కోట్లు అప్పు తీసుకుని, రూ.7 కోట్లు చెల్లించకుండా బెదిరింపులకు పాల్పడుతున్నట్లు పీవీపీ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో బండ్లగణేష్‌పై వివిధ సెక్షన్ల కింద పోలీసులు కేసులు నమోదు చేశారు. కేసుకు సంబంధించి ప్రశ్నించిన అనంతరం బండ్ల గణేష్‌ను బంజారాహిల్స్ పీఎస్‌కు తరలించారు. బంజారా హిల్స్‌లోనూ నమోదైన కేసులో బండ్ల గణేష్‌ను పోలీసులు ప్రశ్నిస్తున్నారు. ఇదిలా ఉండగా కడప జిల్లాకు చెందిన మహేశ్ అనే వ్యక్తి తన వద్ద నుంచి రూ.13 కోట్లు తీసుకున్నట్లు ఫిర్యాదు చేశాడు. ఈ కేసుకు సంబంధించి గురువారం ఉదయం కడప కోర్టులో బండ్లగణేష్‌ను పోలీసులు హాజరపర్చనున్నారు.

## నుమాయుష్‌లో అగ్ని ప్రమాదాల నివారణకు ప్రణాళికను సమర్పించండి




**హైదరాబాద్,ఆంధ్రప్రభ:** హైదరాబాద్‌లో జనవరి, 2020లో నిర్వహించే నుమాయుష్ (ఎగ్జిబిషన్) లో ఎలాంటి అగ్నిప్రమాదాలు చోటుచేసుకోకుండా తీసుకోబోయే ముందస్తు జాగ్రత్తలేమిటో వివరిస్తూ కార్యాచరణ ప్రణాళికను ప్రమాణపత్రం రూపంలో సమర్పించాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌ను హైకోర్టు ఆదేశించింది. గత సంవత్సరం నుమాయిష్‌లో సంభవించిన అగ్ని ప్రమాదాన్ని దృష్టిలో ఉంచుకొని వచ్చే ఏడాది ఎలాంటి అగ్నిప్రమాదాలు జరగకుండా చూసేం దుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హైకోర్టు స్పష్టం చేసింది. దాదాపు 26 నుంచి 36 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న నుమాయుష్ మైదానంలో ఒకవేళ అగ్నిప్రమాదం జరిగితే మంటలను ఆర్పివేసేందుకు అక్కడికి అగ్నిమాపక వాహనాలు చేరుకునేందుకు దారులను వివరించాలి., ,అలాగే తొక్కిసలాట చోటుచేసుకుంటే సందర్శకులు లోపలికి, బయటికి వెళ్లే మార్గాలను వివరించాలని హైకోర్టు పేర్కొంది. తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, జస్టిస్ ఎ.అభిషేక్ రెడ్డితో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ నవంబర్ 13కి వాయిదా వేసింది.

# 'ఏజీహెచ్' ఇక లేనట్టే..!

**• జమ్మూ కాశ్మీర్ డీజీపీ దిల్‌బాగ్ సింగ్**

**శ్రీనగర్ :** అవంతిపొరాలో భారత బలగాల చేతిలో అన్సర్ ఘజ్వతుల్ హింద్ (ఏజీహెచ్) అనే ఉగ్రవాద సంస్థ నాయకుడు అబ్దుల్ హమీద్ లెల్హారీలో హతమయ్యాడు. దీనిపై జమ్మూ కాశ్మీర్ డీజీపీ దిల్‌బాగ్ సింగ్ బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించి కీలక విషయాలు వెల్లడించారు. ఏజీహెచ్ అనే ఉగ్రవాద సంస్థ కాశ్మీర్‌లో తుడిచిపెట్టుకు పోయిందని అన్నారు. అబ్దుల్ హమీద్‌తో పాటు మరో ఇద్దరు ఉగ్రవాదులు భద్రతా దళాలు జరిపిన ఎన్‌కౌంటర్‌లో చనిపోయారని తెలిపారు. ఇక భవిష్యత్తులో ఏజీహెచ్ మళ్లీ కనిపించదన్నారు. గతంలో జకీర్ మూసా కూడా ఎన్‌కౌం టర్‌లో చనిపోయాడని, లెల్హారీ నేతృత్వం వహిస్తున్న ఏజీహెచ్ కు అల్‌ఖైదాతో సంబంధాలు ఉన్నాయని తెలిపారు. మంగళవారం చనిపోయిన ముగ్గురు ఉగ్రవాదులు జేషే మహ్మద్‌తో కలిసి పని చేస్తున్నట్లు నిర్ధారణకొచ్చామన్నారు. 2016 నుంచి జరిగిన పలు ఉగ్రవాద దాడుల్లో లెల్హారీ హస్తం ఉందని తెలిపారు. గతంలో ఉగ్రవాది జకీర్ మూసాను మట్టుబెట్టిన తరువాత ఈ ఏజీహెచ్‌కు హమీద్ నాయకత్వం వహిస్తున్నట్టు చెప్పారు. జమ్మూ కాశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370 రద్దు తరువాత చాలా మంది స్థానికులు ఉగ్రవాదంలోకి చేరుతారని భావించారని, కానీ అలా ఏమీ జరగలేదని స్పష్టం చేశారు. రద్దు కంటే ముందు పరిస్థితులు ఇప్పుడు లేవని, ఉగ్రవాద సంస్థల్లో యువత చేరికలు తగ్గిపోయాయని, స్థానిక యువత తమకు సహకరిస్తే ఉగ్రవాద నిర్మూలన మరింత వేగంగా జరుగుతుందని డీజీపీ దిల్‌బాగ్ సింగ్ అభిప్రాయపడ్డారు.

# బీసీ బడ్జెట్ రూ.10వేల కోట్లకు పెంచాలి



**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** రాష్ట్రంలో బీసీల జనాభా 54 శాతానికిపైగా ఉన్నారని వారి సంక్షేమం కోసం బడ్జెట్‌ను రూ. 10వేల కోట్లకు పెంచాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. అలాగే బీసీ కార్పొరేషన్ నుంచి ప్రతి ఏడాది రుణాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్‌కు జాతీయ బీసీ సంక్షేమ సంఘం నేతలు విజ్ఞప్తి చేశారు. సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య నేతృత్వంలో గుజ్జ కృష్ణ, నీల వెంకటేష్, పి సతీష్, కె జగన్, ఫణికాంత్, నవీన్ తదితరులు బుధవారం మంత్రిని కలిసి బీసీలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. బీసీలకు రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.2920 కోట్లు కేటాయించిందని కానీ బీసీల సంక్షేమానికి ఈ నిధులు సరిపోవని కనీసం రూ. 10వేల కోట్లకు బీసీ బడ్జెట్‌ను పెంచాలని కోరారు. 2017 డిసెంబర్‌లో బీసీ ప్రజాప్రతినిధుల ఏర్పాటు చేసిన సమావేశం చేసిన బీసీ డిక్లరేషన్‌ను అమలు చేసేలా చూడాలన్నారు.

# బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్ విలీనం




● ప్రైవేటైజేషన్ ఊహాగానాలకు తెర ● బాండ్ల ద్వారా రూ.15 వేల కోట్ల సేకరణకు అనుమతి ● ఉద్యోగులకు వీఆర్ఎస్ ● 4జీ స్పెక్ట్రమ్ కేటాయింపు

**న్యూఢిల్లీ :** ప్రభుత్వరంగానికి చెందిన టెలికం కంపెనీలు బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్‌ను విలీనం చేస్తూ బుధవారం నాడు కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకుంది. పీకల్లోతు నష్టాల్లో కూరుకుపోయిన బీఎస్ఎన్ఎల్‌ను ప్రైవేట్‌పరం చేస్తారన్న ఊహాగానాలకు నేటితో తెరపడింది. నష్టాల్లో ఉన్న పీఎస్‌యు బ్యాంకులను బలమైన బ్యాంకుతో విలీనం చేస్తున్న దిశగానే.. తాజాగా టెలికం కంపెనీల్లో కూడా విలీనాలకు ప్రభుత్వం తెరతీసింది. ప్రభుత్వం పెద్దమొత్తంలో ప్యాకేజీ ప్రకటించడంతోబీఎస్ఎన్ఎల్.. ఎంటీఎన్ఎల్‌కు ఆక్సిజన్ అందించినట్లయింది. రెండు కంపెనీలను విలీనం చేయడంతో పాటు సంస్థను తిరిగి తమ కాళ్లపై నిలబడేందుకు రూ.68,751 కోట్ల ప్యాకేజీకి అనుమతించింది. దీంతో పాటు 4జీ స్పెక్ట్రమ్ కేటాయింపు, స్వచ్ఛంద పదవి విరమణకు అనుమతులు మంజూరు చేసింది. కేంద్ర కేబినెట్ రెండు టెలికం కంపెనీల విలీనానికి ఆమోదం తెలపడంతో ఈ ప్రక్రియ పూర్తయ్యే వరకు ఎంటిఎన్ఎల్ బీఎస్ఎన్ఎల్‌కు అనుబంధ సంస్థగా పనిచేస్తుందని టెలికం మంత్రి రవిశంకర్ ప్రసాద్ ప్యాకేజీ వివరాలు అందిస్తూ ఈ విషయం చెప్పారు.

### ప్యాకేజీ వివరాలు

ఈ రెండు కంపెనీలకు తక్షణమే మూలధనం అవసరాల కోసం సావరిన్ బాండ్లను విడుదల చేసి రూ.15,000 కోట్లు నిధులు సేకరించడానికి అనుమతించింది. రూ.20,140 కోట్ల విలువ చేసే 4జీ స్పెక్ట్రమ్ కేటాయించింది. కంపెనీ ఉద్యోగుల్లో 50 శాతం మంది స్వచ్ఛంద విరమణకు సుమారు రూ.29,937 కోట్లు సమకూరుస్తుంది. 4జీ స్పెక్ట్రమ్ రేడియా తరంగాలు కేటాయించినందుకు సుమారు రూ.3,674 కోట్ల జీఎస్టి కూడా ప్రభుత్వమే భరిస్తుంది.

### ప్రభుత్వ వైఖరి స్పష్టం

బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్‌పై ప్రభుత్వం వైఖరి స్పష్టమని, ఈ రెండు కంపెనీలు భారత్ ఆస్తులన్నారు. ప్రస్తుతం నెట్‌వర్కును మొత్తం బీఎస్ఎన్ఎల్ నిర్వహిస్తుందని ప్రసాద్ వివరించారు. బీఎస్ ఎన్ఎల్‌లో సుమారు 1.68 లక్షల మంది.. ఎంటిఎన్ఎల్‌లో 22,000 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారన్నారు. స్వచ్ఛంద విరమణ లేదా వీఆర్ ఎస్ ప్యాకేజీని కూడా కేంద్ర కేబినెట్ ఆమోదించింది. అర్హులైన ఉద్యోగులకు కంపెనీలో 60 ఏళ్ల వరకు పనిచేస్తే వచ్చే ఆదాయంకంటే 125 శాతం ఇస్తున్నామన్నారు. ఈ నిర్ణయంతో ప్రభుత్వం పీఎస్‌యు కంపెనీల్లో పనిచేసే లక్షలాది మంది ఉద్యోగుల ప్రయోజనాలను కాపాడుతున్నట్లు తెలుస్తోందన్నారు. వీఆర్ఎస్ అనేది స్వచ్ఛందం ఉద్యోగి ఉద్యోగం నుంచి రాజీ నామా చేయడమని.. ఎవరూ బలవంతంగా వీఆర్ఎస్ తీసుకోమని ఒత్తిడిచేయరని ప్రసాద్ స్పష్టం చేశారు.

### కంపెనీల మొత్తం అప్పులు రూ.40వేల కోట్లు



కాగా రెండు కంపెనీల మొత్తం అప్పులు రూ.40వేలకోట్లుగా తేలాయి. వాటిలో సగం అప్పులు ఎంటిఎన్ఎల్‌కు చెందినవి. ఎంటిఎన్ఎల్ ఢిల్లీ, ముంబైలలో టెలికం సేవలందిస్తోంది. ఈ రెండు కంపెనీలు మార్కెట్లో పోటీ పడాలంటే తమకు 4జీ స్పెక్ట్రమ్ కేటాయించాలని డిమాండ్ చేస్తున్నాయని ప్రసాద్ వివరించారు. టెలికం కార్యదర్శి అన్షు ప్రకాశ్ మాట్లాడుతూ.. 2 కంపెనీలకు అధికారికంగా ఒక నెలలోపు స్పెక్ట్రమ్ కేటా యిస్తామని తెలిపారు. బీఎస్ఎన్ఎల్‌కు కేటాయించే స్పెక్ట్రమ్ విలువ రూ.14,115 కోట్లు ఉంటుంది. నగదు బదులుగా బీఎస్ ఎన్ఎల్‌కు ఈక్విటి షేర్లు కేటాయిస్తారు. అదే ఎంటిఎన్ఎల్ విషయానికి వస్తే రూ.6,295 కోట్ల ప్రిపరెన్షియల్ షేర్లు కేటాయిస్తారని టెలికం మంత్రి వివరించారు. వచ్చే మూడు నుంచి నాలుగు సంవత్సరాల కాలంలో ప్రభుత్వం ఎంటీఎన్ఎల్, బీఎస్ఎన్ఎల్ ఆస్తులు రూ.37,500 కోట్లు విక్రయించి సొమ్ము చేసుకుంటుంది. బీఎస్ఎన్ఎల్ ఆస్తుల విషయానికి వస్తే ముఖ్యంగా భూములు, కొన్ని భవనాలను లీజుకు, లేదా అద్దెలకు ఇచ్చాయి. ఢిల్లీలో ఎంటి ఎన్ఎల్‌కు సుమారు 29 రిటైల్ ఔట్‌లెట్లున్నాయని ప్రకాశ్ అన్నారు.

4జీ సేవలను అందివ్వాలంటే బీఎస్ఎన్ఎల్‌కు సుమారు రూ.10వేల కోట్లు, ఎంటిఎన్ఎల్‌కు రూ.1,100 కోట్లు అవసరమవుతాయి, బీఎస్ఎన్ఎల్ అప్పులు చాలా తక్కువగా ఉన్నాయి కాబట్టి మూలధనం సేకరించుకోడానికి అనుమతిస్తామని.. దీని ద్వారా తమ నెట్‌వర్కును మరింత మెరుగు పర్చుకొని మార్కెట్లో ఇతర పోటీ కంపెనీలకు గట్టి పోటీ ఇవ్వవచ్చునని ప్రకాశ్ వివరించారు. వీఆర్ఎస్ ప్యాకేజీ గురించి వివరిస్తూ.. రూ.17,169 కోట్లు ఎక్స్‌గ్రేషియా కింద రూ.12,768 కోట్లు ప్రీపోన్‌మెంట్ పెన్షనరీ బెనిఫిట్ కింద కేటాయించినట్లు తెలిపారు. ఉద్యోగుల వయసు 50 నుంచి 53.5 ఏళ్లు దాటితే వారు స్వచ్ఛంద పదవి విరమణకు దరఖాస్తు చేసుకోవచ్చు. వారికి 80 నుంచి 100 శాతం రెమ్యూనరేషన్ (వేతనం)చెల్లిస్తామని వారి సర్వీసును బట్టి మిగిలిన మొత్తం చెల్లిస్తామని వివరించారు.



## ఇక ప్రైవేట్ పెట్రోల్ బంక్‌లు

పెట్రోలియం మార్కెట్‌ల్లోకి కొత్త వారికి అవకాశం కల్పిస్తూ కేంద్ర కేబినెట్ బుధ వారం నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఉన్న విధానాలను మార్చింది. ఈ రంగంలో లైసెన్సు కావాలంటే పెట్టుబడులు కింద రూ.2,000 కోట్లు సమకూర్చుకోవాలి లేదా బ్యాంకు గ్యారంటీ అయినా ఇవ్వాల్సి ఉంటుంది. పెద్ద కంపెనీలు ఉదాహరణకు టోటల్, అదానీ, సౌదీ అర్మాకో లేదా సూపర్ మార్కెట్లు కూడా ఔట్‌లెట్‌లు ప్రారంభించి ఆటోమొబైల్‌లకు వినియోగించే ఇంధనం విక్రయించుకోవచ్చు. పెట్రోల్ బంకులు ప్రారంభించేందుకు కొన్ని కనీస నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. వాటిలో ప్రధానంగా మొత్తం రిటైల్ ఔట్‌లెట్లలో 5 శాతం ఔట్‌లెట్లు మారుమూల ప్రాంతాల్లో ప్రారంభించాల్సి ఉంటుంది. అధికారికంగా అనుమతులు లభించిన తర్వాత ఐదేళ్లలోగా ఈ బంకులను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. కనీస నికర విలువ రూ.250 కోట్లు ఉండాలనే షరతును విధించింది. పెట్రోల్‌తో పాటు ప్రత్యామ్నాయం ఇంధన ఉదాహరణకు సీఎన్‌జీ, ఎల్ఎన్‌జీ, బయోఫ్యూయల్స్, ఎలక్ట్రిక్ చార్జింగ్ స్టేషన్ ఏదో ఒకటి ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అనుమతి లభించిన తర్వాత మూడేళ్లలోగా రిటైల్ ఔట్‌లెట్ ప్రారంభించినప్పుడు అదనంగా సంప్రదాయ ఇంధనం విక్రయించాల్సి ఉంటుంది.

### అదానీతో టోటల్ భాగస్వామ్యం

ఇదిలా ఉండగా ఇంధన మార్కెటింగ్‌లో టోటల్ అదానీతో భాగస్వామ్యం చేపట్టగా, బీపీ రిలయన్స్ ఇండస్ట్రీస్‌తో భాగస్వామ్యం చేపట్టింది. ఇవి కొత్తగా ఆటోమొబైల్ ఇంధనంతో పాటు ఎలక్ట్రిక్ చార్జింగ్ స్టేషన్లు ప్రారంభిస్తాయి. వ్యక్తిగతంగా డీలర్‌షిప్ కావాలనుకొంటే పీఎస్‌యు, లేదా ఓఎంసీ డీలర్‌షిప్‌లను కూడా ఇస్తారు. ఒకే చోట కాకుండా వేర్వేరు ప్రాంతాల్లో ఇస్తారు.ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటి (సీసీఈఏ) రవాణా ఇంధనాల గైడ్‌లైన్స్ సమీక్షా సమావేశంలో ఈ నిర్ణయం తీసుకుంది. గత 17 ఏళ్ల నుంచి ఈ నిబంధనలు కొనసాగుతున్నాయి. 2002 నుంచి పాత నిబంధనలే కొనసాగుతున్నాయి.

### ప్రైవేట్, విదేశీ పెట్టుబడులు ప్రోత్సహించడానికి..

మారుతున్న మార్కెట్ పరిస్థితులను బట్టి ఈ రంగంలో ప్రైవేట్ పెట్టుబడులను ప్రోత్సహించడానికి, విదేశీ ఇన్వెస్టర్లను ఆకర్షించడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం ఒక ప్రకటనలో వెల్లడించింది. ప్రైవేట్ కంపెనీలు, విదేశీ కంపెనీలు రిటైల్ మార్కెటింగ్‌లోకి ప్రవేశించి కస్టమర్లకు మెరుగైన సేవలందించాలనేది ప్రభుత్వం లక్ష్యమని ప్రకటనలో వివరించింది.కొత్తగా ఈ రంగంలోకి వచ్చే కంపెనీలు కొత్త టెక్నాలజీని వినియోగించుకోవడంతో పాటు రిటైల్ ఔట్‌లెట్లలో డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించడానికి అవకాశం ఉంటుందని తెలిపింది.

### 64,703 రిటైల్ ఔట్‌లెట్లు

ఈ ఏడాది మే నాటికి దేశవ్యాప్తంగా మొత్తం 64,703 రిటైల్ ఔట్‌లెట్లు కొనసాగుతున్నాయి. వాటిలో ప్రభుత్వరంగానికి చెందిన చమురు మార్కెటింగ్ కంపెనీలు, ప్రైవేట్ కంపెనీలు కూడా కలిపి ఉన్నాయి. ఈ ఏడాది మార్చిలో ప్రభుత్వం ఒక కమిటిని ఏర్పాటు చేసి 2022 నాటి రవాణా ఇంధన మార్కెటింగ్ లైసెన్స్‌పై సమీక్ష జరపాలని నిర్ణయించింది. ఈ ప్యానెల్ పూర్తి స్థాయిలో అధ్యయనం చేసి మే నెలలో నివేదికను అందించింది. చమురేతర కంపెనీలకు కూడా పెట్రోల్ బంక్‌లు ఏర్పాటు చేసుకోవడానికి అనుమతించాలని ప్యానెల్ సూచించింది. ప్రభుత్వం నిర్దేశించిన సమయంలోగా పెట్రోల్‌బంక్ ఏర్పాటు చేయాలని ఒకవేళ అనుకున్న లక్ష్యాలను చేరుకోలేకపోతే జరిమానాలను విధించాలని సిఫారసు చేసింది. అలాగే కనీస పెట్టుబడుల అనే నిబంధనను ఎత్తివేసి లైసెన్స్ కావాలనే సంస్థ వద్ద కనీసం ఆస్తి విలువ ఉండేలా నిబంధనలు తీసుకురావాలని సిఫారసు చేసింది. గత ఆర్థిక సంవత్సరం పెట్రోల్, డిజెల్, విమానాలకు వినియోగించే ఇంధనాల డిమాండ్ వరుసగా 8 శాతం, 3 శాతం 9 శాతం వరకు పెరిగాయి.



## సంస్కరణలతోనే పేదరికానికి చెక్

● లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** మహేశ్ కో ఆపరేటివ్ బ్యాంక్ నూతన కార్పొరేట్ కార్యాలయాన్ని ప్రారంభించిన లోకసభ స్పీకర్ ఓం బిర్లా మాట్లాడుతూ..స్వాతంత్రానికి పూర్వం జమీందార్లు, వడ్డీ వ్యాపారులు ప్రజలను, రైతులను పీడించుకుని దోపిడీకి పాల్పడ్డారు. దేశంలో బ్యాంకుల రాకతో అన్ని వర్గాలకు మంచి రోజులొచ్చాయి. ప్రపంచంలోనే వేగంగా ఆర్థిక సంస్కరణలతో దూసుకుపోతున్న భారత్ ఇప్పుడు రైతులు, మహిళలకు వడ్డీలేని రుణాలనిచ్చి ఆర్థిక ప్రగతికి దోహదపడుతోంది అని లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా పేర్కొన్నారు. బుధవారం హైదరాబాద్‌లో మహేష్ బ్యాంక్ నూతనంగా నిర్మించుకున్న కార్పొరేట్ కార్యాలయాన్ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. 76 ఏళ్లయినా దేశమంతటా బ్యాంకులు విస్తరణకు నోచుకోలేకపోయాయని, దేశ ప్రజల ఆర్థిక ప్రగతి బ్యాంకులతోనే ముడిపడి ఉందన్నారు. రుణాలు సకాలంలో చెల్లించి ప్రజలు, రుణగ్రహీతలు బ్యాంకర్లకు సహకరించినప్పుడే బ్యాంకుల అభివృద్ధి నిరాటంకంగా ముందుకు సాగుతుందన్నారు. అమెరికా-చైనాల మధ్య వాణిజ్య యుద్ధంతో ప్రపంచమంతా ఇబ్బందులకు గురవుతున్న తరుణంలో ప్రధాని మోడీ దేశంలో ఆర్థిక రంగ పునరుత్తేజానికి కీలక చర్యలు తీసుకున్నారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. బంగారు తెలంగాణ సాధన దిశగా తెలంగాణ సీఎం కేసీఆర్ అనేక సంస్కరణలు తీసుకొచ్చారని, అందుకే దేశంలోనే గొప్ప రాష్ట్రంగా తెలంగాణ వెలుగొందుతోందని హోంశాఖ మంత్రి మహమూద్ అలీ అన్నారు. హిమాచల్ గవర్నర్ దత్తాత్రేయ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## వచ్చే ఏడాది జీడీపీ 7%

● అంతర్జాతీయ ద్రవ్యనిధి అంచనా

**సింగపూర్ :** వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి భారత్ జీడీపీ వృద్ధిరేటు తిరిగి ఊపందుకొని 7 శాతానికి చేరుతుందని అంతర్జాతీయ ద్రవ్యనిధి అంచనా వేసింది. ప్రభుత్వం వృద్ధిరేటు పెంచుకోవడానికి ద్రవ్యపరపతి విధానాల్లో వడ్డీరేట్లు తగ్గించడంతో పాటు కార్పొరేట్ పన్నుల్లో కోత విధించడం తదితర కారణాల వల్ల జీడీపీ వృద్ధిరేటు పుంజుకోవడానికి అవకాశం ఉంటుందని పేర్కొంది. ఈ ఆర్థిక సంవత్సరం తమ అంచనా ప్రకారం వృద్ధిరేటు 6.1 శాతంగా నమోదైతే.. వచ్చే ఆర్థికసంవత్సరం 7 శాతానికి చేరుతుందని, ఐఎంఎఫ్ డిప్యూటీ డైరెక్టర్ ఆసియా, పసిఫిక్ డిపార్టుమెంట్ జోనాథన్ ఒస్ట్రే చెప్పారు. ఆర్థిక వ్యవస్థ మందగించడంతో ప్రభుత్వం పన్నురేట్లలో కోత విధించింది. దీంతో మధ్య కాలికానికి వృద్ధిరేటు ఊపందుకుంటుందని ఒస్ట్రే అభిప్రాయపడ్డారు. భారత ఆర్థిక వ్యవస్థ మందగించడం చాలా మందిని ఆశ్చర్యానికి గురి చేసింది. తాము కూడా ఆశ్చర్యానికి గురి అయ్యామని ఆయన తెలిపారు.




దక్షిణాసియా వృద్ధికి కేవలం వస్తువు లేదా సరకు వాణిజ్యం కాకుండా సేవల వాణిజ్యంపై ఫోకస్ పెట్టాలని సూచించారు. దీంతో భారత్‌తో పాటు దక్షిణాసియా దేశాలు కూడా వృద్ధి చెందుతాయని ఒస్ట్రే అన్నారు. భౌగోళికంగా భారత్ చాలా పెద్ద దేశం కాబట్టి నిర్మాణాత్మకమైన సంస్కరణల ద్వారానే వృద్ధిరేటు పెంచుకో వచ్చునని, వచ్చే రెండు దశాబ్దాల కాలంలో 150 మిలియన్ ప్రజలు కొత్తగా ఉద్యోగాల్లో చేరుతారు కాబట్టి భారత్ వృద్ధిరేటు పెంచుకోవడానికి అవకాశాలు మెండుగా ఉన్నాయని ఆయన వివరించారు. రాబోయే రోజుల్లో వృద్ధిరేటుకు సేవల రంగం కీలకమవుతుందని, పెట్టుబడులు పెంచుకోవడంతో ఉత్పత్తి కూడా పెంచుకోవచ్చునని ఆయన తెలిపారు. భారత్ వృద్ధిరేటులో సేవల రంగం అత్యంత కీలకమని ముఖ్యంగా ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ సర్వీసెస్ భాగంలో గ్లోబల్ మార్కెట్లో అతి పెద్ద వాటాను దక్కించుకుందన్నారు. దశాబ్దకాలంలో సేవల రంగంలో ఎగుమతులు మూడు రెట్లు పెంచుకుందన్నారు. 2000 సంవత్సరంలో 6.3 శాతం నుంచి 2010 నాటికి 17.8 శాతానికి సేవల రంగంలో ఎగుమతులు పెంచుకుందని ఐఎంఎఫ్ నివేదికలో వివరించింది.

## రూ.1.54 లక్షల కోట్ల గృహాల అమ్మకాలు

● స్థిరాస్తి కన్సల్టెంట్ అనెరాక్ నివేదిక

**బెంగళూరు :** దేశంలో వినియోగ సెంటిమెంట్ బలహీనంగా ఉన్నా ప్రధానమైన ఏడు నగరాల్లో స్థిరాస్తుల అమ్మకాలు జోరందుకున్నాయి. ఈ ఏడాది మొదటి మూడు త్రైమాసికాల్లో మొత్తం రూ.1.54 లక్షల కోట్ల అమ్మకాలు జరిగాయి. ఏడాది క్రితంతో పోల్చితే 16 శాతం అమ్మకాలు పెరిగాయని స్థిరాస్థి కన్సల్టెంట్ అనెరాక్ తాజా నివేదికలో వెల్లడించింది. క్రితం ఏడాది ఇదే మూడు త్రైమాసికాల్లో సుమారు రూ.1.33 లక్షల కోట్ల అమ్మకాలు జరిగాయని అనెరాక్ చైర్మన్ అనుజుపూరి చెప్పారు.

దేశంలోని ప్రధానమైన ఏడు నగరాల్లో ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబర్ వరకు సుమారు 2.02 లక్షల యూనిట్లు విక్రయాలు జరగగా... క్రితం ఏడాది ఇదే కాలంలో 1.78 లక్షల యూనిట్ల అమ్మకాలు జరిగాయి. అమ్మకాల వివరాలు ఇలా ఉన్నాయి. ఎంఎంఆర్ (ముంబై మెట్రోపాలిటన్ రీజియన్)లో అత్యధికంగా రూ.62,970 కోట్లు, బెంగళూరులో రూ.28,160 కోట్లు, పూనేలో రూ.13,275 కోట్లు, ఎన్‌సీఆర్‌లో రూ.24,860 కోట్లు, హైదరాబాద్, చెన్నైలలో వరుసగా రూ.9,400 కోట్లు, రూ.5,580 కోట్ల అమ్మకాలు జరిగాయి. హైదరాబాద్‌లో గత ఏడాదితో పోల్చితే అమ్మకాలు రెండు శాతం తగ్గితే..చెన్నైలో మాత్రం 13 శాతం పెరిగాయని పూరి తెలిపారు.




## బిజినెస్

Andhraprabha business 2019

### క్యూ2 ఫలితాలు

### హెచ్‌సీఎల్ టెక్ లాభం రూ.2,711 కోట్లు

● బోనస్ షేర్ల ప్రకటన



**న్యూఢిల్లీ :** ఐటి దిగ్గజం హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో నికరలాభంలో 6.9 శాతం వృద్ధితో రూ.2,711 కోట్లు ఆర్జించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నికరలాభం రూ.2,534 కోట్లు నమోదు చేసింది. దీంతో పాటు బోనస్ షేర్ల ఆఫర్‌ను కూడా ప్రకటించింది. వచ్చే ఆర్థిక సంవత్సరం 2019-20 నాటికి రెవెన్యూ 17 శాతం వరకు పెరుగుతుందని అంచనా వేసింది. క్యూ2లో రెవెన్యూ 18 శాతం వృద్ధితో రూ.17,527 కోట్లకు చేరగా.. ఏడాది క్రితం రూ.14,860 కోట్లని తెలిపింది. వచ్చే ఆర్థిక సంవత్సరానికి రెవెన్యూ 15-17 శాతం వృద్ధి చెందుతుందని అంచనా వేయగా.. ఇంతకు ముందు 14-16 శాతంగా ఉండవచ్చునని ప్రకటించింది. అది కూడా కరెన్సీ నిలకడగా ఉంటేనే అని తెలిపింది. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ బోర్డు షేరుకు రూ.2 డివిడెండ్‌ను ప్రకటించింది. బోనస్‌షేరు విషయానికి వస్తే 1:1 షేరుగా ఆఫర్ చేస్తోంది. దీనికి నియంత్రణా సంస్థల అనుమతులు తప్పనిసరి. క్యూ 2లో మంచి ఫలితాలను సాధించామని కంపెనీ సీఈవోసీ విజయకుమార్ తెలిపారు. డాలర్ కరెన్సీ ప్రకారం చూస్తే నికరలాభం 5.5 శాతం వృద్ధితో 376.2 మిలియన్ డాలర్లు ఆర్జించగా.. రెవెన్యూ 18.4 శాతం వృద్ధితో 2.48 బిలియన్ డాలర్లు నమోదు చేసింది. సెప్టెంబర్ చివరి నాటికి కంపెనీలో ఉద్యోగుల సంఖ్య 1,47,123కు చేరింది. గత 12 నెలల నుంచి చూస్తే వలసలు 16.9 శాతంగా తేలాయి. క్యూ2 లో అదనంగా 3,223 మందిని ఉద్యోగంలోకి తీసుకుంది. బీఎస్ఈలో దీని షేరు 2.93 శాతం పెరిగి రూ.1095.65 వద్ద ముగిసింది.

### బజాజ్ ఆటో ప్రాఫిట్ రూ.1,523 కోట్లు

**న్యూఢిల్లీ:** ద్విచక్ర వాహన దిగ్గజం బజాజ్ ఆటో సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో ఏకీకృత నికరలాభంలో 21.23 శాతం వృద్ధితో రూ.1,523.32 కోట్లు ఆర్జించింది. ఏడాది క్రితం ఇదే త్రైమాసికంలో రూ.1,256.57 కోట్లు నమోదు చేసినట్లు బీఎస్ఈకి సమాచారం అందించింది. రెవెన్యూ మాత్రం 4.09 శాతం తగ్గి రూ.7,707. 02 కోట్లకు దిగివచ్చింది. ఏడాది క్రితం రూ.8,036.34 కోట్లని తెలిపింది. క్యూ2లో మొత్తం వాహనాలు 11,73,591 యూనిట్లు విక్రయిస్తే.. ఏడాది క్రితం 13,39,444 యూనిట్లు విక్రయించింది. అమ్మకాల్లో 12 శాతం తగ్గాయని పేర్కొంది.



### జేఎస్‌డబ్ల్యు స్టీల్ ప్రాఫిట్ రూ.2,536 కోట్లు

**న్యూఢిల్లీ :** జెఎస్‌డబ్ల్యు స్టీల్ క్యూ2 నికరలాభం 21.51 శాతం వృద్ధితో రూ.2,536 కోట్లు ఆర్జించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.2,087 కోట్లు నమోదు చేసినట్లు బీఎస్ఈకి సమాచారం అందించింది. మొత్తం ఆదాయం రూ.17,728కోట్లకు దిగిరాగా, ఏడాది క్రితం రూ.21,608 కోట్లని తెలిపింది.

### ముత్తూట్ క్యాపిటల్ లాభం రూ.14 కోట్లు

Muthoot Finance

**న్యూఢిల్లీ :** నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ ముత్తూట్ క్యాపిటల్ సర్వీసెస్ స్టాండ్ఎలోన్ ప్రాతిపదికన సెప్టెంబర్ త్రైమాసికంలోనికరలాభం34.6 శాతం క్షీణించి రూ.14.02 కోట్లకు దిగివచ్చింది. ఏడాది క్రితం ఇదే త్రైమాసికంలో రూ.21.42 కోట్లు ఆర్జించినట్లు ఒక ప్రకటనలో తెలిపింది. మొత్తం ఆదాయం రూ.145.02 కోట్లకు ఎగబాకగా... ఏడాది క్రితం రూ.132.14 కోట్లని తెలిపింది. కాగా ముత్తూట్ క్యాపిటల్ సర్వీసెస్ ద్విచక్ర వాహనాలకు రుణాలు ఇచ్చే వ్యాపారం చేస్తోంది.

### ఐసీఐసీఐ సెక్యూరిటీస్ లాభం రూ.135 కోట్లు

ICICI Securities

**న్యూఢిల్లీ :** ఐసీఐసీఐ సెక్యూరిటీస్ సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో పన్ను చెల్లించిన తర్వాత నికరలాభం రూ.135.12 కోట్లు ఆర్జించింది. గత ఎడాది త్రైమాసికంలో రూ.134.22 కోట్లు నమోదు చేసినట్లు బీఎస్ఈకి సమాచారం అందించింది. రెవెన్యూ రూ. 418.22 కోట్లు, ఏడాది క్రితం రూ.458.10 కోట్లని తెలిపింది. రెవెన్యూలో 9 శాతం క్షీణించింది.

### ఎల్అండ్‌టీ ఆర్డర్ పుస్తకం రూ.3 లక్షల కోట్లు

**న్యూఢిల్లీ :** ఇంజినీరింగ్ దిగ్గజం లార్సన్ అండ్ టర్బో ఏడాది ప్రాతిపదికన చూస్తే క్యూ 2లో నికరలాభంలో 6.83 శాతం వృద్ధితో రూ.2,770.43 కోట్లకు ఎగబాకింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.2593.41 కోట్లని ఒక ప్రకటనలో తెలిపింది. రెవెన్యూ 15.16 శాతం వృద్ధితో రూ.35,328.45 కోట్లకు చేరింది. ఎల్అండ్‌టి ఆర్డర్ పుస్తకం రూ.3.03 లక్షల కోట్లకు చేరింది. కొత్త కాంట్రాక్టులు రూ.48వేలకోట్లకు, గ్లోబల్ ఆర్డర్లు రూ.16,675 కోట్లుగా తేలాయి.

### ఇండియన్ బ్యాంకు నికరలాభం రూ.258 కోట్లు



**చెన్నై :** ప్రభుత్వరంగానికి చెందిన ఇండియన్ బ్యాంకు సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో నికరలాభం రూ.258.56 కోట్లు ఆర్జించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.154.14 కోట్లని బ్యాంకు సీఈవో పద్మజా చుందూర్ తెలిపారు. సెప్టెంబర్‌తో ముగిసిన ప్రథమార్థంలో నికరలాభం రూ.723.83 కోట్లకు ఎగబకాగా.. ఏడాది క్రితం రూ.354.95 కోట్లని తెలిపారు. క్యూ1లో మొత్తం ఆదాయం రూ.6,045.32కోట్లకు ఎగబకాగా, ఏడాది క్రితం రూ.5,129.16 కోట్లని తెలిపారు. ఈ ఆర్థికసంవత్సరం ప్రథమార్థంలో ఆదాయం రూ.11,877.44 కోట్లకు చేరగా, ఏడాది క్రితం రూ.10,261.13 కోట్లని తెలిపారు.

## మెకానిక్‌పైకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు




ఘటనకు కారణమైన బస్సు

కాలికి గాయంతో వసీం

**బోధన్ ప్రభన్యూస్:** బోధన్ ఆర్టీసీ డిపోలో దారుణం చోటు చేసుకుంది. బుధవారం ఓ బస్సు మరమ్మతులు రావడంతో డిపోలోని మెకానిక్ వసీం బస్సు రిపేరు చేసేందుకు జాకీ ఎక్కించాడు. అయితే బస్సులో ఉన్న తాత్కాలిక డ్రైవర్ లక్ష్మణ్ అదే సమయంలో బస్సును స్టార్ట్ చేశాడు. దీంతో బస్సు జాకీపైనుంచి దూసుకెళ్లి మెకానిక్ వసీంను ఢీకొంది. తీవ్రంగా గాయపడిన వసీంను స్థానిక ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో నిజామాబాద్ జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు.

## బండికాదు...మొండి ..సాయం పట్టండి

- కిలోమీటర్ మేర బస్సును తోసిన ప్రయాణికులు



**జగిత్యాల, ప్రభన్యూస్:** కార్మికుల సమ్మె కాదు కానీ, ప్రయాణికులకు చుక్కలు కనిపిస్తున్నాయి. మెకానిక్‌లు కూడా సమ్మెలో పాల్గొనడంతో బస్సుల నిర్వహణ సరిగ్గాలేక మొండికేస్తున్నాయి. ఎక్కడికక్కడ బస్సులు మొరాయిస్తున్నాయి. జగిత్యాలలో అలా ఓ బస్సు నడిదారిలో ఆగిపోతే దాదాపు కిలోమీటర్ దూరం వరకు ప్రయాణీకులే తోసుకుని వచ్చారు. ఆ తరువాత అది స్టార్ట్ అవడంతో కాస్త ఊపిరి పీల్చుకున్నారు. బుధవారం ఈ సంఘటన జరిగింది. బుధవారం నుండి బయలుదేరిన కరీంనగర్ వెళ్తున్న జగిత్యాల డిపోకు చెందిన బస్సు సాంకేతిక సమస్య తలెత్తడంతో రోడ్డుపై నిలిచిపోయింది. అదేదో సినిమాపాటలో అన్నట్లు... బండి కాదు... మొండి ఇది సాయపట్టండిరా అంటూ బస్సును నెట్టాల్సి వచ్చింది. ప్రయాణికులు చిరాకుపడ్డారు. ఒక గంటలోగా కరీంనగర్ చేరుకోవాల్సిన ప్రయాణికులు దాదాపు 2 గంటల తర్వాత కరీంనగరకు చేరుకున్నారు.

## మద్యం మత్తులో బస్సు నడిపిన తాత్కాలిక డ్రైవర్



**కొస్గి రూరల్, ప్రభ న్యూస్ :** మద్యం మత్తులో తాత్కాలికడ్రైవర్ ఆర్టీసీ బస్సును నడుపుతూ పోలీసులకు పట్టుబడిన సంఘటన కొస్గి మండలంలో చోటు చేసుకుంది. బుధవారం వికారాబాద్ జిల్లా తాండూర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు (ఏపీ 29 జెడ్ 1892) రాత్రి 7.30 లకు తాండూర్ నుండి మహబూబ్ నగర్‌కు బయలు దేరింది. సమ్మె కారణంగా నియమించిన తాత్కాలిక డ్రైవర్ రవీందర్ గౌడ్ మత్తుగా తాగి బస్సును వేగంగా నడపడంతో బస్సులోని ప్రయాణికులు ఆర్టీసీ కార్మికులకు, పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఆర్టీసీ కార్మికులు కొస్గి బస్ స్టాండ్‌లో బస్సును ఆపి డ్రైవర్‌ను కిందకు దింపారు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు రవీందర్ గౌడ్‌ను బ్రీత్ ఎనలైజర్‌తో చెక్ చేయగా తాగి బస్సు నడుపుతున్నట్లు రుజువు కావడంతో పోలీసులు డ్రైవర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా కొస్గి సిఐ ప్రవీణ్ కుమార్ డిపో మేనేజర్‌తో మాట్లాడి మరో డ్రైవర్ని కేటాయించి బస్సును మహబూబ్‌నగర్‌కు తరలించారు.

### గుండెపోటుతో
## ఇద్దరు కార్మికులు మృతి

- జహీరాబాద్‌లో మహిళా కండక్టర్ ఆత్మహత్యాయత్నం

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** సమ్మె పరిష్కారం కాకపోవడం, ఉద్యోగ భద్రతపై సందేహాలు ముసురుకున్న నేపథ్యంలో ఇద్దరు కార్మికులు గుండెపోటుతో మరణించారు. బుధవారం ఈ దుర్ఘటనలు చోటు చేసుకున్నాయి. ముషీరాబాద్ డిపోకు చెందిన రమేష్ గౌడ్, నిజామాబాద్ డిపోకు చెందిన డ్రైవర్‌గా పనిచేస్తున్న కామారెడ్డి జిల్లాకు చెందిన గఫూర్ అనే కార్మికుడు గుండెపోటుతో మరణించగా, ఉద్యోగాలపై ఆందోళనతోనే వారు కుంగుబాటుకు గురై మరణించారని మృతుల కుటుంబ సభ్యులు తెలిపారు. మరోవైపు జహీరాబాద్ బస్‌డిపోకు చెందిన మహిళా కండక్టర్ సూఫియాబేగం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. సెప్టెంబరు నెల వేతనం రాకపోవటం, సమ్మె ఎంతకాలం కొనసాగుతోందో తెలియకపోవటంతో ఆవేదనకు గురైన ఆమె ఇంట్లో ఆత్మహత్యకు యత్నించారు. సకాలంలో ఆమెను రక్షించి ఆస్పత్రికి తరలించడంతో ప్రాణాపాయం తప్పింది.

### ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు

ముందు ప్రకటించిన ఉద్యమ కార్యాచరణలో భాగంగా ఆర్టీసీ సమ్మె 19వ రోజు కార్మికులు ఆయా జిల్లాల్లో ప్రజాప్రతినిధులను కలిసి వినతిపత్రాలు సమర్పించారు. వరంగల్ జిల్లాలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును, ఎంపీ బండ ప్రకాష్, ప్రభుత్వ విప్ దాస్యం వినయ్ భాస్కర్‌ను కలిసి కార్మికులు వినతిపత్రాలు సమర్పించారు. సీఎంను ఒప్పించి సమస్య పరిష్కారమయ్యే లా కృషి చేస్తానని విప్ వినయ్‌భాస్కర్ చెప్పారని కార్మికులు తెలిపారు. నిర్మల్‌లో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి ఆర్టీసీ కార్మికులు వినతిపత్రం సమర్పించారు. ఆదిలాబాద్ జిల్లాలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే జోగు రామన్నకు కార్మికులు వినతిపత్రం సమర్పించారు. కార్మికులు శాంతియుతంగా సమ్మెను కొనసాగించాలని, సీఎం కేసీఆర్ తప్పకుండా న్యాయం చేస్తారని జోగు రామన్న అన్నారు. అదేవిధంగా ఎంపీ బాబురావును కూడా కార్మికులు కలిసి వినతిపత్రం అందజేశారు. కరీంనగర్‌లో మంత్రులు ఈటల రాజేందర్, గంగుల కమలాకర్, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు వినోద్ కుమార్ ఇళ్లకు ఆర్టీసీ కార్మికులు ర్యాలీగా వెళ్లారు. అక్కడ మంత్రులు అందుబాటులో లేకపోవటంతో సిబ్బందికి వినతిపత్రాలు అందజేశారు. మౌనం వీడాలని మంత్రి ఈటల రాజేందర్‌ను కోరుతూ నినాదాలు చేశారు. కామారెడ్డిలో కార్మికులు ర్యాలీగా వెళ్లి ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ ఇంటిని ముట్టడించారు.

### సమ్మెకు కొనసాగుతున్న మద్దతు

ఆర్టీసీ కార్మికుల సమ్మెకు మద్దతు కొనసాగుతూనే ఉంది. జాతీయ ఫెడరేషన్ ఆఫ్ రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్ ఆర్టీసీ సమ్మెకు మద్దతు తెలిపింది. ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు హెచ్‌వీ. అనంత సుబ్బారావు, కే. పద్మాకర్, ఆర్ఎఫ్. కమలాకర్‌తోపాటు కేఎస్ఆర్టీసీ ఎస్ఈఎఫ్ జనరల్ సెక్రటరీ టీ. నరసింహన్ మద్దతు తెలిపారు. స్వయంగా టీఎంఎయూ కార్యాలయానికి వచ్చిన వీరు ఆర్టీసీ కార్మిక జేఏసీ కో.కన్వీనర్ రాజిరెడ్డిని కలిసి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్టీసీ సమ్మెను పరిష్కరించాలని అనంత సుబ్బారావు సీఎం కేసీఆర్‌కు లేఖ రాశారు.

### రేపు ఓయూలో బహిరంగ సభ

ఈ నెల 25న ఓయూలోని ఆర్ట్సకాలేజీ మైదానంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు విద్యార్థి జనసమితి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రమేష్ తెలిపారు. ఆర్టీసీ కార్మికుల మద్దతుతోపాటు, నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేయనున్నట్లు చెప్పారు. కాగా.. ఆర్టీసీ కార్మికులకు మద్దతుగా చేపట్టిన బహిరంగ సభకు తరలిరావాలని 'ఈనెల 25న ఛలో ఉస్మానియా' పోస్టర్‌ను మాజీ ఎంపీ వివేక్, విద్యార్థి నేతలు బుధవారం ఆవిష్కరించారు.



భిక్షాటన ద్వారా నిరసన తెలుపుతున్న రాణిగంజ్ ఆర్టీసీ కార్మికులు

# చర్చలకు పిలిస్తే సిద్ధం

- విలీనం డిమాండ్ వదులుకోలేదు
- వదులుకున్నట్లు నిరూపిస్తే

**ఉరిశిక్షకైనా సిద్ధం: ఆర్టీసీ జేఏసీ కన్వీనర్ అశ్వత్థామరెడ్డి**



**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలన్న డిమాండ్‌ను తాము వదులుకోలేదని ఆర్టీసీ కార్మిక జేఏసీ కన్వీనర్ అశ్వత్థామరెడ్డి తేల్చి చెప్పారు. కార్మిక నేతలు కాని, కార్మికులు కాని, కార్మికుల తరుపు లాయర్ కాని ఎక్కడైనా ఈ మాట అంటే ఉరిశిక్షకైనా తాము సిద్ధమని ప్రకటించారు. సీఎం కేసీఆర్ అబద్ధాలు చెబుతున్నారని ధ్వజమెత్తారు. సమ్మెలో భాగంగా బుధవారం దిల్‌సుఖ్‌నగర్ బస్ డిపో ఎదుట కార్మికులు వంటావార్పు నిర్వహించారు. విపక్ష నేతలతోపాటు హాజరైన అశ్వత్థామరెడ్డి మాట్లాడుతూ... డిమాండ్ల విషయంలో ఏ ఆర్టీసీ యూనియన్ కూడా ప్రభుత్వానికి తలొగ్గలేదన్నారు. ఓ యూనియన్ పట్టు సడలించిందని ప్రభుత్వం చెప్పటం హాస్యాస్పదంగా ఉందన్నారు. అంతో ఇంతో గులాబీ యూనియన్ అంటే టీఎంయూనేనని, మేము కూడా సమ్మెకు దిగాక ఏ యూనియన్ డిమాండ్ల విషయంలో దిగివచ్చింది ..? అని ప్రభుత్వాన్ని నిలదీశారు. యూనియన్ల ఎన్నికల కోసం తాను గులాబీ కండువాలు, జెండాలు సిద్ధం చేశానని, వాటిని ఇక కాలుస్తానని అశ్వత్థామ వ్యాఖ్యానించారు. ఆర్టీసీ కార్మికులకు వ్యతిరేకంగా ఏ ప్రభుత్వం వ్యవహరించినా తాము మద్దతుగా నిలవమని స్పష్టం చేశారు. విమానాలు, రైళ్ల కంటే ఆర్టీసీ వాడే డీజిల్‌పైనే 27శాతం మేర ట్యాక్స్ విధిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో మంథని సభలో ఆర్టీసీపై పన్నులు తగ్గిస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించారని గుర్తు చేశారు. పన్నుల తగ్గింపుపై హామీ ఇవ్వలేదని నిరూపిస్తారా..? ఈ విషయంలో బహిరంగ చర్చకు సిద్ధమా? రాజకీయ ప్రతినిధులను పంపినా ఓకే, యాజమాన్య కమిటీని పంపినే సరే..? అని ప్రభుత్వానికి సవాల్ విసిరారు. గురువారం ఇందిరాపార్కు వద్ద మహిళా కండక్టర్ల దీక్షను పెద్ద ఎత్తున నిర్వహించబోతున్నామని చెప్పారు. తాము కూడా దీక్షలకు దిగుతామని ప్రకటించారు.

### కాలయాపనకే ఈడీ కమిటీ

ఆర్టీసీ సమ్మెను పరిష్కరించే చిత్తశుద్ధి రాష్ట్ర ప్రభుత్వానికి లేదని టీజేఎస్ అధినేత ప్రొ. కోదండ రాం విమర్శించారు. చర్చల ప్రక్రియను జాప్యం చేసేందుకే ప్రభుత్వం ఈడీ కమిటీని వేసిందని ఆరోపించారు. కామారెడ్డి బస్‌డిపో ఎదుట ఆర్టీసీ కార్మికులు చేస్తున్న నిరసనలకు బుధవారం ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... సీఎం కేసీఆర్ ఇప్పటికే అనేక సార్లు, గంటలపాటు ఆర్టీసీ సమ్మెపై రివ్యూ చేశారని, ఆయనకు సమగ్ర అవగాహన ఉందన్నారు. అంతా తెలిసినా కూడా అధ్యయనం కోసం మళ్లీ ఈడీ కమిటీని వేయటం ఏమిటి..? అని సీఎంను ప్రశ్నించారు. ఆర్టీసీ కార్మికులతో చర్చల విషయంలో ప్రభుత్వానికి హైకోర్టు మంచి ఆదేశాలు ఇచ్చిందని కొనియాడారు.

### అన్ని యూనియన్లు సమ్మె చేస్తున్నాయి: తమ్మినేని

ఆర్టీసీ చరిత్రలోనే మజ్దూర్ యూనియన్, ఎంప్లాయిస్ యూనియన్ తదితర అన్ని యూనియన్లు ఒకేసారి సమ్మెకు దిగాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ప్రకటించారు. యూనియన్లన్నీ ఏకతాటి పైకి వచ్చిన విషయాన్ని గుర్తెరిగి, వెంటనే కార్మికులతో చర్చలు జరిపి వారి సమస్యలను పరిష్కరించాలని సీఎం కేసీఆర్‌ను డిమాండ్ చేశారు. ఆర్టీసీ సమ్మెను నిర్వీర్యం చేయటం ఎవరి తరం కాదని స్పష్టం చేశారు.

### సమ్మె పరిష్కరించటం సీఎంకు ఇష్టం లేదు: మోత్కుపల్లి

ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించటం సీఎం కేసీఆర్‌కు ఇష్టం లేదని మోత్కుపల్లి నర్సింహులు స్పష్టం చేశారు. చిన్న సమస్యనే పరిష్కరించలేకపోతున్నారని ఎద్దేవా చేశారు. ప్రజాస్వామ్యయుతంగా కాకుండా నియంతల పాలన రాష్ట్రంలో సాగుతోందని ధ్వజమెత్తారు.

### సీఎంకు చర్చలు ఇష్టం లేదు: వీహెచ్

సీఎం కేసీఆర్‌కు ఆర్టీసీ కార్మికులతో చర్చలు నిర్వహించటం ఇష్టం లేదని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ వీ. హనుమంతరావు విమర్శించారు. ఇష్టం లేనందునే కోర్టులు ఆదేశించినా స్పందించటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులతో కలిసి డ్యాన్సు చేసిన వీహెచ్... వారికి సంఘీభావం తెలిపారు.

# నిరసనల జోరు... హోరు

- 19వ రోజూ కొనసాగిన ఆర్టీసీ కార్మికుల ఆందోళన
- దిల్‌సుఖ్‌నగర్ డిపో ఎదుట జేఏసీ వంటావార్పు
- ఓయూలో ధూం ధాంకు అనుమతి నిరాకరణ



సీఎం క్యాంపు ఆఫీస్ వద్ద ఏబీవీపీ కార్యకర్తల అరెస్టు

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** ఆర్టీసీ కార్మికుల సమ్మె బుధవారం 19వ రోజుకు చేరుకోగా ఉధృతంగా సాగింది. ఇప్పటి వరకు ధర్నాలు, రాస్తారోకోలు, మానవహారాలతో నిరసన తెలిపిన కార్మికులు బుధవారం ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలతో పాటు ధూంధాంలు నిర్వహించారు. బస్‌డిపోల ఎదుట బైఠాయించి బస్సులు బయటకు రాకుండా అడ్డుకున్నారు. బుధవారం ఉదయం నుంచే కార్మికులు బస్సు డిపోల వద్దకు చేరి ఆందోళనకు దిగారు. తాత్కాలిక డ్రైవర్లు బస్సులు నడపకుండా అడ్డుకుని నిరసన తెలిపారు. కార్మికుల నిరసనలకు ప్రజాప్రతినిధులు కూడా మద్దతు తెలిపారు. నల్గొండలో ఎంపీ కోమటరెడ్డి వెంకటరెడ్డి, గద్వాలలో మాజీ మంత్రి డీకే. అరుణ సంఘీభావం తెలిపారు. నగరంలో సీఎం క్యాంపు ఆఫీసును ముట్టడించేందుకు ఏబీవీపీ కార్యకర్తలు బుధవారం యత్నించారు. పోలీసులు అడ్డుకోవటంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఆర్టీసీ కార్మికుల సమ్మెను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ప్రగతి భవన్ ముందు తమను పోలీసులు కొడుతున్నారని విద్యార్థులు ఆరోపించారు. మరోవైపు ఓయూలో విద్యార్థులు ధూంధాం నిర్వహించాలని సంకల్పించినప్పటికీ వీసీ, రిజిస్ట్రార్ అనుమతివ్వలేదు. దీంతో ఆర్ట్సు కాలేజీ ఎదుట ఆందోళన నిర్వహించారు.

### జిల్లాల్లో ఆందోళనలు

సంగారెడ్డి బస్ డిపో ఎదుట కార్మికులు ఆందోళనకు దిగడంతో పోలీసులు అడ్డుకున్నారు. తాత్కాలిక డ్రైవర్లను అడ్డుకునే ప్రయ త్నం చేయటంతో అరెస్టు చేశారు. సంగారెడ్డిలో విద్యా ర్థులు నిరసన తెలిపారు. గుండ్లవాచునూరు రహదారిపై బైఠాయించారు. బస్సులను వేళకు నడపాలని, ఆర్టీసీ కార్మికుల సమ్మెను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మెదక్ జిల్లా రేగోడులో కల్లు తాగుతూ బస్సు నడుపుతున్నాడని తాత్కాలిక డ్రైవర్‌పై కార్మికులు చేయి చేసుకున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో బస్ డిపోల ఎదుట కార్మికులు తమ కుటుంబ సభ్యులతో కలిసి కళ్లకు గంతలు కట్టుకుని నిరసనలు తెలిపారు. జగిత్యాల మెట్‌పల్లి ఆర్టీసీ డిపో ఎదుట కార్మికులు ఆందోళన చేపట్టారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో ఆర్టీసీ కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే బొడిగ శోభ పాల్గొన్నారు. పెద్దపల్లి జిల్లాలో ఆర్టీసీ కార్మికుల ర్యాలీకి బీజేపీ నేతలు సంఘీభావం తెలిపారు. డోలు వాయిస్తూ పెద్దమ్మలోళ్లకు వినతిపత్రం అందించి నిరసన తెలిపారు. డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ విద్యార్థులు కూడా సమ్మెకు సంఘీభావం తెలిపారు. కరీంనగర్‌లో ఆర్టీసీ కార్మికులు చేపట్టిన నిరసనల్లో కార్మిక జేఏసీ కో.కన్వీనర్ థామస్‌రెడ్డి పాల్గొన్నారు. కార్మికుల నిరసనలకు కాంగ్రెస్ నేతలు సంఘీభావం తెలిపారు. భిక్షాటన చేసి వచ్చిన డబ్బును కార్మికులకు అందజేశారు. ఖమ్మం జిల్లాలో కార్మికులు పెద్ద ఎత్తున బస్ డిపోల ఎదుట ఆందోళనలు నిర్వహించారు. ఖమ్మం బస్ డిపోవద్ద అడ్డంగా పడుకుని నిరసన తెలిపారు. కొత్తగూడెంలో కార్మికులు ర్యాలీ నిర్వహించారు. ధర్నాచౌక్ వద్ద నిరాహారదీక్షలు చేశారు. నిజామాబాద్ జిల్లా బోధన్, ఆర్మూరులో కార్మికులు నిరసనలను ఉధృతం చేశారు. వారికి కాంగ్రెస్ నేతలు సంఘీభావం తెలిపారు. చేతులకు సంకెళ్లు వేసుకుని వినూత్నంగా నిరసన తెలిపారు. అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రాన్ని అందజేశారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో ఆర్టీసీ కార్మికుల ఆందోళనలు తీవ్రరూపం దాల్చాయి. ఆర్టీసీ కార్మికులకు మద్దతుగా అచ్చంపేటలో భిక్షాటన చేసి సంపాదించిన రూ.1000ని ఓ వృద్ధుడు ఆర్టీసీ కార్మికులకు ఇచ్చారు. గద్వాలలో మాజీ మంత్రి డీకే అరుణ ఆర్టీసీ కార్మికుల నిరసనలకు సంఘీభావం తెలిపారు. ఆర్టీసీ కార్మికుల పొట్టకొట్టొద్దని తాత్కాలిక సిబ్బందికి పూలు ఇచ్చి విజ్ఞప్తి చేశారు. నల్గొండ జిల్లా జడ్పీ మీటింగ్‌ను అడ్డుకునేందుకు ఆర్టీసీ కార్మికులు యత్నించారు. కాంగ్రెస్ ఎంపీ కె. వెంకటరెడ్డి కార్మికులకు సంఘీభావం ప్రకటించారు. యాదాద్రి భువనగిరిలో ఆర్టీసీ కార్మి కులు మద్దతుగా ఏబీవీపీ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు.

# 21 డిమాండ్లపై ఈడీల కమిటీ మేధోమథనం

(మొదటి పేజీ తరువాయి)

పరిశీలిస్తున్నారు. కండక్టర్, డ్రైవర్ల ఉద్యోగాల భద్రత, కారుణ్య నియామకాలలో అర్హతను బట్టి ఉద్యోగాలివ్వడంలో సాధ్యాసాధ్యాలు, పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు సెటిల్‌మెంట్‌తో పాటు సకల జనుల సమ్మె కాలపు వేతనాలను చెల్లించడం, యూనిఫాంల అందజేత, కాంట్రాక్టు ఉద్యోగు లకు పర్మినెంట్ చేయడం తదితర అంశాలపై కమిటీ చర్చించింది. కొన్ని డిమాండ్లను కార్పొరేషన్ స్థాయిలో తీసుకునేందుకు వీలున్నందున వాటిపై దృష్టి పెట్టారు. ఆర్థిక పరమైన అంశాలపై ఆచి తూచి పరిశీలించిన ఈడీల బృందం ఒకటికి రెండు పరిష్కారాలను వెతుకుతున్నట్లు సమాచారం. ఉద్యోగ భద్రతపై పరిశీలించిన బృందం ఇప్పటి వరకు సంస్థలో పని చేస్తున్న ఉద్యోగులెవరూ అభద్రతాభావంతో ఉన్న విషయం అధికారుల దృష్టికి రాలేదన్న నిర్ధారణకు వచ్చింది. ఒక రూట్‌లో బస్సు వెళ్ళిన సమయంలో సర్వీసు మొరాయించినపుడు కొంత ఇబ్బంది పడి ఉంటే ఉండొచ్చని, సాంకేతిక అంశాలే అందుకు కారణాలని తేల్చారు. మహిళా కండక్టర్లకు రాత్రి తొమ్మిది గంటల వరకు మాత్రమే విధులను కేటాయించాలన్న డిమాండ్‌లో అర్థం లేదని తేల్చారు. మహిళా కండక్టర్లకు వీలైనంత వరకు రాత్రి పూట విధులను అప్ప గించడం లేదని, ట్రాఫిక్ తదితర ఇబ్బందుల కారణంగా ఎప్పుడైనా ఆలస్యం అవుతుండవచ్చని పేర్కొంటున్నారు. మహిళా కండక్టర్లకు ప్రభుత్వ మహిళా ఉద్యోగుల మాదిరిగా ప్రసూతి సెలవులను ఆరు మాసాలివ్వాలన్న డిమాండ్‌పై ఈడీలు కొంత సందిగ్ధంలో ఉన్నారని తెలిసింది. వాస్తవానికి కార్పొరేషన్ ఉద్యోగులకు ఈ నిబంధన ఇంతవరకు ఎక్క డైనా అమలు చేశారా అన్న విషయాన్ని తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. డబల్ డ్యూటీకి డబల్ వేతనం ఇవ్వా లన్న డిమాండ్‌లోనూ వాస్తవం లేదని ఈడీ బృందం అభిప్రాయపడింది. సంస్థలో చాలా కాలం క్రితమే డబుల్ డ్యూటీలను ఎత్తి వేసిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు. రూట్‌లో వెళ్ళిన బస్సు ఏదైనా కారణంతో ఆలస్యం జరిగితే డబుల్ డ్యూటీ కిందకు రాదని అభిప్రాయపడ్డారు. హైదరాబాద్‌లో చాలావరకు సమయం మించిపోతే బస్సును మార్గ మధ్యలో నుంచి డిపోకు తీసుకువచ్చిన ఘటనలు అనేకం ఉన్నాయని గుర్తు చేసుకున్నారు. అవసరమైతే రోజుకు ఎన్ని బస్సుల ట్రిప్పులను రద్దు చేసింది, ఎన్ని బస్సులు నిర్ణీత చోటుకు వెళ్ళకుండా మార్గమధ్యలో వెనక్కు వచ్చాయన్న గణాంకాలను సిద్ధం చేస్తున్నారు. స్పేర్ పార్ట్స్ విషయంలో జరుగుతున్న జాప్యంపై కార్మిక సంఘాలకు సంబంధం లేదని, సమయానికి బస్సులు అందుబాటులో ఉన్నాయా లేదా అనేదే కార్మికులకు అవసరం అని ఈడీల బృందం అభిప్రాయాన్ని వ్యక్తం చేసినట్లు తెలిసింది.

తార్నాక ఆస్పత్రిలో కావాల్సిన వైద్య పరికరాలున్నాయని, అప్పుడప్పుడు కొన్ని మొరాయిస్తున్నప్పటికీ వెంట వెంటనే మరమ్మతులు చేయించి అందుబాటులోకి తీసుకు వస్తున్నామని అంటున్నారు. గ్యారేజీలలో అవుట్ సోర్సింగ్‌ను తొలగించాలన్న డిమాండ్‌పై అధికా రులు సానుకూ లంగా చర్చించారు. ఈ డిమాండ్‌లో అర్థం లేదని, ఒక వైపు గ్యారేజీ కార్మికులపై పని భారం తగ్గించాలని డిమాండ్ ఎడుతూనే, మరో వైపు గ్యారేజీలలో అవుట్ సోర్సింగ్ ఉద్యో గులు ఉండరాదనడం ఏమిటని అధికారులు చర్చించుకున్నారు. గురువారం మరోసారి భేటీ అయి చర్చించి సమగ్ర రిపోర్టును రూపొందించాలని నిర్ణయించారు. ఈడీల నివేదికను పరిశీలించాక రవా ణా శాఖ కమిషనర్ సందీప్ కుమార్ సుల్తానియా కార్మిక సంఘాలతో చర్చించే అవకాశాలున్నాయి.

## సమ్మె పరిష్కరిస్తే సీఎంకు క్షీరాభిషేకం



**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరిస్తే సీఎం కేసీఆర్‌కు పాలభిషేకం చేస్తానని ఎమ్మెల్యే జగ్గారెడ్డి అన్నారు. ఆర్టీసీ కార్మికుల సమస్యను పరిష్కరించేందుకు సీఎం కేసీఆర్ కమిటి వేయడాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. సంగారెడ్డిలో మెడికల్ కాలేజీ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడంపై సీఎం కేసీఆర్, మంత్రి ఈటల రాజేందర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

### కాంగ్రెస్‌లో స్వేచ్ఛ ఎక్కువ

కాంగ్రెస్ పార్టీలో ప్రజాస్వామ్యం ఎక్కువగా ఉంటుందని జగ్గారెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పుడు పులుల్లా ఉన్న కేశవరావు, డి. శ్రీనివాస్ తదితరులు టీఆర్ఎస్‌లోకి వెళ్లాక పిల్లిలా మారారని ఆయనన్నారు. డీఎస్ రాజకీయంగా కనుమరుగయ్యాడని వ్యాఖ్యానించారు. ప్రగతిభవన్ ముట్టడిపై కాంగ్రెస్ పార్టీ నేతల్లో నెలకొన్న విభేదాలపై ఎమ్మెల్యే జగ్గారెడ్డి బుధవారం సీఎల్పీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. పార్టీ తీసుకున్న నిర్ణయాల మేరకే కార్యక్రమాలు చేస్తే బాగుంటుందన్నారు. ప్రాంతీయ పార్టీల్లో ఎమ్మెల్యేలకు స్వేచ్ఛ ఉండదని, అదే జాతీయ పార్టీలో మాత్రం ఎక్కువ స్వేచ్ఛ ఉంటుందన్నారు. ప్రతి పక్ష ఎమ్మెల్యేలకు ఉన్న స్వేచ్ఛ అధికార పార్టీ వాళ్లకు ఉండదన్నారు. ప్రభుత్వం మంచి చేస్తే అభినందించవచ్చని, చెడు చేస్తే ప్రశ్నించడానికి అవకాశం ఉంటుందన్నారు.

## రేవంత్‌పై నాన్ బెయిల్‌బుల్ కేసు



**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** ఎస్ఐ నవీన్ రెడ్డి ఫిర్యాదుతో.. కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎంపీ రేవంత్‌రెడ్డిపై పోలీసులు నాన్ బెయిలెబుల్ సెక్షన్ కింద కేసు నమో దు చేశారు. ప్రగతి భవన్ ముట్టడి రోజు రేవంత్ ఇంటి వద్ద విధులు నిర్వర్తించిన ఎస్ఐ నవీన్‌రెడ్డి.. తన విధులకు ఆటంకం కలిగించారని రేవంత్‌రెడ్డిపై ఫిర్యాదు చేశారు. దీంతో రేవంత్‌పై ఐపీసీ సెక్షన్ 341, 322, 353 కింద నాన్ బెయిలెబుల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆర్టీసీసమ్మెలో భాగంగా సోమవారం ప్రగతి భవన్ ముట్టడికి కాంగ్రెస్ పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. జూబ్లీహిల్స్ రోడ్ నెం. 48లోని రేవంత్‌రెడ్డి నివాసం వద్ద తెల్లవారుజాము నుంచే జూబ్లీహిల్స్ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసి గృహ నిర్బంధం చేశారు. బంజారాహిల్స్ ఏసీపీ కె.ఎస్. రావు, జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్ కె.బాల కృష్ణారెడ్డి, సెక్టార్ ఎస్ఐ నవీన్‌రెడ్డి తదితరులు ఆయన ఇంటివద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. రేవంత్‌రెడ్డి పోలీసుల ఆదేశాలను లెక్క చేయకుండా ఎస్ఐ నవీన్‌రెడ్డితో పాటు పోలీసులను తోసుకుంటూ అక్కడ నుంచి వెళ్లిపోయారు. తోపులాటలో ఎస్ఐ నవీన్‌రెడ్డికి గాయాలయ్యాయి. ఈ మేరకు ఆయన ఫిర్యాదుతో కేసు నమోదైంది.

### ఆసిఫ్‌నగర్ ఏసీపీపై బదలీ వేటు

విధుల్లో నిర్లక్ష్యం వ్యవహరించిన ఆసిఫ్‌నగర్ ఏసీపీ నర్సింహారెడ్డిపై బదలీ వేటు పడింది. నర్సింహారెడ్డిని డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాల్సిందిగా ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకే బదలీ చేసినట్టు హైదరాబాద్ సీపీ అంజనీకుమార్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ప్రగతి భవన్ ముట్టడి నేపథ్యంలో గేటు వద్ద ఏసీపీ నర్సింహారెడ్డి విధులు నిర్వహిస్తున్నారు. పోలీసు వలయాన్ని ఛేదించుకుని ఎంపీ రేవంత్ రెడ్డి బుల్లెట్‌పై వచ్చి ప్రగతి భవన్‌ను ముట్టడించారు. ఈ నేపథ్యంలోనే ఆయనపై బదలీ వేటు పడినట్టు తెలుస్తోంది. రేవంత్‌రెడ్డిని గృహనిర్బంధం చేసిన సందర్భంగా అక్కడ విధులు నిర్వహించిన బంజారాహిల్స్ ఏసీపీ కెఎస్‌రావుతో పాటు జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణారెడ్డిపైనా సీపీ అంజనీకుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసిఫ్‌నగర్ సబ్ డివిజన్ బాధ్యతలను డీసీపీ సుమతికి అప్పజెప్పారు.

## రోడ్డుపై చదువుతూ నిరసన

**జనగామ, ప్రభన్యూస్ :** ఆర్టీసీ సమ్మెతో బస్సులు తిరగకపోవడంతో విద్యార్థులకు చిర్రెత్తుకొచ్చింది. మారుమూల గ్రామాలకు బస్సులు రావడం లేదు. బడులు తెరవడంతో అక్కడి నుంచి రావడానికి, తిరిగి వెళ్లడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో విద్యార్థులు బుధవారం వినూత్నంగా నిరసన చేపట్టారు. జనగామ ఆర్‌టీసీ డిపోవద్ద రోడ్డుమీద బైఠాయించారు. ఆనక పుస్తకాలు తీసి చదువుతూ గడిపారు. ఇలా నిరసన తెలిపినవారంతా చౌడారం గ్రామం మోడల్ స్కూల్ విద్యార్థులు. జనగామ నుండి నిత్యం అక్కడికి వెళ్లిరావాలని, బస్సులు లేకపోవడంతో రోజుకు రూ.40 ఆటోలకు ఖర్చు చేయాల్సి వస్తోందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్థికభారంతో పాటు అలసిపోవడం వల్ల చదువులు దెబ్బతింటున్నాయని వారి తల్లిదండ్రులు చెబుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న కలెక్టర్ వినయ్ క్రిష్ణారెడ్డి స్పందించారు. డిపో మేనేజర్ ధరమ్‌సింగ్‌తో మాట్లాడారు. ప్రత్యామ్నాయ బస్సులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

## మూసా వారసుడే లెల్హారీ..!

**శ్రీనగర్ :** ఆల్ ఖైదా జమ్మూ కాశ్మీర్ యూనిట్ చీఫ్ జకీర్ మూసా 2019, మేలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో చనిపోయాడు. అన్సర్ ఘజ్వతుల్ హింద్ (ఏజీహెచ్)కు నేతృత్వం వహిస్తూనే ఆల్ ఖైదాతో కలిసి దాడులకు పాల్పడేవాడు. మూసా చనిపోయాక హమీద్ లెల్హారీ ఏజీహెచ్ బాధ్యతలు తీసుకున్నాడు. మంగళవారం సాయంత్రం అవంతిపొరాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన వారిలో లెల్హారీ కూడా ఉన్నాడు. ఏజీహెచ్‌కు చీఫ్‌గా హమీద్ లెల్హారీ అని ప్రకటించిన రెండు వారాలకే జకీర్ మూసా హతమయ్యాడు. హమీద్ లెల్హారీ (30) పుల్వామా వాసి. జకీర్ మూసా ఎవరంటే.. 2017, జులై 26 నుంచి ఆల్ ఖైదా జమ్మూ కాశ్మీర్ యూనిట్‌కు చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించాడు. దీని కంటే ముందు మూసా, హిజ్బుల్ ముజాహిదీన్‌కు నేతృత్వం వహించాడు. 2016లో బుర్హాన్ వనీ హతం అయ్యాక హిజ్బుల్ ముజాహిదీన్ బాధ్యతలు మూసా తీసుకున్నాడు. గతేడాది సెప్టెంబర్‌లో జలంధర్‌లో జరిగిన వరుస పేలుళ్లకు సంబంధించి ఈనెల తొలి వారంలో పంజాబ్‌లోని మొహాలీలోని జాతీయ దర్యాప్తు సంస్థ ప్రత్యేక కోర్టు మూసాను అపరాధిగా ప్రకటించింది. మే 23, త్రాల్‌లో ఏజీహెచ్ చీఫ్ మూసాను భద్రతా దళాలు హతమార్చాయి. ఇది భారత్ బలగాల గొప్ప విజయంగా భావించొచ్చు.

## ఉగ్రవాదమే వారి భయం!

- కారణాలు వివరించిన ఇండో అమెరికన్ న్యాయవాది

**వాషింగ్టన్ :** ఉగ్రవాదాన్ని నిర్మూలించాల్సిన అవసరం ఉందని, కానీ మానవ హక్కులకు భంగం కలిగించరాదని అమెరికా చట్టసభ్యులు చెప్పారని భారతీయ సంతతికి చెందిన అటర్నీ రవి బత్రా వివరించారు. జమ్మూ కాశ్మీర్‌లో మానవ హక్కుల ఉల్లంఘనకు సంబంధించి చర్చ జరిగిందని, దీనిపై కొందరు భారత్ వైఖరిపై విముఖత వ్యక్తం చేశారని బత్రా చెప్పుకొచ్చారు. 'దక్షిణాసియాలో మానవ హక్కులు' అనే అంశంపై కాంగ్రెస్ ఉప సంఘంపై స్పందిస్తూ రవి బత్రా ఈ వ్యాఖ్యలు చేశారు. జమ్మూ కాశ్మీర్‌లో రోజూ ఉగ్రవాద ఏరివేత చర్యలు కొనసాగుతుంటాయని, స్థానికంగా ఉన్నవారు మిలిటెంట్లుగా మారి దాడులకు పాల్పడుతుంటారని, అందుకే జమ్మూ కాశ్మీర్ వాసులు బయటకు రావడానికి భయపడుతారని వివరించారు. మానవ హక్కులు పొందాలనుకునే వారు ముందుగా.. వారు బతికి ఉండాలని కోరుకుంటారన్నారు. నవంబర్ 26, 2008న ముంబైలో పాకిస్తాన్ మిలిటెంట్లు దాడి చేసిన సమయంలో అమెరికన్లు కూడా చనిపోయారని, తాను అప్పుడు సంయమనం కోసం వాదించానని, చేసిందితప్పని, ఉగ్రవాదాన్ని నిర్మూలించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డట్టు తెలిపారు. అమెరికా మాజీ అధ్యక్షుడు అబ్రహంలింకన్ మాదిరిగానే ప్రధాని మోడీ కూడా చట్టపరమైన అధికారాన్ని కలిగి ఉండటానికి కొన్ని సవరణలు చేశారని, వీటి సాయంతో అసాధారణ నిర్ణయాలు తీసుకున్నారని, జమ్మూలో ఉగ్రవాద నిర్మూలనకు కీలక అడుగులు వేశా రని చెప్పుకొచ్చారు. హౌస్ విదేశీ వ్యవహారాల కమిటీ చైర్మన్, కాంగ్రెస్ సభ్యుడు ఎలియట్ ఎం గెల్ ఆహ్వానం మేరకు రవి బత్రా కాశ్మీర్‌కు ప్రత్యేక హోదా రద్దు విషయంలో మోడీ వాణిని వినిపించారు.

## 'జమ్మూపై ఇంత నిర్లక్ష్యమా?'

**వాషింగ్టన్ :** పాకిస్తాన్ పెంచి పోషిస్తున్న ఉగ్రవాదుల చేతుల్లో చాలామంది కాశ్మీరీ ముస్లిములు చనిపోయారని, ఆర్థికంగా కూడా నష్టపోయారని, ఈ విషయాన్ని అంతర్జాతీయ మీడియా, అంతర్జాతీయ మానవహక్కుల కార్యకర్తలు అస్సలు పట్టించుకోలేదని భారత్‌కు చెందిన ప్రముఖ పాత్రికేయురాలు ఆర్తీ టికూ సింగ్ అన్నారు. వాషింగ్టన్‌లో 'దక్షిణాసియాలో మానవ హక్కులు' అనే అంశంపై అమెరికా చట్టసభలు నియమించిన విదేశీ వ్యవహారాల కమిటీ ముందు ఆమె భారత్ వాదనను బలంగా వినిపించారు. భారత్‌కు వ్యతిరేకంగా.. పాకిస్తాన్‌కు అనుకూలంగా వ్యవహరించారని విమర్శించారు. పాకిస్తాన్ ఉగ్రవాదుల చేతిలో కాశ్మీరీ ముస్లిములు బాధితులుగా నిలిచారని, 30 ఏళ్లుగా జమ్మూ కాశ్మీర్‌లో ఇస్లామిక్ జిహాద్ కొనసాగుతోందని, కాశ్మీర్ ఛిన్నాభిన్నం అవుతున్నా ప్రపంచ మీడియా కూడా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పాకిస్తాన్ ఉగ్రవాదులకు స్వర్గధామంగా ఉందని, వారు అనుసరిస్తున్న తీరుతో కాశ్మీర్ ప్రజలు ఇప్పటికీ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పాశ్చాత్య మీడియా వాస్తవాలను వక్రీకరించిందని మండిపడ్డారు. చర్చల సందర్భంగా యూఎస్ కాంగ్రెస్ మహిళా సభ్యురాలు ఇల్హాన్ ఓమర్ చేసిన వ్యాఖ్యలను ఆర్తీ టికూ సింగ్ ధీటుగా తిప్పికొట్టారు. అమెరికా చట్టసభలోని కొందరు సభ్యులు జమ్మూ కాశ్మీర్‌లో నెలకొన్న పరిస్థితులపై అసహనం వ్యక్తం చేశారు.

కేంద్ర మాజీమంత్రి చిదంబరం, కర్నాటక కాంగ్రెస్ సీనియర్ నేత డీకే శివకుమార్‌పై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కేసులు, మహారాష్ట్రలో ఎంఎస్‌సీబీ కుంభకోణంలో శరద్‌పవార్‌కు నోటీసులు రాజకీయ ప్రకంపనలకు కారణమైంది. ఆదాయపన్నుశాఖ, ఈడీ పనితీరుపైనా విమర్శలకు దారితీస్తున్నాయి. లోక్‌సభ ఎన్నికలకు ముందే ప్రధాని నరేంద్ర మోడీ ప్రత్యర్థులపై చేసిన 'ఖాన్ మార్కెట్ ముఠా' వ్యాఖ్యలు ఈ సందర్భంగా ప్రస్తావనకు వస్తున్నాయి. శక్తివంతమైన రాజకీయ నాయకులు, ప్రభుత్వ అధికారులు, న్యాయమూర్తులు, వ్యాపారవేత్తలు ఈడీ చట్రంలో ఇరుకున్నారు. మోడీ ప్రభుత్వం ఒత్తిళ్లతోనే ఈడీ బృందం ఖాన్ మార్కెట్ ముఠాపై వేట కొనసాగిస్తోందన్న విమర్శలు కూడా వస్తున్నాయి. ప్రత్యర్థులపై దర్యాప్తుతో బీజేపీ బెదిరింపులకు పాల్పడుతోందని, విదేశీ మారకద్రవ్యాల ఉల్లంఘనలను, మనీలాండరింగ్ దర్యాప్తులో ఈడీ, సీబీఐ తీరు ఇందుకు అనుగుణంగా ఉందని విపక్షాలు ఆందోళన వ్యక్తంచేస్తున్నాయి. ఈ విమర్శలు కొత్తగా వినిపిస్తున్నవి కావు. గతంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడూ విపక్షాలు ఇలాగే గగ్గోలుపెట్టాయి. వాస్తవానికి, మే 2013లో, యూపీఏ హయాంలో సీబీఐని సుప్రీంకోర్టు పంజరంలో చిలుకగా పేర్కొనడం అప్పట్లో సంచలనం అయింది. దర్యాప్తు సంస్థలకు స్వయంప్రతిపత్తి లేదనడానికి ఈవ్యాఖ్యలు అద్దంపడుతున్నాయి. కేవలం ప్రతిపక్ష నాయకులనే టార్గెట్ చేస్తున్నారని, బీజేపీ నేతలపై ఇలాంటి దర్యాప్తులు ఎందుకు జరగడం లేదని కాంగ్రెస్ ఆగ్రహం వ్యక్తంచేసింది. తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) నుండి బీజేపీ గూటికి చేరినముకుల్ రాయ్, హిమంత బిస్వా శర్మ. శారదా చిట్ ఫండ్ కుంభకోణంలో ఉన్నారు. ఈ కేసులో చాలా మంది టీఎంసీ నేతలను విచారించిన ఈడీ, ప్రస్తుతం మెకవైఖరిని అవలంబిస్తుండటం విపక్షాల వాదనలకు మరింత బలాన్నిస్తోంది.



# "రాజకీయాలు! ఆర్థిక నేరాలు!!

## ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దాడులతో విపక్షాలు హడల్

ఖాన్ మార్కెట్ ముఠా వ్యాఖ్యలను నిజం చేస్తున్న మోడీ సర్కార్
చిద్దూ నుంచి పవార్ దాకా.. వాద్రా నుంచి రతుల్‌పురి దాకా
హాట్‌టాపిక్‌గా మారిన మనీలాండరింగ్ కేసులు

### ఎన్నికలకు ముందు షరా మామూలేనా?

మహారాష్ట్రస్టేట్‌కోఆపరేటివ్‌బ్యాంక్(ఎంఎస్‌సిబి)లో రూ.2,500 కోట్ల కుంభకోణంలో నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సిపి) చీఫ్ శరద్ పవార్‌కు ఇటీవల ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సమన్లు పంపింది. బొంబాయి హైకోర్టు ఆదేశాల మేరకు 2019 ఆగస్టులో నమోదైన ఎఫ్‌ఐఆర్ ఆధారంగా ఈ కేసు దర్యాప్తు పున:ప్రారంభమైంది. బ్యాంక్ డైరెక్టర్లు, శరద్ పవార్ మేనల్లుడు అజిత్ పవార్‌తోపాటు 70 మంది మాజీ నిర్వాహకులపేర్లను ఎఫ్‌ఐఆర్‌లో పొందుపరిచారు. అసలు ఫిర్యాదు 2015 లో ఎకనామిక్ నేరాల విభాగం (ఇఒడబ్ల్యూ) లో నమోదైంది. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు ముందు రాజకీయంగా లబ్దిపొందేందుకు, ప్రత్యర్థులను దెబ్బతీసేందుకు ఈడీని ఉసిగొల్పారని శరద్ పవార్ ఆరోపించారు. మరొకవైపు ఆగస్టు 26న హర్యానాలోపంచకుల భూకేటాయింపులఅంశంపై ఆ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, భూపేందర్ హుడా, కాంగ్రెస్ సీనియర్ నేత మోతీలాల్ వోరాను ఈడీ వెంటాడటం రాజకీయ ప్రేరేపిత చర్యలని బాధిత పక్షాలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నాయి. 2017లో ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు మూడు నెలలముందు, బీఎస్‌పీ అధినేత్రి మాయావతికీ ఇలాంటి అనుభవమే ఎదురైంది. బీఎస్‌పీ ఖాతాలో రూ.104 కోట్లు, మాయావతి సోదరుడు ఆనంద్ కుమార్ ఖాతాలో సుమారు రూ.1.5 కోట్ల నగదుపై ఈడీ దృష్టిసారించింది. మాయావతి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో జరిగిన స్మారక విగ్రహాల కుంభకోణం మరోసారి తెరపైకి వచ్చింది. జనవరిలో యూపీలోని ఏడు ప్రాంతాల్లో ఈడీ దాడి చేసింది. ఇక అదే సమయంలో మరో మాజీ సీఎం అఖిలేశ్ పై అక్రమ మైనింగ్ కేసులో మనీలాండరింగ్ కేసు నమోదవడం రాజకీయ విమర్శలకు కారణమైంది.


### ప్రత్యర్థులపైకి పదునైన అస్త్రం!

సెప్టెంబర్ 3న, చిదంబరం అరెస్టయినరెండు వారాల తరువాత, కర్నాటకలో మరో కాంగ్రెస్ నేత శివకుమార్ నివాసాల్లో ఆదాయపన్ను శాఖ దాడులు కలకలం రేపాయి. 2017లో ఐటీ బృందం దాడుల్లో లభ్యమైన ఆధారాల మేరకు, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఇప్పుడు అరెస్టు చేసింది. చిదంబరం ఉన్న తీహార్ జైలులోనే శివకుమార్‌ను ఉంచారు. వీరి అరెస్టులు వివిధ కుట్ర సిద్ధాంతాలకు ఆజ్యం పోసింది. గతంలో అమిత్ షాను అవమానించినందుకు ప్రతీకారంగా వీరిద్దరిని శిక్షించేందుకు కేంద్ర దర్యాప్తు సంస్థలు నిర్విరామంగా శ్రమిస్తున్నాయని కాంగ్రెస్ ఆడిపోసుకుంటోంది. సోహ్రాబుద్దీన్ షేక్ నకిలీ ఎన్‌కౌంటర్ కేసులో షా జూలై 2010 లో అరెస్టు చేసిన సమయంలో చిదంబరం కేంద్ర హోంమంత్రిగా ఉన్నారు. 2014లో, సీబీఐ కోర్టు షాను నిర్దోషిగా ప్రకటించింది.

కర్నాటక రాజకీయాల్లో బీజేపీ కుట్రలను అధిగమించడంలో డీకే శివకుమార్ కీలకంగా వ్యవహరించారు. కాంగ్రెస్ కోశాధికారి అహ్మద్ పటేల్ గుజరాత్ నుండి రాజ్యసభకు ఎన్నికైన సమయంలోను, 2018లో కన్నడనాట కాంగ్రెస్-జనతాదళ్ (లౌకిక) ప్రభుత్వం ఏర్పడిన సమయంలోనూ డీకే సమర్థవంతమైన వ్యూహకర్తగా నిలిచారు.

సోనియా రాజకీయ వ్యవహారాల కార్యదర్శి అహ్మద్ పటేల్ కూడా దర్యాప్తు సంస్థల వేడిని ఎదుర్కొంటున్నారు. గత మూడు నెలల్లో, స్టెర్లింగ్ బయోటెక్ మనీలాండరింగ్ కేసులో పటేల్ కుమారుడు, అల్లుడిని సీబీఐ ప్రశ్నించింది. ఆగస్టు 20న ఈడీ మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి కమల్ నాథ్ మేనల్లుడు రతుల్ పూరిని బ్యాంకు రుణాల కుంభకోణం కేసులో అరెస్ట్ చేసింది. అగస్టా వెస్టాండ్ ఛాపర్ కుంభకోణంలో విచారణ కోసం అతన్ని ఈడీ అధికారులు పిలిచారు. మరోవైపు సోనియా గాంధీ అల్లుడు రాబర్ట్ వాద్రా కూడా అనేక భూ ఒప్పందాల కేసుల్లో ఆరోపణలు అదుర్కొంటున్నారు.

ఈ విషయంలో సీబీఐ, ఈడీ దర్యాప్తులను ఎదుర్కొంటున్నారు. ఇప్పటివరకు వాద్రాను ఎనిమిది సార్లు ప్రశ్నించింది. వాద్రా కు చెందిన స్కైలైట్ హాస్పిటాలిటీ, అనుబంధ కార్యాలయాలపై ఈడీ దాడులు జరిపింది. సీబీఐ కోర్టు వాద్రాకు ముందస్తు బెయిల్ ఇవ్వగా, ఢిల్లీ హైకోర్టులో బెయిల్‌ను సవాలు చేసింది. వాద్రాను కస్టడీకి అప్పగించాలని పట్టుబట్టింది.




# ఎన్‌డీఏ హయాంలో హైప్రొఫైల్ ఈడీ దర్యాప్తులు



**శరద్‌పవార్:** మహారాష్ట్ర కో ఆపరేటివ్ బ్యాంక్ కుంభకోణంలో పవార్ పాత్రపై ఆరోపణలు వచ్చాయి.

**అఖిలేశ్ యాదవ్:** ఉత్తరప్రదేశ్‌లో అక్రమ మైనింగ్ కుంభకోణంలో మనీలాండరింగ్ ఆరోపణలు.

**రాబర్ట్‌వాద్రా:** కాంగ్రెస్ అధినేత్రి సోనియాకు అల్లుడు. రాజస్థాన్, హర్యానా రాష్ట్రాల్లో భూ లావాదేవీలకు సంబంధించి మనీలాండరింగ్ అభియోగాలు.

**చిదంబరం అండ్ ఫ్యామిలీ:** ఐఎన్‌ఎక్స్ మీడియా, ఎయిర్‌సెల్ మాక్సిస్ కేసులో అభియోగాలపై చిద్దూ, ఆయన కుమారుడు కార్తీ ఈడీ దర్యాప్తును ఎదుర్కొంటున్నారు. ఇక చిదంబరం భార్య నళిని కోల్‌కతా లింకులున్న శారదచిట్‌ఫండ్ కుంభకోణంలో ఈడీ విచారణ ఎదుర్కొంటున్నారు.

**అహ్మద్‌పటేల్:** అగస్టావెస్ట్‌లాండ్ కుంభకోణంలో క్రిస్టియన్ మైఖేల్‌తో సంబంధాలున్నాయన్న అభియోగా లతో ఈడీ చార్జిషీటులో అహ్మద్ పటేల్ పేరు పొందుపరిచింది. దీనికి సంబంధించి మనీలాండరింగ్ కేసులో పటేల్ తనయుడిని, అల్లుడిని కూడా ఈడీ విచారించింది.

**బీఎస్ హుడా, మోతీలాల్ వోరా:** భూ కేటాయింపుల్లో అక్రమాల అభియోగాలు. పంచకులలో అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ ల్యాండ్ డీల్‌లో లబ్ధిపొందారని కేసు.

**డీకే శివకుమార్:** మనీలాండరింగ్ అభియోగాలు. కర్నాటక రాజకీయాల నాటకీయ పరిణామాల్లో బీజేపీకి వ్యతిరేకంగా వ్యూహకర్తగా వ్యవహరించారు.

**ప్రఫుల్ పటేల్:** ఎయిరిండియా అధోగతి పాలవడంలో పటేల్ పాత్ర ఉందని అభియోగాలు. ఏవియేషన్ కుంభకోణం కేసులో కీలక నిందితుడుగా చార్జిషీటు.

**అజంఖాన్:** భూ దురాక్రమణ కేసులో ఈడీ మనీలాండరింగ్ అభియోగాలు నమోదు చేసింది.

**మాయావతి:** 2007-12 మధ్య ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో, స్మారక విగ్రహాల ఏర్పాటు కుంభకోణం కేసు. ఇందుకు సంబంధించి బీఎస్‌పీ అధినేత్రిపై మనీలాండరింగ్ కేసు నమోదైంది.

**మనద్ మిత్ర, కునాల్ ఘోష్:** శారద చిట్‌ఫండ్ కుంభకోణం కేసు. తీవ్ర నేరారోపణల నేపథ్యంలో ఈ ఇద్దరు తృణమూల్ నేతలు రెండేళ్ల జైలుశిక్ష అనుభవించారు. మనీలాండరింగ్ కేసు దేశవ్యాప్తంగా సంచలనానికి కేంద్రమైంది.

**లాలూ ప్రసాద్:** ఐఆర్‌సీటీసీ హోటళ్ల కేటాయింపు కుంభకోణం. ఈ కేసులో ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్, ఆయన భార్య రబ్రీదేవి, కుమారుడు తేజస్వీ యాదవ్, కుమార్తె మిసా భారతిపై ఈడీ విచారణ.

**శంకర్‌సింగ్ వాఘేలా:** ముంబైలో బాగా డిమాండ్ ఉన్న ప్రాంతంలోని భూ విక్రయ కేసు. మనీలాండరింగ్‌కు పాల్పడ్డారని అభియోగాలు

**ఓపీ చౌతాలా:** ఆదాయానికి మించిన ఆస్తులు కలిగివున్నారని కేసు నమోదు. రూ. 1.9 కోట్ల విలువైన ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ జప్తు చేసింది. మరొక ఆర్థిక నేరాల కుసేలో జైలుకు కూడా వెళ్లారు.




**విజయ్ సింగ్లా:** మాజీ రైల్వే మంత్రి పీకే బన్సల్‌కు స్వయానా అల్లుడు. మనీలాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ రూ. 89.6 లక్షల రూపాయల ఆస్తులను జప్తుచేసింది.

**హరీశ్ గెహ్లాట్:** ఢిల్లీ మంత్రి కైలాశ్ గెహ్లాట్‌కు స్వయానా సోదరుడు. ఫెమా కేసును ఎదుర్కొంటున్నారు. రూ.1.46 కోట్ల విలువైన ఆస్తులు జప్తు.

**కేడీ సింగ్:** టీఎంసీ ఎంపీకి వ్యతిరేకంగా మనీలాండరింగ్ కేసు నమోదు. ఢిల్లీ, చత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లోని ఆయన నివాసాలు, కార్యాలయాల్లో ఈడీ సోదాలు చేపట్టింది.

**వీరభద్రసింగ్:** హిమాచల్ ప్రదేశ్‌కు మాజీ ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఆదాయానికి మించి ఆస్తులు కలిగివున్నారన్న అభియోగాల కింద, ఈడీ చార్జిషీటు నమోదు చేసింది.

**బాబా సిద్ధిఖీ:** ముంబైలో రూ. 400 కోట్ల విలువైన పునరావాస కుంభకోణంలో సిద్ధిఖిపాత్రపై అనుమానాలు. 2017లో పలు ప్రాంతాల్లోని ఆయన నివాసాల్లో ఈడీ దాడులు.

**రాజ్‌థాక్రే:** నవనిర్మాణ సేన పార్టీ అధినేత. ఐఎల్ అండ్ ఎఫ్‌ఎస్ కోహినూర్ సీటీఎన్‌ఎల్ కేసులో జైలుకు వెళ్లారు.

**వైఎస్ చౌదరి:** బ్యాంకులకు రుణాలు ఎగవేత కేసు. రూ. 316 కోట్ల విలువైన కుంభకోణంలో ఈయన పాత్రపై ఈడీ కేసు.





# యూపీఏ హయాంలో ఈడీ కొరడా



**మధుకొడా:** జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి. బొగ్గు కుంభకోణం కేసులో మనీలాండరింగ్ అభియోగాలు. 2009లో ఈడీ చార్జిషీటు.

**హరి నారాయణ్ రాయ్:** జార్ఖండ్ మాజీ మంత్రి. మనీలాండరింగ్ కేసుకు సంబంధించి 2017లో ఏడేళ్లపాటు జైలుకు వెళ్లారు.

**రాజా, కనిమొళి;** 2జీ కుంభకోణం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం మనీలాండరింగ్ కేసు బుక్ చేసింది. చివరకు సీబీఐ కోర్టు ఇద్దరు నేతలను నిర్దోషులుగా ప్రకటించింది. సీబీఐ వద్ద సరైన ఆధారాలు లేనందున వ్యాజ్యం కొట్టేవేయడమైంది.

**దయానిధి మారన్:** 2018లో సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం ఎయిర్‌సెల్ మాక్సిస్ కేసుకు సంబంధించి మనీలాండరింగ్ అభియోగాలు

**సురేశ్ కల్మాడి:** 2010లో జైలుకు వెళ్లారు. కామన్వెల్త్ గేమ్స్ కుంభకోణంలో తీవ్ర నేరారోపణలు ఎదుర్కొన్నారు. చివరకు బెయిల్‌పై వచ్చారు.

**బాబా రాందేవ్:** ఫారిన్ ఎక్చేంజ్ నిబంధనలను అతిక్రమించారన్న ఆరోపణలు. 2011లో కేసు నమోదు. ఆయన సహచరుడు, వ్యాపార భాగస్వామి బాలకృష్ణమీద కూడా అభియోగాలు. ఇద్దరిపైనా 2012లో మనీలాండరింగ్ కేసు.

**గాలి జనార్ధన్‌రెడ్డి:** ఓబులాపురం మైనింగ్ కుంభకోణం కేసుకు సంబంధించి 2012లో ఈడీ చార్జిషీటు

**లక్ష్మీకాంత్ శర్మ:** వ్యాపం కుంభకోణంలో మనీలాండరింగ్ కేసు నమోదు. 2014లో ఈడీ దర్యాప్తు ప్రారంభం. 2018 జులైలోచార్జిషీటు లో లక్ష్మీకాంత్ పేరు ప్రస్తావన.





# అక్రమాలపై ఈడీ పంచ్

**2500**
పిఎమ్ఎల్ఏ కింద 2005 నుంచి 2,500 కేసులు నమోదయ్యాయి. ఇందులో కేవలం 18 కేసుల్లో మాత్రమే అపరాధులు శిక్ష ఎదుర్కొన్నారు. గత నాలుగేళ్లలో సుమారు 689 కేసుల్లో 450కు పైగా ప్రాసిక్యూషన్ ఫిర్యాదులు నమోదయ్యాయి.

**1005**
ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌లో 2,024 మంది సిబ్బంది ఉండాలి. కానీ, ప్రస్తుతం ఉన్నది 1,005 మంది అధికారులే. సీబీఐ మాదిరిగా దీనికి సొంతంగా కార్యాలయ ప్రాంగణాలు లేవు. ఈడీ అరెస్టు చేసిన వారిని సమీప పోలీస్ స్టేషన్‌లోని లాకప్‌లలో బంధిస్తున్నారు.

**55,000**
పీఎమ్ఎల్ఏ చట్టం కింద 2014 -2019 మధ్య కాలంలో రూ. 55,000 కోట్ల ఆస్తులను జప్తు చేసింది. 2005 - 2012 మధ్య రూ. 1,214.6 కోట్ల ఆస్తులు మాత్రమే అటాచ్ చేయబడ్డాయి.

## డికేకు బెయిల్.. షరతులు..!

**న్యూఢిల్లీ:** ఈడీ దాఖలు చేసిన మనీలాండరింగ్ కేసులో తీహార్ జైలులో ఉన్న కర్ణాటక కాంగ్రెస్ నేత శివకుమార్‌కు బెయిలు మంజూరైంది. ఢిల్లీ హైకోర్టు బుధవారం బెయిల్ మంజూరు చేసింది. జస్టిస్ సురేష్ కైట్ మాట్లాడుతూ .. కేసు ఆధారాలు దర్యాప్తు సంస్థల వద్ద ఉన్నందున ఆయన సాక్ష్యాధారాలను మార్చలేరని వ్యాఖ్యానించారు. శివకుమార్ అధికారంలో లేరని, ఆయన కుటుంబ సభ్యులు, సన్నిహితులు సాక్షులను ప్రభావితం చేస్తారనేందుకు ఆధారాలు లేవని న్యాయమూర్తి తెలిపారు. రూ.25లక్షల బాండ్‌తోపాటు అంతే మొత్తానికి ఇద్దరు పూచీకత్తులను ఇవ్వాలని న్యాయమూర్తి ఆదేశించారు. న్యాయస్థానం అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లరాదని, విచారణ కోసం అందుబాటులో ఉండాలని, సాక్షులను ప్రభావితం చేయకూడదని న్యాయమూర్తి షరతులు విధించారు.

## మరో కాంగ్రెస్ నేతకు ఈడీ సమన్లు

డీకే శివకుమార్‌పై నమోదైన మనీలాండరింగ్ కేసుకు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కర్ణాటకలో మరో కాంగ్రెస్ నేత విజయ్ ముల్గుండ్‌కు సమన్లు జారీ చేసింది. బుధవారం ఉదయం ఈడీ అధికారులు ముల్గుండ్‌కు నోటీసులు జారీ చేశారు. ఈ కేసులో విచారించేందుకు హాజరుకావాలని సమన్లలో పేర్కొన్నారు. అంతకుముందు ఈడీ శివకుమార్ తల్లి, భార్యను హాజరుకావాలని నోటీసులు జారీ చేయడంతో వారు హైకోర్టులో సవాల్ చేశారు.ఈ రెండు పిటిషన్లపై ఈ నెల 24న కోర్టు విచారణ జరపనుంది.

## ఢిల్లీ హైకోర్టులో చిద్దూ బెయిల్ పిటిషన్

**న్యూఢిల్లీ:** ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దర్యాప్తు చేస్తున్న ఐఎన్‌ఎక్స్ మీడియా కేసులో బెయిల్ కోరుతూ కేంద్ర మాజీ మంత్రి చిదంబరం బుధవారం ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. ఇదేకేసును దర్యాప్తు చేస్తున్న సీబీఐ సంబంధిత కేసులో సుప్రీంకోర్టు ఆయనకు మంగళవారం బెయిల్ మంజూరు చేయడంతో ఒకరోజు అనంతరం ఈడీ కేసుకు సంబంధించి బెయిల్ కోసం పిటిషన్ దాఖలు చేశారు. తను అనారోగ్యంతో బాధపడుతున్నాను అని ఇప్పటికే అదుపులో ఉన్న రెండు నెలల్లోఐదు కిలోల బరువు కోల్పోయినట్టుఆయన పిటిషన్‌లో తెలిపారు. చల్లనివాతావరణంతో ఆరోగ్యం మరింత క్షీణించే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. దర్యాప్తు ఏజెన్సీలు తనను తప్పుగా ఇరికించాయని పేర్కొన్నారు. విదేశీ ఖాతాలు, ఆస్తులుతో సంబంధం ఉన్నట్టు ఆరోపణలకు సంబంధించిన పత్రాలు, సామగ్రి దర్యాప్తు సంస్థల వద్ద లేవని చిదంబరం తెలిపారు. విజయ్ మాల్యా, నీరవ్‌మోడీ తదితర ఆర్థిక నేరస్థుల మాదిరిగానే చిదంబరం కూడా దేశం విడిచి పారిపోయేందుకు అవకాశం ఉందని సొలిసిటర్ జనరల్ తుషార్‌మెహతా చేసిన వినతిని సర్వోన్నత న్యాయస్థానం తిరస్కరించింది.

## హాంకాంగ్ నేరస్థుల అప్పగింత బిల్లు వెనక్కి

**హాంకాంగ్:** వివాదాస్పదంగా మారిన నేరస్థులను చైనాకు అప్పగించే బిల్లును హాంకాంగ్ శాసనసభ బుధవారం ఉపసంహరించుకుంది. ప్రజాస్వామ్య అనుకూల నిరసనకారుల ఐదు డిమాండ్లలో ఒకదాన్ని నెరవేర్చేదిశగా హాంకాంగ్ ఈ చర్య తీసుకుంది. తైవాన్‌లో హత్యకు పాల్పడిన వ్యక్తితో సంబంధం ఉన్న కేసును పరిష్కరించడానికి హాంకాంగ్ నేత క్యారీ లామ్ ఈ సవరణలు ప్రతిపాదించారు. అయితే నిరసనకారుల ఐదు డిమాండ్లలో ఒక్కటే నెరవేరడంతో హింసాత్మక సంఘటనలు కొనసాగే అవకాశం ఉంది. చైనా పాలిత నగరంలో నిరసనకారులు ప్రభుత్వ భవనాలను ధ్వంసం చేసి పోలీసులుపై పెట్రోల్ బాంబులు విసిరి నిరసన వ్యక్తం చేస్తున్నారు. నిరసనకారుల ఐదు డిమాండ్లలో ప్రభుత్వం ఒక్కదాన్ని మాత్రమే నెరవేర్చింది. మిగతా డిమాండ్లయిన పోలీసులు దాష్టీకంపై స్వతంత్ర విచారణ, పోలీసులు అదుపులోకి తీసుకున్నవారిని బేషరతుగా విడుదల చేయడం, నిరసనలను అల్లర్లుగా పేర్కోవడం తగదని, నగరనేత కోసం ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించాలనే మిగతా డిమాండ్లు నెరవేర్చేవరకూ ఆందోళనకారులు తమ ఆందోళనను కొనసాగించే అవకాశం ఉంది.

## నాకు భద్రత కల్పించండి: సాధ్వీ

**మీరట్:** జిహాదీ గ్రూపుల నుంచి తనకు ముప్పు పొంచి ఉందని ఎంపీ సాధ్వీ ప్రాచీ బుధవారం వ్యాఖ్యానించారు. పశ్చిమ ఉత్తర్‌ప్రదేశ్ మినీ పాకిస్తాన్‌లా మారుతోందన్నారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా, ఉత్తరాఖండ్, ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వాలు తనకు భద్రత కల్పించాలని ఆమె కోరారు. ముఖేష్ శర్మ కుటుంబ సభ్యులను బుధవారం ఆమె రాంపూర్‌లో పరామర్శించారు. జమ్మూ కాశ్మీర్‌కు సంబంధించిన ఆర్టికల్ 370ను ప్రధాని మోడీ ఎంతో ధైర్యంగా రద్దు చేశారని, ఫత్వాలు జారీ చేసే వారితో ఆయన కఠినంగా వ్యవహరించాలని, ఇదే ఆయన తదుపరి లక్ష్యంగా ఉండాలని కోరారు. తాను దేశ వ్యాప్తంగా నిర్భయంగా తిరుగుతున్నా అని, లక్నోలో కమలేష్ తివారీ, మీరట్‌లో ముఖేష్ శర్మ హత్య జరగడంతో కొంత ఆందోళన వ్యక్తం అవుతోందని అన్నారు. రాంపూర్‌లో ఓ నాయకుడి చేసిన ప్రకటనను ఖండిస్తూ తివారీ కౌంటర్ ఎటాక్ చేశారని, ఇది ఆయన ప్రాణాలు తీసిందని విమర్శించారు. 18వ తేదీన లక్నోలో తివారీని అతని ఇంట్లోనే అత్యంత పాశవికంగా హత్య చేశారు. హిందు సమాజ్ నాయకుడు అయిన అతన్ని 15 సార్లు పొడిచారని, ముఖంపై కాల్చి హత్య చేశారని అన్నారు.

## మీరు సలహాలిస్తే వింటాను: మోడీ

**న్యూఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలో వారం రోజుల క్రితం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, తన అధికారిక నివాసంలో బాలీవుడ్ సినీ నటులు, నిర్మాతలు, దర్శకులతో సమావేశం అయ్యారు. దానికి సంబంధించిన ఓ వీడియో బుధవారం బీజేపీ తన అధికారిక ట్విట్టర్‌లో పోస్టు చేసింది.''మీరు ఏమైనా సూచనలు ఉంటే ఇవ్వండి.. మీరు చెబుతుంటే.. నేను వినాలని అనుకుంటున్నాను'' అంటూ బాలీవుడ్ తారాగణంతో పూర్తిగా నిండిపోయిన హాల్‌లో మోడీ కోరారు. అమీర్ ఖాన్, డార్క్ బ్లూ జాకెట్ వేసుకుని.. చేతిలో మైక్రోఫోన్ పట్టుకుని మోడీ పక్కన నిల్చుని మాట్లాడారు. ''స్వాతంత్ర్య కోసం మహాత్మా గాంధీ చాలా పోరాటం చేశారు. ఆయన నమ్మిన సిద్ధాంతాలు, ఆలోచనలు ప్రపంచం, యువత ముందు పెట్టాల్సిన అవసరం ఎంతో ఉంది. ఇవి నవ భారత నిర్మాణానికి ఎంతో ఉపయోగపడుతుంది'' అంటూ అమీర్ ఖాన్ చెప్పారు. ఆ తరువాత షారూఖ్ ఖాన్ మాట్లాడుతూ.. ''మమ్మల్ని అందరినీ ఇక్కడ పిలవడం ఎంతో సంతోషంగా ఉంది. దీనికి ధన్యవాదాలు. సినీ నటులు ఎప్పుడూ ఒకే చోట.. ఒకే సమయానికి కలుసుకోవడం చాలా అరుదు. గాంధీజీ 2.0 దేశానికి ఎంతో అవసరం'' అంటూ చెప్పుకొచ్చారు. బాలీవుడ్ ప్రముఖులతో మోడీ ముఖాముఖిగా మాట్లాడిన 9 నిమిషాల నిడివి గల చిత్రాన్ని రాజ్‌కుమార్ హిరానీ ఫిల్మ్స్ నిర్మిస్తోన్న విషయం తెలిసిందే.

## టర్కీ పర్యాటకులూ.. జాగ్రత్త

**న్యూఢిల్లీ:** మధ్యప్రాచ్య దేశం టర్కీనీ సందర్శించేటపుడు భారత్ పౌరులు అన్నివిధాలుగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కేంద్రం తెలిపింది. జమ్మూ కాశ్మీర్ ప్రత్యేక హోదాను రద్దు చేయడానని వ్యతిరేకిస్తూ టర్కీ అధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్డోగాన్ ఐరాసలో ప్రకటనలు చేయటంతో ఇరుదేశాల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో టర్కీని సందర్శించే భారత్ పౌరులు తగిన జాగ్రత్తలు పాటించాలని కేంద్రం కోరింది. ఉద్రిక్తతల నడుమ ప్రధాని నరేంద్రమోడీ రెండు రోజుల పర్యటన కూడా రద్దయింది. ఈ సందర్భంగా భారత రాయబార కార్యాలయం పౌరులకు సలహా ఇస్తూ ట్వీట్ చేసింది. పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని భారతీయులు టర్కీకి ప్రయాణించడంపై వివరణ తీసుకుంటున్నామని, ఇప్పటివరకూ అవాంఛనీయ సంఘటనలు జరగనప్పటికీ భారత పౌరులు టర్కీకి వెళ్లేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలని రాయబార కార్యాలయం కోరింది. ఈ నెలలో పారిస్‌లో జరిగిన ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్ (ఎఫ్‌ఏటీఎఫ్) సమావేశంలోనూ టర్కీ పాకిస్థాన్‌కు మద్దతు ఇవ్వటం భారత్‌ను ఆగ్రహానికి గురిచేసింది.

## పీఎం కిసాన్ కాల్ సెంటర్

**న్యూఢిల్లీ:** ప్రధానమంత్రి కిసాన్ యోజన పథకంలో రైతుల సందేహాలను నివృత్తి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. తద్వారా అర్హులైన లబ్ధిదారులందరికీ ప్రయోజనం అందించాలని భావిస్తోంది. ఈ క్రమంలో పీఎం కిసాన్ కాల్‌సెంటర్ ఏర్పాటు చేయాలని నిశ్చయించింది. హెల్ప్‌లైన్ రైతులకు ప్రయోజనకరంగా లేదు. వీటి నుంచి వారికి సరైన ప్రతిస్పందనలు లభించడం లేదు. దీనిని గమనించిన కేంద్రం రైతుల సమస్యల పరిష్కారానికి కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఐవీఆర్ వ్యవస్థ ద్వారా దేశం నలుమూలల నుంచి నిరంతరం ఫిర్యాదులను నమోదు చేస్తారు.

### ప్రాంతీయ భాషల్లో ఫిర్యాదులు

ఇరవై నాలుగు గంటలు, వారం రోజులు నిరంతరాయంగా కాల్ సెంటర్లు పనిచేస్తాయి. అన్ని ప్రాంతాల రైతుల ఫిర్యాదుల నమోదుకు వీలుగా ప్రాంతీయ భాషల్లో కాలింగ్ వ్యవస్థ ఉంటుంది. వివిధ దశల్లో ఫిర్యాదును నమోదు చేస్తారు. ఇందువల్ల రైతుల సమస్యలను కచ్చితంగా గుర్తించేందుకు వీలవుతుంది. రైతులు రిజిస్టర్ మొబైల్‌నుంచి ఫోన్ చేయాలి. బ్యాంక్ ఖాతా నంబర్, ఆధార్ నంబర్ ధ్రువీకరించుకున్న తర్వాతే ఫిర్యాదు నమోదు చేస్తారు.

# స్కూటర్‌పై 'అమ్మ'తో యాత్ర..!



- ఆనంద్ మహీంద్రా కారు కానుక

**మైసూర్:** కర్ణాటకలోని మైసూరుకు చెందిన కృష్ణకుమార్(39) అనే వ్యక్తి 70ఏళ్ల తన తల్లి చూడరత్నని పాత స్కూటర్‌పై తీర్థయాత్రలకు తీసుకువెళుతూ పలువురికి మార్గదర్శిగా మారాడు. 20ఏళ్ల క్రితం కొన్న బజాజ్ చేతక్ స్కూటర్‌పై ఆమెను కూర్చొబెట్టుకుని తీర్థయాత్రలకు తీసుకువెళుతున్నాడు. హంపీనిచూడాలని ఉందన్న తన తల్లి కోరికను తీర్చేందుకు కృష్ణకుమార్ గతేడాది జనవరిలో ఉద్యోగాన్ని కూడా వదిలేశాడు. దేశంలోని పలు పుణ్యక్షేత్రా లకు ఆమెను తీసుకువెళ్లాడు. ఇప్పటివరకూ సుమారు 48,100 కిలోమీట ర్లు తన తల్లితో ప్రయాణించాడు. సుమా రు ఏడు నెలలుగా వీరిద్దరూ స్కూటర్‌పైనే ప్రయాణం చేస్తున్నారు. కృష్ణకుమార్ తన తల్లిపై చూపుతున్న ప్రేమను, ఆమెను తీర్థయాత్రలకు తీసుకువెళుతున్న తీరును నాంది ఫౌండేషన్ చైర్మన్ మనో జ్‌కుమార్ తన ట్విట్టర్ ఖాతా ద్వారా వెల్లడించారు. హోటల్లో ఉండేందుకు తగిన డబ్బు లేకపోవడంతో ఆయా మఠాల్లో వీరు విశ్రాంతి తీసుకుంటున్నారు. తన తల్లికి భారతేదేశంలోని మొత్తం పుణ్యక్షేత్రాలను చూపించాలని నిర్ణయించుకున్నాను అని కృష్ణకుమార్ ఈ సందర్భంగా తెలిపాడు. తన తండ్రి చనిపోయేవరకూ ఉమ్మడి కుటుంబంలో తల్లి వంటింటికే పరిమితమైందని తమకోసం ఎన్నో త్యాగాలు చేసిందని తెలి పారు. మనోజ్‌కుమార్ ట్వీట్‌ను చూసిన మహీంద్రా గ్రూప్ సంస్థల చైర్మన్ ఆనంద్ మహీంద్రా తను కృష్ణకుమార్‌కు ఓ కారును బహుమతిగా ఇస్తానని ప్రకటించారు. తనను కృష్ణకుమా ర్ కలిసేలా మనోజ్‌కుమార్ సాయంచేస్తే మహీంద్రా కేయూవీ 100 ఎన్ఎక్స్‌టీ కారు ను కుమార్‌కు బహు మతిగా ఇస్తానని తెలిపారు. తదుపరి యాత్ర ను కృష్ణకుమార్ తల్లితో కలిసి కారులో కొనసాగించవచ్చని ట్వీట్ చేశారు. మహీంద్రా పోస్టుకు గంటల వ్యవధిలోనే వేల లైకులు వచ్చాయి. కాగా సెప్టెంబర్‌లో ఆనంద్ మహీంద్రా కోయంబత్తూరులో ఒక్కో ఇడ్లీ రూపాయికే అమ్ముతున్న మహిళకు సాయం చేయనున్నట్టు ప్రకటించారు.



# జోష్ ఎవరిది?

## నేడే మహారాష్ట్ర, హర్యానా అసెంబ్లీ ఫలితాలు

- మరోసారి ప్రభుత్వ ఏర్పాటుపై మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్ ధీమా
- బీజేపీ – శివసేన కూటమిదే విజయమని వెల్లడి
- బీజేపీకి అంత సీన్ లేదంటున్న ఎన్సీపీ



**ముంబై/ చండీగఢ్:** మహారాష్ట్ర, హర్యానా ఎన్నికల ఫలితాలు నేడు విడుదల కానున్నాయి. సోమవారం పోలింగ్ జరగ్గా..గురువారం కౌంటింగ్ నిర్వహించి ఫలితాలు ప్రకటిస్తారు. మహారాష్ట్రలో కౌంటింగ్ డ్యూటీ కోసం 6.5 లక్షల మంది సిబ్బందిని ఏర్పాటు చేయగా...హర్యానాలో లక్షకు పైగా సిబ్బంది కౌంటింగ్‌లో పాల్గొంటున్నారు. ఉద యం 8 గంటల నుంచి ఓట్లను లెక్కిస్తారు. మహారాష్ట్రలో 288 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ జరగ్గా... ఓట్ల లెక్కింపు కోసం రాష్ట్రవ్యాప్తంగా 96,661 ప్రాంతాల్లో ఏర్పాట్లు చేశారు. హర్యానాలో 90 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు జరగ్గా.. కౌంటింగ్ కోసం ఎన్నికల కమిషన్ భారీగా ఏర్పాట్లు చేసింది. మహారాష్ట్రలో 3237 మంది అభ్యర్థుల భవితవ్యం, హర్యానా లో పోటీకి దిగిన 1169 మంది అభ్యర్థుల భవితవ్యం నేడు తేలిపోనుంది. ఓట్ల లెక్కింపు నేపథ్యంలో కౌంటింగ్ కేంద్రాల వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. రాష్ట్ర పోలీసులతో పాటు పారామిలిటరీ బలగాలు కూడా రంగంలోకి దిగాయి. ఇప్పటికే ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూంల వద్ద సెంట్రల్ పోలీస్,స్టేట్ పోలీస్, జిల్లా పోలీసులు భద్రత కల్పిస్తు న్నారు. సోమవారం పోలింగ్ జరగ్గా.. మహారాష్ట్రలో 61.13 శాతం, హర్యానాలో 68 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు ప్రకటించారు. 2014 ఎన్నికల్లో మహారాష్ట్రలో 63.20 శాతం, హర్యానాలో 76.54 శాతం పోలింగ్ నమోదవ గా.. ఈ సారి రెండు రాష్ట్రాల్లోనూ పోలింగ్ శాతం తగ్గడం గమనార్హం.

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీదే హవా అని ఎగ్జిట్ పోల్స్ ఢంకా బజాయించడంతో కమలదళంలో నూతనోత్సాహం కనిపిస్తోంది. మరోసారి మహారాష్ట్రలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు బీజేపీ తహతహలాడుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ- శివసేన కూటమికి 2/3 వంతు స్థానాలు దక్కుతాయని ముఖ్యమంత్రి దేవేం ద్ర ఫడ్నవీస్ ధీమా వ్యక్తం చేశారు.మహారాష్ట్రలోని మొత్తం 288 అసెంబ్లీ స్థానాల్లో బీజేపీ - శివసేన కూటమి 220 కంటే ఎక్కువ స్థానాలను కైవశం చేసుకుంటుందన్నారు. ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు కూడా తమకే అనుకూలంగా ఉన్నాయన్న ఫడ్నవీస్.. మరోసారి తామే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్నట్లు స్పష్టం చేశారు. గురువారం (నేడు) అసెంబ్లీ ఫలితాలు వెల్లడికానున్న నేపథ్యంలో బీజేపీ నేతలు ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. ఈసారి మహారాష్ట్రలో బీజేపీ ఒంటరిగానే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకునేందుకు అవసరమైనన్ని అసెంబ్లీ స్థానాలను దక్కించుకోవచ్చని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఎవరికెన్ని సీట్లు దక్కుతాయన్న ఉత్కంఠ నెలకొంది.

### బీజేపీకి మా మద్దతు తప్పనిసరి

ఎన్నికల ఫలితాలు విడుదలయ్యే వేళ శివసేన నాయకుడు సంజయ్ రౌత్ కీలక వ్యాఖ్యలు చేశారు. మహారాష్ట్రలో బీజేపీకి సింగిల్‌గా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే సామర్థ్యం లేదని.. తప్పకుండా శివసేన మద్దతు తీసుకోవాల్సిందేనని అన్నారు. బీజేపీ సొంతంగానే ప్రభుత్వాన్ని ఏర్పా టు చేసేన్ని అసెంబ్లీ స్థానాలను కైవశం చేసుకో వచ్చని..కొన్ని సర్వేలు వెల్లడించిన నేపథ్యంలో రౌత్ స్పందిస్తూ.. ఈ వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ 124 స్థానాల్లో పోటీ చేయగా.. కనీసం 100 స్థానాల్లో విజయం సాధిస్తుందని సంజయ్ రౌత్ ధీమా వ్యక్తం చేశారు. మహారాష్ట్రలో మొత్తం 288 అసెంబ్లీ స్థానాలుండగా.. కనీసం 145 స్థానాలు కైవ శం చేసుకున్న పార్టీగానీ, కూటమిగానీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అర్హత కలిగి ఉంటుంది.2014 ఎన్నికల్లో శివసేన 62 స్థానాల్లో విజయం సాధించగా.. బీజేపీ122 స్థానాల్లో విజయం సాధించింది. ఈ రెండు పార్టీలు పరస్పర సహకారంతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి.

### ప్రజలు తిరస్కరిస్తారు..

మహారాష్ట్ర ప్రజలు బీజేపీ- శివసేన కూటమిని ఈ సారి తిరస్కరిస్తారని ఎన్సీపీ చీఫ్ జయంత్ పాటిల్ పేర్కొన్నారు. బీజేపీ ఐదేళ్ల పాలనపై ప్రజలు విసిరిపోయారని..అన్ని రకాలుగా కూటమి ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. వ్యవసాయ సంక్షోభాన్ని నివారించడంలో ఫడ్నవీస్ విఫలమయ్యారని.. గ్రామీణ ప్రాంతాల్లో కరవు తాండవిస్తున్నా పట్టించుకోలేదని ఆరోపించారు. ప్రభుత్వం రైతులకు భరోసా ఇవ్వకపోవడం వల్లే రాష్ట్రంలో 16 వేల అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకున్నారని అన్నారు. తాము ఎగ్జిట్ పోల్స్ నెంబర్ గేమ్‌పై ఆధారపడబోమని.. ఎన్నికల్లో ఎన్సీపీ- కాంగ్రెస్ కూటమిదే విజయమని ధీమా వ్యక్తం చేశారు. ఏఐసీసీ జనరల్ సెక్రటరీ అవినాశ్ పాండే మాట్లాడుతూ.. ఫడ్నవీస్ మరోసారి అధికారంలోకి వచ్చే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. మహారాష్ట్ర ప్రజలిచ్చిన అవకాశాన్ని ఫడ్నవీస్ వినియోగించుకోలేదని విమర్శించారు.సోమవారం నాటి పోలింగ్ పూర్తి వివరాలను ఎన్నికల సంఘం మంగళవారం వెల్లడించింది. ఈసారి మహారాష్ట్రలో 60.5 శాతం పోలింగ్ నమోదైనట్లు ఈసీ స్పష్టం చేసింది. ముంబైలో గతంలో కంటే పోలింగ్ శాతం కూడా తగ్గినట్లు తెలియజేసింది.



### డీకేను కలిసిన సోనియా

కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ బుధవారం ఉదయం కర్ణాటక కాంగ్రెస్ సీనియర్ నేత శివకుమా ర్‌ను కలిశారు. ఆయన క్షేమ సమాచా రాన్ని అడిగి తెలుసుకున్నారు. సోనియా తోపాటు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అంబికా సోనీ కూడా శివకుమార్‌ను కలిశారని కాంగ్రెస్ నేతలు తెలిపారు. కర్ణాటక కాంగ్రెస్‌లో కీలకమైన శివకు మార్‌కు కష్టకాలంలోపార్టీగా నిలుస్తుందని సోని యా ఆయనకు హామీ ఇచ్చారని కాంగ్రెస్ వర్గా లు తెలిపాయి. కాగా గత నెలలో సోనియా మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌తో కలిసి అదే జైలులో ఉన్న చిదంబరాన్ని పరామర్శించారు.

# కట్టు తప్పొద్దు.. పరువు తీయొద్దు

- నేతల వ్యవహార శైలిపై కాంగ్రెస్ అధినేత్రి అసహనం
- ఒకే అంశంపై పార్టీ నేతల్లో భిన్నాభిప్రాయాలపై ఆగ్రహం
- 370 రద్దుపై కూడా సరిగ్గా వ్యవహరించలేదన్న అభిప్రాయం
- రేపు కీలక నేతలతో సోనియా గాంధీ మేధో మథనం



**న్యూఢిల్లీ:** కట్టుతప్పుతున్న పార్టీ నేతలను దారిలోకి తెచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియా గాంధీ రంగంలోకి దిగారు. విధాన పరమైన అంశాల్లో ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టడంలో పార్టీ నేతలు ఏకతాటిపైకి రాలేకపోవడాన్ని తీవ్రంగా పరిగణించిన సోనియా.. ఈనెల 25న (రేపు) పార్టీ కీలక నేతలతో ఢిల్లీ 10 జనపథ్‌లోని తన నివాసంలో మేథోమథనం జరపాలని నిర్ణయించారు. కొంతమంది నేతలు పార్టీ సిద్ధాంతాలను పక్కనబెట్టి.. భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో సోనియా ఈ నిర్ణయం తీసుకున్నారు. దీర్ఘకాలిక, స్వల్ప కాలిక సమస్యలకు చెక్ పెట్టి పార్టీ శ్రేయస్సు సంబంధించిన విధానపరమైన నిర్ణయాలు తీసుకునేందుకు సోనియా ఈ భేటీ నిర్వహిస్తున్నట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. ఈ సమావేశానికి కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ, మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్, సీనియర్ నాయకులు కపిల్ సిబల్, మల్లికార్జున ఖర్గే, గులాంనబీ ఆజాద్, అహ్మద్ పటేల్,జ్యోతిరాధిత్య సింధియా మొదలైన నేతలు హాజరుకానున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో బీజేపీని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అవసరమైన సమగ్ర విధానాలతో నాయకులు సిద్ధంగా లేకపోవడాన్ని ఆక్షేపించిన సోనియా.. ఆయా నాయకులు వారివారి సొంత నియోజక వర్గాల్లో సైతం ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టలేక తడబడటం పార్టీ ప్రతిష్టకు భంగం కలిగిస్తోందని అభిప్రాయపడ్డట్లు సమాచారం. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం జమ్ము కాశ్మీర్‌లో ఆర్టికల్ 370 ని రద్దు చేయడాన్ని ఏకపక్షంగా తప్పుబట్టాల్సింది పోయి కొంతమంది నాయకుల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవడంపై సోనియా ఆగ్రహంగా ఉన్నట్లు తెలుస్తోంది. రాజ్యసభలో కాశ్మీర్ అంశంపై చర్చ సందర్భంగా పార్టీ సీనయర్ నాయకులు గులాంనబీ ఆజాద్, చిదంబరం ప్రభుత్వాన్ని తప్పుబడుతుంటే.. లోక్‌సభలోని కాంగ్రెస్ నేతలు ఆర్టికల్ 370 రద్దుకు మద్దతు పలకడమేంటని సోనియా అసహనం వ్యక్తం చేసినట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. ఈనేపథ్యంలో పార్టీలోని మేధావులతో కీలక, విధానపరమైన అంశాలపై చర్చించి ఓ నిర్ణయానికి రావాలని సోనియా అభిప్రాయపడినట్లు సమాచారం. ఇక ఇటీవల మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచార సమయంలోనూ బీజేపీ.. హిందుత్వ ఐడియాలజిస్ట్ వీడీ సావార్కర్‌కు భారత రత్న ఇవ్వాలని డిమాండ్ చేయగా.. కాంగ్రెస్ నేత మనిశ్ తివారి ప్రదర్శించిన అత్యుత్సాహంపై సోనియా ఆగ్రహంగా ఉన్నట్లు తెలుస్తోంది. ముంబైలో నిర్వహించిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మాట్లాడుతూ.. వీడీ సావార్కర్‌కు భారత రత్న ఇవ్వాలన్న అంశాన్ని కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకించడం లేదని వ్యాఖ్యానించారు.అలాగ్ ఆర్టికల్ 370 రద్దు విషయంలోనూ సానుకూల వైఖరిని ప్రదర్శించినట్లుగా మాట్లాడారు. కాశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దుకు ముందు అనేక రకాల చర్చలు జరగాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఇలాంటి వ్యవహారశైలిపై సోనియా తీవ్ర అసహనంతో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. రేపు జరిగే మేథోమథన భేటీలో ఇలాంటి అంశాలన్నింటినీ ప్రస్తావించి భవిష్యత్‌లో వ్యవహరించాల్సిన తీరుపై చర్చించనున్నట్లు సమాచారం.

### ఫలితాల తర్వాతి రోజే ఇన్‌చార్జిలతో భేటీ

మహారాష్ట్ర, హర్యానా ఎన్నికల ఫలితాలు ఈనెల 24న వెలువడనుండటంతో ఆ తర్వాతి రోజే కాంగ్రెస్ అధినేత్రి సోనియా ..పార్టీ జనరల్ సెక్రటరీలు, రాష్ట్రాల ఇన్ చార్జీలతో భేటీకానున్నారు. ఫలితాలపై విశ్లేషణలో భాగంగానే ఈ భేటీ నిర్వహించనున్నట్లు సమాచారం. కాంగ్రెస్ పార్టీకి ఆశించినన్ని స్థానాలు దక్కకపోవచ్చని ఎగ్జిట్ పోల్స్ సర్వేల్లో తేలడంతో.. ఫలితాల సరళిని పరిశీలించిన తర్వాత.. వెనువెంటనే పార్టీ నేతలతో కారణాల అన్వేషణపై సోనియా చర్చించనున్నట్లు తెలుస్తోంది. ఎగ్జిట్ పోల్స్ ఫలితాలను కాంగ్రెస్ పార్టీ ఖండించినప్పటికీ.. హర్యానా, మహారాష్ట్రలో పార్టీ పరిస్థితిపై కూడా సోనియా ఆరా తీయనున్నట్లు ప్రచారం జరుగుతోంది.

### ఎన్నికల ఫలితాలపై చర్చల బహిష్కరణ

ఎన్నికల ఫలితాలపై కాంగ్రెస్ పార్టీ నేతలు, అధికార ప్రతినిధులు న్యూస్ ఛానల్స్ లో జరిగే డిబేట్‌లలో పాల్గొనవద్దని అధినాయకత్వం నిర్ణయించింది. అయితే ఫలితాలపై ప్యానల్ డిస్కర్షన్ లో పాల్గొనకుండా సింగిల్ ఇంటర్వ్యూలు మాత్రం ఇవ్వవచ్చని స్పష్టం చేసింది. మహారాష్ట్ర, హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఆశించిన స్థాయిలో స్థానాలు దక్కకపోవచ్చని పలు ఛానళ్లు, సర్వే సంస్థలు వెలువరించడంతో కాంగ్రెస్ అధినాయకత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. సాధారణ ఎన్నికల్లో ఘోర పరాభవాన్ని చవిచూసిన కాంగ్రెస్ పార్టీ..ప్రస్తుతం ఏ ఛానళ్లో చూసినా ఇండియా - పాకిస్థాన్ ఒప్పందాలు, మతతత్వం వంటి వాటిపై చర్చలు జరుగుతున్న నేపథ్యంలోనూ ఈ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది.

# రైతులకు కేంద్రం మద్దతు

- రబీ పంటలకు మద్దతు ధర పెంపు
- గోధుమలు, బార్లీకి రూ. 85, పప్పు ధాన్యాలకు రూ. 325 పెంపు
- బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్ సంస్థల విలీనానికి ఆమోదం
- కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు

**న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ:** రైతులకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. రబీ పంటలకు మద్దతు ధరలు పెంచుతూ కేంద్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. గోధుమలకు క్వింటాలుకు 85 రూపాయలు పెంచుతూ 1,925 రూపాయలుగా నిర్ణయించింది. అలాగే పప్పు ధాన్యాల ధరలను క్వింటాలుకు 325 రూపాయలు పెంచింది. బుధవా రం ప్రధానమంత్రి నరేంద్రమోడీ అధ్యక్షతన సమా వేశమైన కేంద్ర మంత్రివర్గం పలు కీలక నిర్ణయాలకు ఆమోదముద్ర వేసింది. రైతుల ఆదాయాన్ని రెండింతలు చేసే క్రమంలో భాగంగా పంటలకు మద్దతు ధరలు పెంచుతూ కేంద్రం నిర్ణయం తీసు కుంది. ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ నిర్ణయం మేరకు ధరలను పెంచారు. ఈ ధరలు రబీ సీజన్లో వచ్చే పంటలకు అమలవుతాయి. సీఏసీపీ సిఫారసులకు అనుగుణంగా ఈ మద్దతు ధరలను పెంచుతూ కేంద్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. వచ్చే ఏప్రిల్‌లో రానున్న దిగుబడులకు ధరలు వర్తింపచేస్తారు. ప్రభుత్వ రంగ సంస్థ బీఎస్ఎన్ఎల్‌లో బలోపేతం చేసేందుకు కేంద్ర మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుంది. బీఎస్ఎన్ఎల్‌లో ఎంటీఎన్ఎల్ విలీనం చేసేందుకు సూత్రప్రాయంగా ఆమోదం తెలిపింది.



అలాగే బిఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్‌కు 4జి స్పెక్ట్రమ్ అందజేయాలని నిర్ణయించింది. బీఎస్ఎన్ఎల్ వినియోగదారులకు బ్రాడ్బ్యాండ్ డేటా సర్వీసులను ఇచ్చేందుకు 4జిని అందుబాటులోకి తీసుకురానున్నారు.

### ఢిల్లీలో కాలనీల క్రమబద్ధీకరణ

ఢిల్లీలో అనధికారిక కాలనీలో ఉన్న ఇళ్లను క్రమబద్ధీకరిం చేందుకు కేంద్ర మంత్రి వర్గం నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయంతో సుమారు 40 లక్షల మందికి ప్రయోజనం కలగనుంది. 1 797 అనధికారిక కాలనీలను క్రమబద్ధీకరించేందుకు గుర్తిస్తూ కేంద్ర మంత్రివర్గం ఆమోద ముద్ర వేసింది. దీని కారణంగా అనధికారిక కాలనీలోని ఇళ్లకు ఆస్తి హక్కుతో పాటు క్రయవిక్రయాలకు వీలు కలుగుతుంది. ప్రభుత్వ సంస్థలు పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు అవకాశం కలుగుతుంది. నామమాత్రపు చార్జీతో ఇళ్లను క్రమబద్ధీకరిస్తారు.

**మద్దతు ధరలు పెంపు ఇలా..**

| పంటలు | క్వింటాకు. |
|---|---|
| గోధుమ-బార్లీ | రూ. 85 |
| పప్పు ధాన్యాలు | రూ. 325 |
| శనగలు | రూ. 250 |
| నూనె గింజలు | రూ. 225 |
| పొద్దు తిరుగుడు | రూ. 225 |

## బేదాభిప్రాయంతోనే హింస..!



**న్యూఢిల్లీ:** దేశంలో రోజురోజు కూ పెరిగిపోతున్న హింసాత్మక ఘటనలపై మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల్లోపెరిగిపోతున్న బేధాభిప్రాయల వల్లే హింసకు కారణమౌ తుందన్నారు. ఒక భాష, ఒక మతం, ఒక ప్రాంతం, ఒక శత్రువు అనే భావనలో భారత జాతీయత లేదని, భారత ఆత్మ బహుళమైం దని, విశ్వవ్యాపితమైందని అభిప్రాయపడ్డారు. అస్సాంలోని గుహవాటిలోని నార్త్ ఈస్ట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీస్ ఆవిర్భావ దినోత్సవానికి నేరుగా హాజరుకాకపోయినా.. ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రణబ్ భాగస్వా ములై ప్రసంగించారు. ప్రతీసారి ఓ వ్యక్తిగానీ, పిల్లాడు కానీ ఒక మహిళ కానీ దాడికి గురైనప్పుడు భారత ఆత్మ గాయపడుతుందన్నారు. 'భారత సమాజంలో సహ నం' అనే అంశంపై ప్రణబ్ ఈ విధంగా ఉద్వేగంతో ప్రసంగించారు.



బీసీసీఐ అధ్యక్షుడు గంగూలీతో హెచ్‌సీఏ అధ్యక్షుడు అజర్

# దాదా కొత్త ఇన్నింగ్స్

**భారత క్రికెట్‌కు దూకుడు నేర్పిన టీమిండియా మాజీ కెప్టెన్ బెంగాల్ టైగర్ సౌరభ్ గంగూలీ బీసీసీఐ అత్యున్నత పదవిని చేపట్టాడు. అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన దాదా బుధవారం ముంబైలోని బీసీసీఐ ప్రధాన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించాడు. భారత జట్టుకు కెప్టెన్‌గా అత్యుత్తమ సేవలు అందించిన గంగూలీ 39వ అధ్యక్షుడిగా కొత్త ఇన్నింగ్స్ ఆరంభించాడు. దాదా టీమ్‌లో సభ్యులుగా మహిమ్‌వర్మ (ఉపాధ్యక్షుడు), జయ్‌షా (కార్యదర్శి), జయేష్ జార్జి (సంయుక్త కార్యదర్శి), అరుణ్‌సింగ్ ధుమాల్ (కోశాధికారి) ఎన్నికయ్యారు.**



బీసీసీఐ సర్వసభ్య సమావేశానికి వస్తున్న మాజీ అధ్యక్షుడు శ్రీనివాసన్, కార్యదర్శి జయ్ షా

## బీసీసీఐ నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన గంగూలీ

**ముంబై:** టీమిండియా మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీ భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. బుధవారం ముంబైలోని బీసీసీఐ ప్రధాన కార్యలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో గంగూలీ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించారు. దీంతో 33 నెలలపాటు బీసీసీఐని నడిపించిన సుప్రీంకోర్టు నియమించిన పాలక మండలి బాధ్యతల నుంచి వైదొలగింది. టీమిండియా కెప్టెన్‌గా అత్యుత్తమ సేవలు అందించిన గంగూలీ ఇప్పుడు 39వ అధ్యక్షుడిగా కొత్త ఇన్నింగ్స్‌ను ఆరంభించనున్నాడు. ఇక ఈ కీలక పదవిలో కొద్ది కాలమే పనిచేయనున్న దాదా బీసీసీఐ దశదిశ కూడా మార్చు తానని హామీ ఇచ్చాడు. టీమిండియా మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ రిటైర్మెంట్‌పై కూడా సౌరభ్ స్పందించారు. ఈ అంశంపై సెలక్టర్‌తో చర్చించిన తర్వాత, అతనితో మాట్లాడతానని దాదా చెప్పాడు. భారత కెప్టెన్ విరాట్ కోహ్లీ, కోచ్ రవిశాస్త్రితో నేడు సమావేశం కానున్నట్లు తెలిపాడు. గంగూలీ నూతన కార్యవర్గంలో మహిమ్ వర్మ (ఉపాధ్యక్షుడు), కార్యదర్శిగా కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా తనయుడు జయ్ షా, జయేష్ జార్జ్ (సంయుక్త కార్యదర్శి), అరుణ్ సింగ్ ధుమాల్ (కోశాధికారి)గా బాధ్యతలు చేపట్టారు. అందరూ ఏకగ్రీవంగా ఎన్నిక కావడంతో ఎన్నికలు నిర్వహించలేదు.

### అత్యుత్తమ క్రికెటర్..

టీమిండియా క్రికెట్ చరిత్రలో మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీది కూడా ప్రత్యేక స్థానం ఉంది. బెంగాల్ టైగర్‌గా పేరొందిన దాదా భారత క్రికెట్‌లో మంచి రికార్డు సాధించాడు. 2000 దశకంలో టీమిండియా కష్టాల్లో ఉన్న సమయంలో సారథ్య బాధ్యతలు చేపట్టిన గంగూలీ విజయవంతంగా భారత జట్టును నడిపించాడు. ఎడమచేతి వాటం బ్యాట్స్‌మన్ గంగూలీ ఓపెనర్‌గా భారత్‌కు ఎన్నో చిరస్మరణీయ ఆరంభాలు అందించారు. భారత్ తరఫున 113 టెస్టులు ఆడిన గంగూలీ 42.17 సగటుతో 7,212 పరుగులు సాధించాడు. వన్డేలలో 311 మ్యాచ్‌లు ఆడిన దాదా 41.02 సగటుతో 11,363 పరుగులు చేశాడు. ఇక ఫస్ట్‌క్లాస్, లీస్ట్ ఏ క్రికెట్‌లోనూ గంగూలీకి మంచి రికార్డు ఉంది. ఓవరాల్‌గా టీమిండియాలో విజయవంతమైన కెప్టెన్, క్రికెటర్‌గా బాధ్యతలు చేపట్టిన గంగూలీ ఇప్పుడు బీసీసీఐ అధ్యక్షుడిగా కొత్త ఇన్నింగ్స్ ఆడనున్నాడు.

### 65 ఏళ్ల తర్వాత..

బీసీసీఐ చరిత్రలో దాదా ఎంపిక కొత్త అధ్యాయాన్ని లిఖించింది. ఓ క్రికెటర్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టడం ఇది రెండవసారి. దాదాపు 65 ఏళ్ల తర్వాత గంగూలీ ఈ అరుదైన ఘనతను సాధించాడు. అయితే భారత క్రికెట్ బోర్డు పగ్గాలు చేపట్టిన రెండవ క్రికెటర్‌గా గంగూలీ ఘనత సాధించారు. దాదా కంటే ముందు 1954-56 మధ్య కాలంలో మహరాజా ఆఫ్ విజయనగరం (పూసపాటి విజయానందర గజపతి రాజు) బీసీసీఐ అధ్యక్షుడిగా వ్యవహరించారు. దిగ్గజ క్రికెటర్లు గవాస్కర్, శివలాల్ యాదవ్ తాత్కాలిక అధ్యక్షులుగా కొద్ది కాలం వ్యవహరించారు. గంగూలీ పూర్తి స్థాయిలో అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.

### 10 నెలలు మాత్రమే..

బీసీసీఐ నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన గంగూలీ పది నెలలు మాత్రమే ఈ పదవిలో కొనసాగనున్నాడు. అయితే అయిదేళ్లకు పైగా కోల్‌కతా క్రికెట్ బోర్డు (క్యాబ్) అధ్యక్షుడిగా పని చేసిన దాదా.. లోధా కమిటీ తప్పనిసరి నిబంధన కారణంగా మూడేళ్ల విరామం తీసుకోవాల్సి ఉంది. తర్వాత మళ్లీ అధ్యక్ష ఎన్నికల్లో పాల్గొనవచ్చు. వచ్చే ఏడాది సెప్టెంబర్‌తో బీసీసీఐ అధ్యక్షుడిగా గంగూలీ పదవీకాలం ముగియనుంది.

### ధోనీతో చర్చిస్తాం..

టీమిండియాలో మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీకి ప్రత్యేకమైన స్థానం ఉందని గంగూలీ అన్నారు. భారత్‌కు ఎన్నో చిరస్మరణీయ విజయాలు అందించిన మేటి క్రికెటర్ ధోనీ. రెండు ప్రపంచకప్‌లు అందించిన ఘనత అతనిదే. ధోనీ హయాంలో భారత క్రికెట్ జట్టు ఉన్నత స్థాయికి చేరింది. ఇప్పు డు అతని రిటైర్మెంట్ గురించి ఇంకా మాట్లడలేదు. ముందు సెలక్టర్లతో సమావేశమై.. తర్వాత ధోనీతో రిటైర్మెంట్ గురించి మాట్లాడుతానని దాదా పేర్కొన్నారు.

### ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌ను మెరుగు పరుస్తాం..

ప్రస్తుతం దేశవాళీ ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌పైనే దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఇక్కడ ప్రతిభావంతులైన క్రికెటర్లు చాలా మంది ఉన్నారు. యువ క్రికెటర్లు అద్భుతమైన ప్రదర్శనతో సత్తా చాటుతున్నారు. జాతీయ జట్టులో గట్టి పోటీ ఉండడంతో వారికి త్వరగా చోటు దక్కడం లేదు. దీంతో ప్రతిభకు మరింత మెరుగుపెట్టే పనిలో నిమగ్న మవుతున్నారు. అంతర్జాతీయ క్రికెట్‌లో నిలకడగా రాణించేందుకు ఇదెంతో దోహదం చేస్తుంది. ఫస్ట్‌క్లాస్ క్రికెటర్ల సంక్షేమానికి, వసతుల కల్పనకు చర్యలు చేపడతాం. దేశవాళీ క్రికెట్‌ను అత్యుత్తమంగా తీర్చి దిద్దేం దుకు కృషి చేస్తానని దాదా భరోసా ఇచ్చాడు.





సహచరులతో..

### కోహ్లీకి ఫుల్ సపోర్ట్

భారత కెప్టెన్ విరాట్ కోహ్లీకి అన్ని విధాలా మద్దతు ఇస్తామని బీసీసీఐ నూతన అధ్యక్షుడు గంగూలీ స్పష్టం చేశాడు. అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం బీసీసీఐ అధ్యక్షుడి హోదాలో తొలిసారి మీడియాతో మాట్లాడారు. బీసీసీఐ అధ్యక్షుడిగా బాధ్య తలు చేపట్టడాన్ని గౌరవంగా భావిస్తున్నా. విధి నిర్వహణలో ఎటువంటి లోపం ఉండదు. బోర్డులో అవినీతికి, అశ్రి త పక్షపాతానికి తావులేకుండా వ్యవహరిస్తా. బీసీసీఐ ప్రతిష్టను పెంచేలా కృషిచేస్తా. అందరికీ బోర్డు ఒకేలా ఉంటుంది. నేను టీమిండియాకు కెప్టెన్‌గా వ్యవహరించిన తరహాలోనే బీసీసీఐని కూడా సమర్థవంతంగా ముందుకు నడిపిస్తా. ప్రస్తుతం టీమిండియా అత్యుత్తమ ప్రదర్శనలు చేస్తుండటం మంచి పరిణామం. భారత విజయాల్లో ముఖ్య భూమిక వహిస్తోంది కెప్టెన్ విరాట్ కోహ్లీనే. అత్యుత్తమ నాయకుడిగా జట్టును ముందుకు నడిపిస్తున్నాడు. వర్తమాన భారత క్రికెట్‌లో కోహ్లీనే కీలక ప్లేయర్. అతని సారథ్యంలో టీమిండియా అన్ని ఫార్మాట్‌లలో అద్భుతంగా రాణిస్తోంది. భారత జట్టును సుదీర్ఘకాలం మేటి జట్టుగా నిలపాలన్నదే కోహ్లీ తాపత్రయం. ఈ విషయంలో అతడికి అన్ని విధాల మద్దతిస్తాం. అందుకే గురువారం కోహ్లీతో సమావేశమవుతా. టీమిండియాకు కావాల్సిన అన్ని సధుపాయాలను సమకూరుస్తాం. కోహ్లీతో చర్చలు జరిపి జట్టును ఇంకా పటిష్టం చేస్తానని గంగూలీ పేర్కొన్నాడు. ఆటగాళ్ల ఎంపిక పూర్తిగా సెలక్షన్ కమిటీ ఆధ్వర్యంలోనే జరుగుతుంది. ఇప్పుడే వాటి గురించి చర్చించాల్సిన అవసరం లేదు. ప్రస్తుతం టీమిండియా మంచి ప్రదర్శనలు చేస్తున్నందున, వాటి గురించి ప్రస్తావించక పోవడమే మంచిదని దాదా వ్యాఖ్యానించాడు.



### ఒక్కొక్కరికి 3.5 కోట్లు

33 నెలల పాటు బీసీసీఐని నడిపించిన సుప్రీం కోర్టు నియమిత పాలక మండలి బాధ్యతలు ముగిశాయి. నిన్నటి దాకా ఈ కమిటీ లో వినోద్ రాయ్, డయానా ఎడుల్జీ సభ్యులుగా పనిచేశారు. వీరికి ఒక్కొక్కరికి 3.5 కోట్ల రూపాయలను చెల్లించాలని బీసీసీఐ నిర్ణయించింది.

### మూడో భారత బ్యాట్స్‌మన్‌గా రోహిత్

**దుబాయ్:** ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్‌లో టీమిండియా ఓపెనర్ రోహిత్ శర్మ దుమ్మురేపాడు. సౌతాఫ్రికాతో జరిగిన మూడు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో పరుగుల వరద పారించిన హిట్‌మాన్ రోహిత్.. ఏకంగా 12 స్థానాలు ఎగబాకి 10వ ర్యాంక్‌కు చేరుకున్నాడు. ఈ సిరీస్‌లో తొలిసారి ఓపెనర్‌గా బరిలోకి దిగిన రోహిత్ అందరి అంచనాలను తారుమారు చేస్తు ధనాధన్ పరుగులు సాధించాడు. మూడు టెస్టుల్లో నాలుగు ఇన్నింగ్స్‌లు బ్యాటింగ్ చేసిన రోహిత్ 529 పరుగులు చేసి ప్లేయర్ ఆఫ్ ది టోర్నీగా నిలిచాడు. రెండు శతకాలతో పాటు ఒక డబుల్ సెంచరీ సాధించి భారత్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఇక టాప్ 10లో చోటు దక్కించుకున్న రోహిత్ మరో ఘనతను సొంతం చేసుకున్నాడు. టీమిండియా తరఫున (టెస్టు, వన్డే, టి20) మూడు ఫార్మాట్‌లలో టాప్ 10లో చోటు సాధించిన మూడో బ్యాట్స్‌మన్‌గా హిట్‌మ్యాన్ రోహిత్ రికార్డు సృష్టించాడు. రోహిత్ కంటే ముందు విరాట్ కోహ్లీ, గౌతమ్ గంభీర్‌లు ఈ ఘనతను సాధించారు. వీరు కూడా మూడు ఫార్మాట్‌లలో ఐసీసీ టాప్ -10 ర్యాంక్‌లను సొంతం చేసుకున్నారు. ఈ సిరీస్‌లో డబుల్ సెంచరీ బాదిన కెప్టెన్ కోహ్లీ రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. ఆసీస్ బ్యాట్స్‌మన్ స్టీవ్ స్మిత్ టెస్టుల్లో టాప్ ర్యాంక్‌లో ఉన్నాడు.

మరోవైపు చతేశ్వర్ పుజారా 4వ ర్యాంక్‌లో నిలవగా.. టీమిండియా టెస్టు వైస్ కెప్టెన్ అజింక్య రహానె కెరీర్ బెస్ట్ 5వ ర్యాంక్‌ను అందుకున్నాడు. మరో ఓపెనర్ మయాంక్ అగర్వాల్ 18వ ర్యాంక్‌కు చేరుకున్నాడు. ఇక బౌలింగ్ విభాగంలో జస్ప్రీత్ బుమ్రా 4వ స్థానంలో నిలవగా.. అశ్విన్ 10 ర్యాంక్‌లు ఉన్నాడు. రవీంద్ర జడేజా 14వ, షమీ 15వ స్థానంలో నిలిచారు.





## శ్రీకాంత్, కశ్యప్ ఓటమి

### తొలి రౌండ్‌లోనే ఇంటికి.. ఫ్రెంచ్ ఓపెన్

**పారిస్:** భారత స్టార్ షట్లర్లు కిదాంబి శ్రీకాంత్, పారుపల్లి కశ్యప్‌లు మరోసారి నిరాశ పరిచారు. పారిస్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ తొలి రౌండ్‌లోనే వీరు ఇంటి ముఖం పట్టారు. బుధవారం ఇక్కడ జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో కిదాంబి శ్రీకాంత్ 21-15, 7-21, 14-21తో రెండో సీడ్ చైనీస్ తైపి క్రీడాకారుడు చౌ తీన్ చెన్ చేతిలో ఓటమిపాలై టోర్నీ నుంచి నిష్క్రమించాడు.

తొలి గేమ్‌ను సునాయాసంగా గెలుచుకున్న శ్రీకాంత్ తర్వాతి గేమ్‌లలో ప్రత్యర్థికి పోటీ ఇవ్వలేక పోయాడు. చివరి గేమ్‌లలో రెండో సీడ్ జోరును ప్రదర్శించడంతో శ్రీకాంత్‌కు ఓటమి తప్పలేదు. ఈ సీజన్‌లో శ్రీకాంత్ వరుసగా విఫలమవుతున్నాడు. తొలి రెండు గేమ్‌లను దాటడం కూడా కిదాంబికి భారంగా మారింది. మరో మ్యాచ్‌లో పారుపల్లి కశ్యప్ 11-21, 9-21తో లాంగ్ అంగుస్ (హాంగ్‌కాంగ్) చేతిలో ఓడి మొదటి రౌండ్‌లోనే ఇంటి దారి పట్టాడు. ప్రత్యర్థికి ఎలాంటి పోటీ ఇవ్వకుండానే కశ్యప్ చేతులు ఎత్తేశాడు. మరో మ్యాచ్‌లో సమీర్ వర్మ 22-20, 18-21, 18-21తో జపాన్ స్టార్ కెంటా నిషిమోటో చేతిలో పోరాడి ఓడాడు. తొలి గేమ్‌ను టై బ్రేకర్‌లో గెలుచుకున్న సమీర్ తర్వాతి గేమ్‌లలోనూ చివరి వరకు పోరాడినా ఫలితం లేకుండా పోయింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో ప్రణవ్ జెర్రి చోప్రా-సిక్కి రెడ్డి జోడీ 13-21, 18-21తో క్రిస్ అడ్‌కాక్-గాబిరెల్లె అడ్‌కాక్ (ఇంగ్లండ్) ద్వయం చేతిలో ఓడింది.

## ఫైనల్లో కర్ణాటక-తమిళనాడు

### సెమీస్‌లో ఓడిన గుజరాత్, చత్తీస్‌గఢ్.. విజయ్ హజారె ట్రోఫీ

**బెంగళూరు:** దేశావాళి ప్రముఖ వన్డే టోర్నీ విజయ్ హజారె ట్రోఫీ ఫైనల్లో కర్ణాటక, తమిళనాడులు చేరుకున్నాయి. బుధవారం జరిగిన సెమీస్ పోటీల్లో కర్ణాటక 9 వికెట్లతో చత్తిస్‌గఢ్‌ను చిత్తు చేయగా.. గుజరాత్‌పై 5 వికెట్లతో తమిళనాడు గెలిచింది. బెంగళూరులోని చిన్న స్వామి క్రికెట్ స్టేడియంలో శుక్రవారం జరిగే ఫైనల్లో కర్ణాటక, తమిళనాడులు అమీతుమీ తేల్చుకోనున్నారు.

### రాణించిన పాడికల్, కెఎల్ రాహుల్..

చత్తిస్‌గఢ్ నిర్దేశించిన 224 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన కర్ణాటకకు ఓపెనర్లు, కెఎల్ రాహుల్ (88 నాటౌట్; 111 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్), దేవ్‌దత్ పాడికల్ (92; 98 బంతుల్లో 7ఫోర్లు, 3 సిక్స్‌లు) శుభారంభాన్ని అందించారు. ఆరంభం నుంచే చెలరేగి ఆడిన వీరిద్దరూ చత్తీస్‌గఢ్ బౌలర్లపై విరుచుకపడి స్కోరుబోర్డును ముందుకు సాగించారు. వీరు తొలి వికెట్‌కు కీలకమైన 155 పరుగుల భాగస్వామ్యాన్ని ఏర్పర్చిన తర్వాత అజయ్ మండల్ ఈ జోడీని విడదీశాడు. దీంతో పాడికల్ మొదటి వికెట్‌గా వెనుదిరిగాడు. తర్వాత క్రీజులోకి వచ్చిన మయాంక్ అగర్వాల్ విధ్వంసకర బ్యాటింగ్‌తో ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడ్డాడు. ఫోర్లు, సిక్సర్లతో పరుగుల వరద పారించాడు. ఇతని ధాటికి కర్ణాటక 40 ఓవర్లలోనే కేవలం ఒక వికెట్ కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. టెస్టు సిరీస్‌లో చెలరేగి మయాంక్ విజయ్ హజారెలోనూ సత్తా చాటుకున్నాడు. చివరి వరకు అజేయంగా ఉన్నా మయాంక్ 33 బంతుల్లోనే 3 ఫోర్లు, 4 సిక్స్‌లతో 47 పరుగులు చేశాడు. మరోవైప ు బాధ్యతగా ఆడిన రాహుల్ కూడా (88) పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. ఫలితంగా కర్ణాటక 229/1 స్కోరు సాధించి 9 వికెట్ల ఘన విజయాన్ని అందుకుంది. అంతకుముందు బ్యాటింగ్ చేసిన చత్తీస్‌గఢ్ కౌశిక్ (4/46) ధాటికి 49.4 ఓవర్లలో 223 పరుగులకు ఆలౌటైంది. చత్తీస్‌గఢ్‌లో అమన్‌దీప్ ఖారె (78), సుమిత్ (40) మినహా మిగతా బ్యాట్స్‌మెన్ పరుగులు చేయడంలో విఫలమయ్యారు. కౌశిక్ 4 వికెట్లతో విజృంభించగా.. అభిమన్యు మిథున్, క్రిష్ణప్ప గౌతమ్, ప్రవీన్ దూబెలు తలో రెండు వికెట్లు పడగొట్టారు.



### షారూఖ్ విధ్వంసం..

ఇక్కడ జరిగిన మరో సెమీస్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన గుజరాత్ నిర్ణీత 40 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 177 పరుగులు చేసింది. వర్షం కారణంగా మ్యాచ్‌ను 40 ఓవర్లకు కుదించారు. గుజరాత్ బ్యాట్స్‌మెన్‌లో ధృవ్ రవాల్ (40), అక్షర్ పటేల్ (37) రాణించినా వీరికి ఇతర ఆటగాళ్ల నుంచి మద్దతు లభించక పోయింది. దీంతో గుజరాత్ నిర్ణీత ఓవర్లో 177/9 స్కోరే సాధించగలిగింది.

అనంతరం లక్ష్యఛేదనకు దిగిన తమిళనాడులో మురళీ విజయ్ (3), బాబా అపరజీత్ (6), విజయ్ శంకర్ (6) నిరాశ పరిచినా.. ఓపెనర్ అభిమన్యు ముకుంద్ 32, కెప్టెన్ దినేశ్ కార్తిక్ (47; 47 బంతుల్లో 5 ఫోర్లు) తమిళ్‌నాడు ఇన్నింగ్స్‌ను ఆదుకున్నారు. అనంతరం వీరిద్దరూ వెనుదిరిగిన తర్వాత షారూఖ్ ఖాన్ (56 నాటౌట్? 46 బంతులల్లోనే 3 ఫోర్లు, 3 సిక్సర్లు) విధ్వంసకర బ్యాటింగ్‌తో తమ జట్టును విజయతీరాలకు చేర్చాడు. ఇతనికి అండగా ఉన్న వాషింగ్టన్ సుందర్ (27) పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. దీంతో తమిళనాడు మరో ఓవర్ మిగిలి ఉండగానే (39 ఓవర్లు) 181/5 స్కోరును సాధించి ఐదు వికెట్ల విజయాన్ని అందుకుంది. శుక్రవారం జరిగే ఫైనల్ పోరులో కర్ణాటకతో తలపడేందుకు తమిళనాడు సిద్ధమైంది.

Vaccum Therapy లింగవర్ధక యంత్రం
లింగం చిన్నదని నిరాశ ఎందుకు?
అమెరికా ఏజెన్సీ FDA వారి అభిప్రాయం ప్రకారం Vaccum Therapy లింగవర్ధక యంత్రం మరియు ఔషధాల ద్వారా పురుషుడు తన చిన్న లింగాన్ని 75 రోజులలో 7 నుండి 8 అంగుళాల పొడవు, లావు, గట్టిగా, శక్తివంతంగా మరియు దృఢంగా చేసుకొనవచ్చును. మరియు తన ఇష్టానుసారం శృంగార సమయాన్ని పొడిగించుకోవచ్చును. శీఘ్రస్ఖలనం, నపుంసకత్వం, లింగము వదులుగా ఉండుట, చిన్నగా ఉండుట, సన్నగా ఉండుటను తొలగించుకోవడంకోసం 30 రోజుల ఔషధం.
ఇంటి దగ్గరకే ఔషధం తెప్పించుకోండి
08943212076

Printed & Published by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.